

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 8.00 సంపుటి: 15 సంచిక: 162

SUNDAY Special ఆదివారం 26-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సఫారీల కల నెరవేరేనా?

మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్ నేడు కేప్‌టౌన్‌లో జరగనుంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా తలపడనుంది.


- వివరాలు 12లో



అమెరికాను వణికిస్తున్న జాంబీ డ్రగ్

'జాంబీ' డ్రగ్‌గా వ్యవహరించే జైలజీన్ అమెరికాను వణికిస్తోంది. కారుచౌక, విచ్చలవిడి సరఫరా కారణంగా ఎక్కడ చూసినా డ్రగ్ బానిసలే కనిపిస్తున్నారు.

- వివరాలు 6లో



నేపాల్ అధ్యక్షుడిగా పౌద్యాల్ !

నేపాల్ దేశాధ్యక్ష ఎన్నికల్లో నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్ర పౌద్యాల్‌కు 8 రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి.

వివరాలు 6లో ▸



కేంద్రమంత్రి కాన్వాయ్‌పై దాడి

బెంగాల్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ కాన్వాయ్‌పై టీఎంసీ మద్దతుదారులుగా భావిస్తున్న కొందరు దాడికి పాల్పడ్డారు.

వివరాలు 6లో ▸



అమెరికాను వదలని మంచు

అమెరికాలోని పశ్చిమ రాష్ట్రాలను మంచు తుపాను వణికిస్తోంది. దాదాపు పది లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

వివరాలు 6లో ▸



మీలోని శక్తి ఎంత?

భావోద్వేగాలను అదుపులో పెట్టుకుంటూ మనల్ని మనం ఎలా శక్తిమంతులుగా సిద్ధం చేసుకోవాలో తెలిపే కథనం.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

రాయితీల జాడపై రామోజీ అబద్ధాల నీడ

చంద్రబాబుకు మేలు చేసేందుకు తహతహలాడుతున్న 'ఈనాడు'.. రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్‌పై విషం చిమ్మింది. పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ.. క్రమం తప్పకుండా రాయితీలిస్తున్నా కూడా.. 'పారిశ్రామిక రాయితీ జాడేది?' అంటూ మరో తప్పుడు కథనాన్ని వండివార్చింది.

వివరాలు 2లో ▸

ఏపీఎస్‌ఆర్టీసీకి జాతీయస్థాయి అవార్డు



ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థకు మరో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. డిజిటల్ టెక్నాలజీ విభాగంలో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' గ్రూప్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కేటగిరీలో ఆర్టీసీకి ఈ అవార్డు వచ్చింది.

వివరాలు 2లో ▸

ఏపీకి పరిశ్రమల పట్టం

44 నెలల్లో వాస్తవ రూపంలోకి రూ.75,649.77 కోట్ల పెట్టుబడులు

- ఇందులో భారీ, మెగా యూనిట్ల రూపేణా రూ.56,534.53 కోట్లు
- సగటున ఏటా రూ.15,418 కోట్లు..
- రూ.13,766 కోట్ల విలువైన 6 భారీ పరిశ్రమలను ప్రారంభించిన సీఎం
- వీటి ద్వారా 15,040 మందికి ఉపాధి
- రూ.13,962 కోట్ల విలువైన 17 భారీ పరిశ్రమలకు భూమి పూజ
- తద్వారా 24,866 మందికి లభించనున్న ఉపాధి
- రూ.35,672.28 కోట్ల విలువైన 7 భారీ యూనిట్లు ప్రారంభానికి సిద్ధం
- రూ.46,621.82 కోట్ల విలువైన మరో 5 భారీ యూనిట్లు భూమి పూజకు సిద్ధం
- ఏపీ ప్రభుత్వ సహకారం నేపథ్యంలో త్వరలో మరిన్ని పరిశ్రమలు



తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో సీఎం జగన్, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తదితరులు (ఫైల్)

సుదీర్ఘ తీర ప్రాంతం.. అపారమైన సహజ వనరులు.. మానవ వనరుల కొరత లేకపోవడం .. వీటన్నింటికీ తోడు అన్ని విధాలా ప్రభుత్వ సహకారం.. కొత్తగా పరిశ్రమ స్థాపించడానికి ఏ పారిశ్రామికవేత్తకైనా ఇంతకంటే ఏం కావాలి? ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉండటంతో దిగ్గజ సంస్థల చూపు ఇప్పుడు రాష్ట్రంపై పడింది. పరిశ్రమలు పెడుతున్న వారిని చేయి పట్టుకుని నడిపించేలా నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకు రావడంలో సీఎం వైఎస్ జగన్ ఇతరుల కంటే నాలుగడుగులు ముందుండటం కలిసివస్తోంది.

2లో

మల్లన్న సేవలో సీజేఐ



శ్రీశైలం ఆలయం వద్ద సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ దంపతులు, న్యాయమూర్తి జస్టిస్ నరసింహ దంపతులు తదితరులు

2లో

శాంతి ప్రక్రియలో భాగస్వామ్యానికి సిద్ధం



- ప్రధాని మోదీ ఢిల్లీలో జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో సమావేశమై ఆహారం, ఇంధన భద్రత, వాణిజ్యం తదితర అంశాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరిపారు. ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పదేపదే చెబుతోందన్నారు. శాంతి ప్రక్రియలో భాగస్వామిగా మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

- వివరాలు 6లో

నా ఇన్నింగ్స్ ముగిసింది!: సోనియా



- 'పార్టీలో నా ఇన్నింగ్స్ పూర్తి అయ్యిందని భావిస్తున్నా' అంటూ కాంగ్రెస్ ప్లీనరీలో ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఆమె క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారంటూ జాతీయ రాజకీయవర్గాల్లో చర్చ జరిగింది. దీంతో 'పార్టీ అధ్యక్షురాలిగా మాత్రమే తన ఇన్నింగ్స్ ముగిసిందన్నది సోనియా వ్యాఖ్యల ఉద్దేశం' అని కాంగ్రెస్ నాయకులు వివరణ ఇచ్చారు.

- వివరాలు 6లో

ప్రకృతి సాగులో రాష్ట్రం బెస్ట్

- కేంద్రం ప్రశంసలు.. సామాజిక ఆర్థిక సర్వేలో ప్రస్తావన
- ఏపీని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్ని రాష్ట్రాలకు సూచన
- ఏపీ స్ఫూర్తితో జాతీయస్థాయిలో కోటి ఎకరాల్లో ప్రకృతి సాగు
- రాష్ట్రంలో 3,730 గ్రామాల్లో 6.30 లక్షల మందితో సాగు
- ప్రకృతి సాగు ప్రయోజనాలు ఏపీలో నిరూపితమయ్యాయని కేంద్రం వెల్లడి



5లో



ఏపీలోనూ 'టెర్మినల్ మార్కెట్'

ఉద్యాన రైతులకు లాభం చేకూర్చే లక్ష్యంతో నంద్యాల జిల్లాలో ఏర్పాటు

- బెంగళూరు–హైదరాబాద్ హైవేపై ప్యాపిలి వద్ద తొలి టెర్మినల్ మార్కెట్
- ప్రస్తుతం ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో మాత్రమే టెర్మినల్ మార్కెట్లు పరిమితం
- 31 ఎకరాల్లో రూ.49.07 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వం
- గ్రేడింగ్, ప్యాకింగ్, స్టోరేజ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- మూడు రాష్ట్రాల రైతులకు ప్రయోజనం

టెర్మినల్ ప్లాంట్‌లో నిర్మాణాలు ఇలా..

- హోల్‌సేల్ దుకాణాలు: 36
- సెమీ రిటైల్ దుకాణాలు: 20
- రిటైల్ దుకాణాలు: 66
- రైపెనింగ్ చాంబర్లు: 6
- ప్రీ కూలింగ్ చాంబర్లు: 2
- కోల్డ్ స్టోరేజీలు: 4 చాంబర్లు
- ప్రాసెసింగ్ బ్లాక్: 1
- ఈటీపీ: 150 కేఎల్‌డీ
- ఎస్‌టీపీ: 20 కేఎల్‌డీ
- వే బ్రిడ్జి: 1
- ఓవర్ హెడ్ ట్యాంక్: లక్ష లీటర్లు

రైతులకు ఎంతో మేలు

టెర్మినల్ మార్కెట్‌తో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి. ఈ–నామ్ ద్వారా ఎవరు ఎక్కువ ధర కోట్‌చేస్తే వారు కొనుగోలు చేస్తారు. దళారీ వ్యవస్థ ఉండదు. ఈ–నామ్‌లో ఎవరైనా ధరలు కోట్ చేయొచ్చు. పంటలను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి నాణ్యత ఆధారంగా విక్రయించడం ద్వారా రైతులకు అధిక లాభం దక్కుతుంది. ధరలు లేనప్పుడు టెర్మినల్‌లోనే నిల్వ చేసుకోవచ్చు. దుకాణాల నుంచి స్టోరేజి వరకూ.. క్లీనింగ్ నుంచి ప్యాకింగ్ వరకూ అన్ని వసతులు టెర్మినల్ మార్కెట్ యార్డులో ఉంటాయి.

– నాగరాజు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, నంద్యాల



సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఉద్యాన రైతులు పండించే ఉత్పత్తులకు అత్యుత్తమ ధరలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. రైతుల కష్టానికి పూర్తి ప్రతిఫలం దక్కేలా శాశ్వత చర్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపక్రమించారు. ఇందుకోసం రాష్ట్రంలో 'టెర్మినల్ మార్కెట్ యార్డు' నిర్మాణానికి సంకల్పించారు. దేశంలోని ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఒడిశా తర్వాత నాలుగో 'టెర్మినల్ మార్కెట్'ను రాష్ట్రంలోని నంద్యాల జిల్లా ప్యాపిలిలో ఏర్పాటు చేస్తున్నారు. గ్రేడింగ్ చేసి 'ఈ–నామ్' ద్వారా విక్రయాలు జరపడం, ధర గిట్టుబాటు కాకపోతే అక్కడే నిల్వ చేసుకునే అవకాశం ఉండేలా దీనిని నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే ఉద్యాన పంటలు అత్యధికంగా సాగు చేసే రాయలసీమతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, తెలంగాణ, కర్ణాటకలోని పలు జిల్లాల రైతులకు మేలు కలుగుతుంది.

రైతులకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా..

ప్రస్తుతం రైతులు వారు పండించిన ఉద్యాన పంటలను మార్కెట్‌కు నేరుగా ట్రాక్టర్లలో తీసుకొచ్చి బాక్స్‌లు లేదా టన్నుల వంతున లాట్ల రూపంలో విక్రయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల 'లాట్' మొత్తానికి ఒకే ధర దక్కుతోంది. తద్వారా రైతుకు నష్టం వాటిల్లుతోంది. టెర్మినల్ మార్కెట్‌లో ప్రతి పంటను శుభ్రం చేసి కాయలు లేదా పండ్లను కేటగిరీల వారీగా గ్రేడింగ్ చేస్తారు. ఆ తర్వాత రంగు, నాణ్యత, సైజు ఆధారంగా ధరలు నిర్ణయిస్తారు. దీంతో క్వాలిటీ ఉత్పత్తులకు అధిక ధర, మధ్యస్థంగా ఉన్న వాటికి ఒక ధర, నాణ్యత తక్కువ ఉన్న వాటికి మరో ధర లభిస్తుంది. ఇలా గ్రేడింగ్ చేసి విక్రయించడం వల్ల రైతుకు లాభం చేకూరుతుంది.

బెంగళూరు-హైదరాబాద్ మధ్య నిర్మాణం

కశ్మీర్–కన్యాకుమారి జాతీయ రహదారి–44ని అనుకుని ప్యాపిలి వద్ద 31 ఎకరాల్లో రూ.49.07 కోట్లతో టెర్మినల్ మార్కెట్ నిర్మించనున్నారు. ఈ మార్కెట్ నుంచి బెంగళూరు 285, హైదరాబాద్ 293 కిలోమీటర్ల దూరం. ఉద్యాన పంటలు సాగుచేసే కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల మధ్య రవాణాకు వీలుగా దీనిని నిర్మిస్తున్నారు. ఈ మార్కెట్ చిత్తూరు, తిరుపతి జిల్లాలతోపాటు తెలంగాణలోని పలు జిల్లాల రైతులకు కూడా ఉపయోగపడనుంది. దీని నిర్మాణానికి రూ.49.07 కోట్ల వ్యయం కానుండగా.. పీపీపీ విధానంలో పనులు చేపడతారు. రూ.12 కోట్లను ఉద్యాన శాఖ కేటాయిస్తుంది. మిగిలిన మొత్తం ఏజెన్సీ ఖర్చు చేయాలి. రైతులకు మేలు చేసే ఈ ప్రాజెక్ట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

పులికాట్‌కు మహర్దశ

దశాబ్దాల సమస్యకు పరిష్కారం

- రాయదొరువు వద్ద ముఖద్వారం పూడికతీత
- సాగరమాల కింద రూ.129 కోట్లు మంజూరు
- 2,800 మీటర్లు డ్రెడ్జింగ్ చేసేందుకు ప్రణాళిక
- పనులు పూర్తయితే 50 వేలమంది మత్స్యకారులకు ఉపాధి
- 152 రకాల విదేశీ వలస విహంగాలకు పుష్కలంగా ఆహారం
- ప్రజాసంకల్ప యాత్ర హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్



శ్రీహరికోట సమీపంలోని రాయదొరువు సముద్ర ముఖద్వారం వద్ద సరస్సులో ఇసుకమేటలు (ఫైల్)

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లాలోని పులికాట్ సరస్సుకు మంచిరోజులు వస్తున్నాయి. దశాబ్దాల తర్వాత రాయదొరువు వద్ద సరస్సు ముఖద్వారం పూడికతీత పనులకు మోక్షం కలుగుతోంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో సహజసిద్ధంగా ఏర్పడిన అతి సుందరమైన పులికాట్ సరస్సును సంరక్షించుకునేందుకు.. బంగాళాఖాతం నుంచి మన రాష్ట్రం వైపు ఉన్న ముఖద్వారంలో పూడికను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేసింది. సాగరమాల ప్రాజెక్టు కింద కేంద్రం నుంచి రూ.129 కోట్లు సాధించి పనులు చేసేందుకు సిద్ధమైంది. 2,800 మీటర్లు డ్రెడ్జింగ్ చేసేందుకు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ముందుకొచ్చింది. తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా ముఖద్వారం వద్ద ఇసుక మేటలను ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు చేపట్టాలన్న పులికాట్ వన్యప్రాణి సంరక్షణ విభాగం ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ పనులు పూర్తయితే ఆరు మండలాల్లో సుమారు 50 వేలమంది మత్స్యకారులకు జీవనోపాధి లభించడమేగాక 152 రకాల విదేశీ వలస విహంగాలకు ఆహారం సమకూరుతుంది.

జీవవైవిధ్య సరస్సు

పులికాట్ సరస్సుకు బంగాళాఖాతం నుంచి తమిళనాడు పరిధిలోని పలవేరికాడ్ వద్ద ఒక ముఖద్వారం, మన రాష్ట్రంలో రాయదొరువు వద్ద మరొక ముఖద్వారం ఉన్నాయి. వర్షాకాలంలో స్వర్ణముఖి, కాళంగి నదులతోపాటు చిన్నాచితక కాలువలనుంచి మంచినీరు సరస్సుకు చేరుతుంది. సముద్రంలో ఆటుపోట్లు వచ్చి అలల ఉధృతి పెరిగినప్పుడు అందులో నుంచి ఉప్పునీరు పులికాట్‌లోకి ప్రవేశిస్తుంది. మంచినీరు, ఉప్పునీరు కలగలిసిన సంగమం కాబట్టి దీన్ని జీవవైవిధ్య సరస్సుగా పర్యావరణవేత్తలు గుర్తించారు. జీవవైవిధ్యాన్ని సంతరించుకున్న రెండో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు అయిన పులికాట్.. ఏటా వేసవికి ముందే ముఖద్వారాలకు అడ్డంగా ఇసుకమేటలు పడి ఎడారిలా మారుతోంది.

మాటలుచెప్పి మోసం చేసిన టీడీపీ ప్రభుత్వం

టీడీపీ ప్రభుత్వ కాలంలో మత్స్యకారుల ఓట్లకు గాలం వేసి పూడికలు తీయిస్తామని చెప్పి 14 సంవత్సరాలు గడిపేశారే తప్ప ఒక్క ఫైల్ కూడా ముందుకు కదిలించలేదు. 1994 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ అప్పటి కేంద్ర ప్రభుత్వాలతో సన్నిహితంగా ఉన్నా పులికాట్ సరస్సు అభివృద్ధి గురించి మాత్రం పట్టించుకోలేదు. 2018లో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించినప్పుడు అప్పటి పర్యాటకశాఖ మంత్రి పులికాట్ సరస్సు పూడికతీత పనులకు రూ.48 కోట్లు మంజూరు చేశామని చంద్రబాబు చెప్పినట్టుగా ప్రకటించారు. ఈ మాటలు నిజం కాదని తెలిసిన మత్స్యకారులు 2019 ఎన్నికల్లో మూకుమ్మడిగా జగన్‌కు మద్దతు తెలిపారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా జగన్ సీఎం అయ్యాక పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీత పనులకు నిధులు సాధించారు.

ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన మాట మేరకు..

పులికాట్‌లో మంచినీళ్లు, ఉప్పునీళ్లు కలగలిసి 45 శాతం సెలైనిటీ కలిగి ఉండడంతో ఇక్కడ మత్స్యసంపద అభివృద్ధి చెందుతుంది. సముద్రంలో నుంచి ఉప్పునీరు రావడం తగ్గిపోవడంతో సెలైనిటీ తగ్గిపోయి మత్స్యసంపద తగ్గిపోతోంది. ఒకప్పుడు సంవత్సరానికి ఏడుటన్నుల నుంచి ఎనిమిది టన్నుల మత్స్యసంపద దొరికేది. నేడు సంవత్సరానికి ఒక్క టన్ను కూడా దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని మత్స్యకారులు ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌కు వివరించారు. ఈ సమస్య తీరుస్తానని ఆయన వారికి మాటిచ్చారు. ఆ మేరకు పూడికతీత పనులు చేయించేందుకు కేంద్రంతో సంప్రదించి రూ.129 కోట్లు రాబట్టారు. జగనన్న ఎన్నికలకు ముందు మత్స్యకారులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ నిధులు తీసుకురావడంలో పెద్దన్న పాత్ర పోషించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో ఈ సమస్యను ప్రస్తావించారు.

నిధులు సాధించామనే తృప్తి ఉంది



పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీతకు నిధులు తీసుకొచ్చినందుకు తృప్తిగా ఉంది. సాగరమాల ప్రాజెక్టు కింద రూ.129 కోట్లు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అభినందనలు. మత్స్యకారుల జీవితాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈ నిధులు మంజూరు చేయించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

మాట నిలబెట్టుకున్నందుకు సంతోషంగా ఉంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో నాయుడుపేటలో నిర్వహించిన మత్స్యకారుల సదస్సులో వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. పులికాట్ సరస్సు ముఖద్వారం పూడికతీయడం అంటే గడిచిన 50 ఏళ్లలో చరిత్రగా మిగిలిపోతుంది. జగనన్న కూడా చరిత్రలో ఒక మంచి ముఖ్యమంత్రిగా నిలుస్తారు.

– కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

తమిళనాడు తరహాలో పూడిక తీయబోతున్నందుకు సంతోషం



తమిళనాడు వైపు పల్‌వేరికాడ్ వద్ద ఉన్న సముద్ర ముఖద్వారానికి పూడికతీసే తరహాలోనే ఇక్కడ కూడా పూడిక తీయడానికి సన్నద్ధమవుతున్నందుకు సంతోషంగా ఉంది. ఈ పనులు పూర్తయితే సరస్సు నిత్యం జలకళతో ఉంటుంది. మా మత్స్యకారులకు చేతినిండా పని దొరుకుతుంది. తద్వారా అందరికీ ఉపాధి ఏర్పడి సరస్సుపై సరిహద్దు వివాదాలు కూడా సమసిపోతాయి. ముఖద్వారం పూడిక తీయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.129 కోట్లు మంజూరు చేయించి పనులు చేయబోతున్నందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తాం.

– ఆర్.శివాజీ, పులికాట్ జాలర్లసంఘం నాయకుడు

ఏపీఎస్‌ఆర్టీసీకి జాతీయస్థాయి అవార్డు

- ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ పోటీల్లో డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డు
- ఇటీవల ప్రవేశపెట్టిన డిజిటల్ చెల్లింపులకు అవార్డు
- వరుసగా ఐదోసారి అవార్డు పొందిన ఏపీఎస్‌ఆర్టీసీ



అవార్డు స్వీకరిస్తున్న ఆర్టీసీ ఈడీ కోటేశ్వరరావు, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస రావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థకు మరో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. డిజిటల్ టెక్నాలజీ విభాగంలో 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' గ్రూప్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ కేటగిరీలో ఆర్టీసీకి ఈ అవార్డు వచ్చింది. మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని ప్రయాణికులకు అత్యుత్తమ సేవలందించడంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఎప్పుడూ ముందుంటుందని నిర్వాహకులు కితాబిచ్చారు. ఇటీవలే కాగిత రహిత సేవలను ప్రవేశపెట్టిన ఆర్టీసీ యూటీఎస్(యూనిఫైడ్ టికెటింగ్ సొల్యూషన్స్) ద్వారా డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. 2023 సంవత్సరానికి సంబంధించి ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్ విభాగంలో 5వ సారి డిజిటల్ టెక్నాలజీ సభ అవార్డుకు ఏపీఎస్ ఆర్టీసీని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్ ఎంపిక చేసింది. యాప్ ద్వారా నగదు రహిత లావాదేవీలు, కాగిత రహిత టికెట్లను సులభంగా జారీచేసే సౌలభ్యాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చిందంటూ ఆర్టీసీని ఈ సందర్భంగా ప్రశంసించింది. కొచ్చిలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) ఎ.కోటేశ్వరరావు, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వై.శ్రీనివాసరావు ఈ అవార్డును అందుకున్నారు. వరుసగా ఐదోసారి ఈ అవార్డు ఏపీఎస్‌ఆర్‌టీసీకి దక్కడం ఆనందంగా ఉందని వారు హర్షం వ్యక్తంచేశారు.

ఎండీయూ ఆపరేటర్లకూ వాహనమిత్ర

- 2021 నుంచి అమలుకు సీఎం జగన్ ఆదేశాలు
- పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్లకు బీమా ప్రీమియాన్ని ఈ ఏడాది నుంచి వాహన మిత్ర పథకంలో భాగంగా చెల్లించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. తమకు వచ్చే వేతనం నుంచి ఎండీయూ వాహనాల ప్రీమియాన్ని ఏటా బ్యాంకులు జమ చేసుకోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎండీయూ ఆపరేటర్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావుకు విన్నవించారు. ఇదే విషయాన్ని మంత్రి కారుమూరి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే సీఎం సానుకూలంగా స్పందించారు. బీమా ప్రీమియం చెల్లింపును వాహనమిత్ర పథకం కిందకు చేర్చి 2021 నుంచి అమలు చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ఈ ఏడాది జూలైలో సొంతంగా ఆటో, ట్యాక్సీలు నిర్వహించుకునే వారికి చెల్లించే వాహనమిత్ర పథకంతో.. ఎండీయూ ఆపరేటర్లకూ ప్రీమియం మొత్తం రూ.9 కోట్లు ప్రభుత్వం నేరుగా చెల్లించనుందని మంత్రి కారుమూరి శనివారం రాత్రి ఓ ప్రకటనలో వెల్లడించారు.

పురుగుమందుల దుకాణాల్లో సోదాలు

31 కేసులు నమోదు చేసిన విజిలెన్స్ అధికారులు



సాక్షి, అమరావతి: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు శనివారం రాష్ట్రవ్యాప్తంగా 77 హోల్‌సేల్, రిటైల్ ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయా షాపుల్లో ఈ–పోస్ యంత్రంలో పేర్కొన్న నిల్వలకు, బుక్ బ్యాలెన్స్‌లో ఉన్న నిల్వలకు పొంతన లేకపోవడం, ఓ–ఫారం లేకుండా ఎరువుల విక్రయం, స్టాక్ రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయించడం, బిల్లు పుస్తకాలు, స్టాక్ బోర్డులు నిర్వహించకపోవడం తదితర అవకతవకలు జరుగుతున్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు రూ.29.14 లక్షల విలువైన 243.192 టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకుని 18 కేసులు నమోదు చేశారు. అలాగే రూ.7.10 లక్షల విలువైన 92 టన్నుల ఎరువులను సీజ్ చేసి రెండు కేసులు నమోదు చేశారు. రూ.19.37లక్షల విలువైన 965 లీటర్ల పురుగుమందులను స్వాధీనం చేసుకుని 11 కేసులు నమోదు చేశారు. మరో రూ.2.96లక్షల విలువైన 105.95 కేజీల ఘన పురుగుల మందు నిల్వలను సీజ్‌చేశారు.

గ్రూప్–2, గ్రూప్–3 పోస్టులకు సీపీటీలో అర్హత తప్పనిసరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రూప్–2, గ్రూప్–3 తదితర క్యాడర్ పోస్టుల నియామక ప్రక్రియలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇకపై ఈ పోస్టులకు నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో విజయం సాధించినవారు తప్పనిసరిగా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (సీపీటీ)లో కూడా అర్హత సాధించాల్సి ఉంటుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ శనివారం ఉత్తర్వులు (జీవో నంబర్–26) జారీచేశారు. దీనికి సంబంధించిన అడహక్ నిబంధనలను జీవో నంబర్ 26లో పొందుపరిచారు. సీపీటీ టెస్ట్‌కు సంబంధించిన సిలబస్, రిజర్వేషన్ల వారీగా అర్హత మార్కులను కూడా ఉత్తర్వుల్లో వివరించారు. కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లో అర్హత సర్టిఫికెట్ లేకుండా నేరుగా ఏ ఒక్కరికీ ఆయా పోస్టుల్లో నియామకాలకు అవకాశం లేదని స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లేదా ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యా, శిక్షణ బోర్డు, లేదా రాష్ట్ర యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, యూజీసీ గుర్తింపు ఉన్న ఇతర సంస్థలు నిర్వహించే ఈ కంప్యూటర్ ప్రొఫెషియన్సీ పరీక్షలో అర్హత సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్ష 100 మార్కులకు ఉంటుందని, పరీక్ష సమయం 60 నిమిషాలని వివరించారు. ఈ పరీక్షలో అర్హత కోసం ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 30 మార్కులు, బీసీలు 35, ఓసీలు 40 మార్కులు సాధించాలని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన సిలబస్, పరీక్ష ప్యాట్రన్‌ను ఉత్తర్వుల్లో పొందుపరిచారు.





రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతితో గవర్నర్ భేటీ

నేడు ప్రధాని మోదీ, అమిత్‌షాలతో సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ : ఏపీ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ అబ్దుల్ నజీర్ శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం దేశ రాజధానికి చేరుకున్న గవర్నర్.. తొలుత రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్‌తో సమావేశమయ్యారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీతో, సాయంత్రం 6:30 గంటలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ కానున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు రూ.5.30 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని దివ్యాంగ విద్యార్థులకు గృహ ఆధారిత విద్య, రవాణా భత్యం చెల్లించేందుకు రూ.5,29,95,000లను సమగ్ర శిక్ష నుంచి విడుదల చేస్తూ ఆ సంస్థ రాష్ట్ర సంచాలకుడు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దివ్యాంగ పిల్లలకు విద్యను అందించేందుకు సమగ్ర శిక్షా 'సహిత విద్య' (ఇన్ క్లూజీవ్ ఎడ్యుకేషన్) కింద ఈ నిధులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఏపీకి పరిశ్రమల పట్టం

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023
మార్చి 3-4, విశాఖపట్నం..
www.advantageap.in

సాక్షి, అమరావతి : పెట్టుబడులు పెట్టేందుకు దేశంలోని దిగ్గజ సంస్థలు పారిశ్రామిక అనుకూల విధానాలున్న మన రాష్ట్రం వైపు చూస్తున్నాయి. ఇప్పటికే టాటాలు, బిర్లాలు, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఫీ్వ, భజాంకా, భంగర్ లాంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో పెట్టుబడులు పెట్టడానికి అనేక దిగ్గజ సంస్థలు ఆసక్తిని వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి సీఎం అధ్యక్షతన ఢిల్లీతో పాటు బెంగళూరు, చెన్నై, ముంబయి, హైదరాబాద్ వంటి పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోలకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన వచ్చింది. కోవిడ్ సంక్షోభ సమయంలో రాష్ట్ర పరిశ్రమలను ఆదుకునేలా సీఎం జగన్ చూపిన చొరవ దేశ పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. అప్పటికే రాష్ట్రంలో అడుగుపెట్టిన పరిశ్రమలు త్వరితగతిన ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటూనే.. మరో పక్క కొత్త పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రభుత్వం వేగంగా అడుగులు ముందుకు వేసింది. గత 44 నెలల్లో పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావడంతోపాటు, సులభతర వాణిజ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అగ్రగామిగా ఉండటం పారిశ్రామిక వేత్తలను ఇటువైపు వచ్చేలా చేస్తోంది.

కోవిడ్ సమయంలో ఉపాధి

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పగ్గాలు చేపట్టిన తర్వాత 2019 జూన్ నుంచి 2023 జనవరి వరకు రూ.75,649.77 కోట్ల విలువైన పెట్టుబడులు (ఎంఎస్ఎంఈ సహా) వాస్తవ రూపంలోకి వచ్చాయి. ఇందులో 111 భారీ, మెగా యూనిట్లు రూ.56,534.53 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి ప్రారంభించాయి. వీటి ద్వారా 73,876 మందికి ఉపాధి లభించింది. అంటే సగటున ఏడాదికి రూ.15,418 కోట్ల పెట్టుబడులతో ఉత్పత్తి మొదలైంది. ఇందులో సీఎం వైఎస్ జగన్ చేతులు మీదుగా రూ.13,766 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఆరు యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభమైంది. వీటి ద్వారా 15,040 మందికి ఉపాధి లభించింది. ఇవి కాకుండా రూ.7,305 కోట్ల విలువైన కియా పరిశ్రమ వాణిజ్య పరమైన ఉత్పత్తిని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2019 డిసెంబర్ 5న లాంఛనంగా ప్రారంభించారు. వీటికి అదనంగా ఎంఎస్ఎంఈ రంగంలో 1,52,558 కొత్త యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.19,115.24 కోట్ల పెట్టుబడులు రావడమే కాకుండా 13,63,706 మందికి ఉపాధి లభించింది. ప్రస్తుత ప్రభుత్వంలో గత 44 నెలల్లో సుమారు 24 నెలలు కోవిడ్ సంక్షోభంతో గడిచి పోయినప్పటికీ భారీ ఎత్తున పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో ముందంజలో ఉందని స్పష్టమవుతోంది.

మరో రూ.2.35 లక్షల కోట్ల పెట్టుబడులు

ఇవికాక మరో 86 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,35,125.60 కోట్ల పెట్టుబడులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇవీ వాస్తవ రూపంలోకొస్తే 2,36,806 మందికి ఉపాధి లభించనుంది. వీటిలో రూ.35,672.28 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి ఏడు భారీ యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి ద్వారా 7,015 మందికి ఉపాధి లభించనుంది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక సుమారు రూ.13,962 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన 17 యూనిట్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీటి ద్వారా 24,866 మందికి ఉపాధి లభించనుంది. మరో 5 భారీ యూనిట్లు అన్ని అనుమతులు తీసుకొని నిర్మాణ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటి ద్వారా రూ.46,621.82 కోట్ల పెట్టుబడులతో 15,800 మందికి ఉపాధి లభించనుంది.

సీఎం చేతుల మీదుగా ఉత్పత్తి ప్రారంభమైన యూనిట్లు

కంపెనీ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం	తేదీ
గ్రాసిం ఇండస్ట్రీస్	861	1,300	కాస్టిక్ సోడా	21-04-22
ప్యానల్ ఆప్టో డిస్‌ప్లే టెక్నాలజీస్	1,230	2,200	టీవీ డిస్‌ప్లే ప్యానల్స్	23-06-22
ఫాక్స్‌లింక్ ఇండియా ఎలక్ట్రిక్	1,050	2,000	ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్స్	23-06-22
సన్నీ ఒప్పొ టెక్	280	1,200	కెమెరా మాడ్యుల్స్	23-06-22
ఏటీసీ టైర్స్	1,250	840	హాఫ్ హైవే టైర్స్	16-08-22
రాంకో సిమెంట్స్	1,790	1000	సిమెంట్	28-09-22

సీఎం భూమి పూజ చేసిన పరిశ్రమలు

కంపెనీ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం	తేదీ
ఇంటెలిజెంట్ సెజ్	70	2,000	పాదరక్షల ఉపకరణాలు	25-12-20
సెంచురీ ప్యానల్స్	1,600	2,000	ప్లేవుడ్ ప్యానల్స్	23-12-21
ఆదిత్య బిర్లా గార్మెంట్స్	110.38	2,112	గార్మెంట్స్	24-12-21
హిల్‌టాప్ సెజ్ ఫుట్‌వేర్	700	10,000	పాదరక్షలు	23-06-22
డిక్సన్ టెక్నాలజీస్	108	830	టెలివిజన్స్	23-06-22
ఫాక్స్‌లింక్ ఇండియా విస్తరణ	300	1,200	స్మార్ట్ వాచీలు, ఇయర్ పాడ్స్	23-06-22
ఏటీసీ టైర్స్ ఫేజ్–2	1,000	1,160	టైర్ల తయారీ	16-08-22
పిడిలైట్ ఇండస్ట్రీస్	202	280	వాటర్ ప్రూఫింగ్ ఉత్పత్తులు	16-08-22
మెఘా ఫ్రూట్ ప్రాసెసింగ్	186	677	ఆహార ఉత్పత్తులు	16-08-22
ఐనాక్స్ ఎయిర్ ప్రొడక్ట్స్	145	70	పారిశ్రామిక వాయువులు	16-08-22
ఆప్టిమస్ డ్రగ్స్	125	185	ఫార్మాస్యూటికల్స్	16-08-22
విన్‌విన్ స్పెషాల్టీ ఇన్సులేటర్స్	108	382	ఇన్సులేటర్స్	16-08-22
స్టేరాక్స్ లైఫ్ సైన్సెస్	88	450	బల్క్ డ్రగ్స్	16-08-22
సినాప్టిక్స్ ల్యాబ్స్	82	300	బల్క్ డ్రగ్స్	16-08-22
ఇషా రిసోర్సెస్	68	220	కోక్ అండ్ కోల్ స్క్రీనింగ్	16-08-22
అసాగో ఇండస్ట్రీస్	270	500	బయో ఇథనాల్	04-11-22
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	8800	2,500	ఉక్కు తయారీ	15-02-23

ఉత్పత్తి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మరికొన్ని భారీ పరిశ్రమలు

కంపెనీ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం
కింబెర్లీక్లార్క్ ఇండియా	368	117	టెక్స్‌టైల్
మునోత్ ఇండస్ట్రీస్	124	350	లిథియం బ్యాటరీలు
హెచ్‌పీసీఎల్ రిఫైనరీ విస్తరణ	28,000	3,500	పెట్రో కెమికల్స్
పయనీర్ అల్యూమినియం	6,700	2,300	అల్యూమినియం
భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్	300	300	రక్షణ రంగ ఉత్పత్తులు
బీఆర్‌వీ ఏషియా పసిఫిక్	95.28	264	హీట్ ఎక్స్ఛేంజర్ యూనిట్
డాల్వకోట్ బయోఫ్యూయల్స్	85	184	ఇథనాల్ తయారీ

నిర్మాణ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న కొన్ని యూనిట్లు

కంపెనీ పేరు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి	రంగం
క్రిభ్‌కో బయో ఇథనాల్	560	400	బయో ఇథనాల్
ధైకీ అల్యూమినియం ఇండస్ట్రీస్	570	700	అల్యూమినియం ఇన్‌గాట్స్
కాసిస్ ఈ మొబిలిటీ	386.23	1200	ఎలక్ట్రిక్ బస్సుల తయారీ
లైఫస్ ఫార్మా	1,962.64	2,000	ఫార్మాస్యూటికల్స్
ఇండోసోల్ సోలార్	43,143	11,500	సోలార్ పీవీ మాడ్యుల్స్ తయారీ

రాయితీల జాడపై రామోజీ అబద్ధాల నీడ

రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుపై రామోజీ విషం

- తన బాబుకు మేలు చేకూర్చాలని పదేపదే తప్పుడు రాతలు
- గత ప్రభుత్వంలో రూ.3,409 కోట్లు పారిశ్రామిక రాయితీ బకాయిలు
- నాడు ప్రశ్నిస్తూ ఒక్క వాక్యం రాయని ఈనాడు
- ఈ మూడున్నరేళ్లలో బకాయిలతో పాటు సకాలంలో రాయితీలు
- ఎంఎస్ఎంఈలకు క్రమం తప్పకుండా రాయితీలు విడుదల
- ఏకంగా రూ.1706.16 కోట్ల రాయితీలు విడుదల
- కోవిడ్ సమయంలో రీస్టార్ట్ ప్యాకేజీతో అండగా నిలిచిన సర్కారు
- వీటన్నింటి వల్లే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ నంబర్ వన్
- ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల రాయితీల విడుదలలో కాస్త ఆలస్యం
- ఈ వాస్తవాలను ప్రస్తావించకుండా ఈనాడు బురదజల్లే యత్నం

సాక్షి, అమరావతి : తనకు కావాల్సిన వ్యక్తి ముఖ్యమంత్రిగా లేరని, అతన్ని ఆ పీఠంపై తిరిగి కూర్చోబెట్టడానికి అనుకూల వాతావరణం సృష్టించేందుకు 'ఈనాడు' తహతహలాడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రగతిని పణంగా పెడుతూ నీచ రాజకీయాలకు తెరలేపింది. ఒక్కో రోజు ఒక్కో కట్టు కథతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొన్నటికి మొన్న టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా.. కొట్టారంటూ పాత ఫొటోలతో తప్పుడు ప్రచారం చేసింది. ప్రజలు గుర్తించి సోషల్ మీడియా ద్వారా దుమ్మెత్తిపోయడంతో తప్పు ఒప్పుకుంటూనే.. తిరిగి అవే తప్పులు చేయడమే పనిగా పెట్టుకుంది. గడిచిన మూడున్నరేళ్లలో రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ఊతమిస్తూ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ.. 'పారిశ్రామిక రాయితీ జాడేది?' అంటూ తాజాగా మరో కథనాన్ని వండివార్చింది. తద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఆగిపోవాలని, పారిశ్రామిక వేత్తలు వెనకడుగు వేయాలనే దుర్బుద్ధి కనిపిస్తోంది. గత ప్రభుత్వం పరిశ్రమలకు వేల కోట్ల రూపాయల రాయితీలు ఇవ్వకుండా బకాయి పెట్టి రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని అంధకారంలోకి నెట్టిన విషయాన్ని ఏ రోజూ మాట మాత్రంగానైనా రామోజీ ప్రశ్నించ లేదు. ఈ ప్రభుత్వం వరుసగా రాయితీలు విడుదల చేస్తున్నా, తప్పుడు రాతలతో విషం కక్కడం పూర్తిగా రాజకీయ ప్రేరేపితమే. కోవిడ్ సమయంలో పరిశ్రమలు భారీగా ఆదాయం నష్టపోయినా, రీస్టార్ట్ ప్యాకేజీతో ఈ ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకుందన్న పచ్చి నిజాన్ని దాచడం దుర్మార్గం కాదా? భారీ సంక్షోభాన్ని సైతం ధైర్యంగా ఎదుర్కొని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడంతో పాటు పారిశ్రామిక వేత్తలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని ప్రశంసించాల్సింది పోయి ఇలా పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేయడం న్యాయమా?

ఆరోపణ: రాయితీలు ఇవ్వలేదు

వాస్తవం: గత ప్రభుత్వం రూ.3,409 కోట్ల రాయితీలను పరిశ్రమలకు బకాయి పెట్టి రాష్ట్ర పారిశ్రామిక వాతావరణాన్ని దారుణంగా దెబ్బతీసింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈ రంగానికి సకాలంలో రాయితీలను విడుదల చేస్తూ వచ్చింది. 2019–20లో రూ.46 కోట్లు, 2020–21లో రీస్టార్ట్ ప్యాకేజీ ద్వారా రూ.993.30 కోట్ల రాయితీలను విడుదల చేయడం ద్వారా కోవిడ్ సంక్షోభంలో 8,000 ఎంఎస్ఎంఈలకు ఆర్థికంగా అండగా నిలిచింది. ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో ఎంఎస్ఎంఈలకు పారిశ్రామిక రాయితీలు విడుదల చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంలో 2021–22లో రూ.666.86 కోట్ల రాయితీలను విడుదల చేశారు. 2022–23కు సంబంధించి ఆగస్టులో పారిశ్రామిక రాయితీలను విడుదల చేయాల్సి ఉండగా, మార్చిలో గ్లోబల్ ఇన్వెస్టర్ మీట్‌ను విశాఖలో నిర్వహిస్తున్న తరుణంలో దానికి ఒక నెల ముందు పారిశ్రామిక రాయితీలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే అంతలో ఎంఎల్‌సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో రాయితీల విడుదలకు బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ అయిపోగానే పారిశ్రామిక రాయితీలను విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ వాస్తవాలను ఏమాత్రం ప్రస్తావించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు ముందు రాష్ట్రం పరువు తీయాలని ఈనాడు లక్ష్యంగా పెట్టుకుందని స్పష్టమవుతోంది.



ఈనాడు

పారిశ్రామిక రాయితీ జాడేది?

ఫ్యాక్ట్ చెక్

ఆరోపణ: విద్యుత్ డిమాండ్ చార్జీల సంగతీ అంతే..

వాస్తవం: గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ఏటా క్రమం తప్పకుండా రాయితీలను విడుదల చేస్తూ, పారిశ్రామిక వేత్తలకు అన్ని విధాలుగా చేదోడుగా నిలబడటంతో సులభతర వాణిజ్య ర్యాంకుల్లో వరుసగా మూడో సంవత్సరం ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. పూర్తిగా 100 శాతం రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తల నుంచి అభిప్రాయాలను సేకరించి ప్రకటిస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోడీబీ) ర్యాంకుల్లో రాష్ట్రం మొదటి స్థానంలో నిలబడటం అంటే రాష్ట్ర ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో మూడు నెలల కాలానికి విద్యుత్ రంగానికి చెందిన ఫిక్స్‌డ్ డిమాండ్ చార్జీలను పూర్తిగా రద్దు చేయడంతో పాటు భారీ పరిశ్రమలకు ఎటువంటి పెనాల్టీలు లేకుండా వాయిదాల పద్ధతిలో చెల్లించే అవకాశాన్ని కల్పించింది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు వైఎస్సార్ బడుగు వికాసం కింద 9,631 యూనిట్లకు రూ.661.58 కోట్ల రాయితీలు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు 2,207 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తలు రూ.111.08 కోట్లు, 424 ఎస్టీ పారిశ్రామికవేత్తలు రూ.24.31 కోట్ల రాయితీలు అందుకున్నారు. వైఎస్సార్ నవోదయం కింద 1.08 లక్షల ఎంఎస్ఎంఈ రుణ ఖాతాలకు చెందిన రూ.3,236 కోట్ల రుణాలను ప్రభుత్వం రీ–షెడ్యూల్ చేసింది.

మల్లన్నను దర్శించుకున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ దంపతులు, జస్టిస్ నరసింహ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం



ఆలయం వద్ద సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న అర్చక స్వాములు, దేవస్థానం చైర్మన్, ఈవో తదితరులు

శ్రీశైలం టెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ ధనుంజయ వై చంద్రచూడ్, కల్పనాదాస్ దంపతులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, సత్యప్రభ దంపతులు శనివారం రాత్రి దర్శించుకున్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ మర్యాదలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దంపతులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తి దంపతులు రత్నగర్భ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మల్లికా గుండంలో ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని, అనంతరం భ్రమరాంబాదేవి అమ్మ వారిని దర్శించుకున్నారు. వీరి వెంట పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, శ్రీశైలం శాసన సభ్యుడు శిల్పాచక్రపాణి రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు, తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ కె.సుజన, దేవదాయ శాఖ కమిషనర్ ఎం హరిజవహర్‌లాల్, కర్నూలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎన్.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా...

వ్యోమగాముల గది రెడీ

గగన్‌యాన్ ప్రాజెక్టులో మరో ముందడుగు



గగన్‌యాన్ కోసం తయారు చేసిన వ్యోమగాముల గది వద్ద ఇస్రో శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రయోగం కోసం వ్యోమగాముల గది(సిమ్యులేటెడ్ క్రూ మాడ్యూల్) సిద్ధమయ్యింది. కేరళలోని తిరువనంతపురంలో ఉన్న విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో దీనిని ఆవిష్కరించినట్లు ఇస్రో ప్రకటించింది. అంతరిక్షయానం చేసే సమయంలో వ్యోమగాములు ఎలాంటి ఒత్తిడికి గురవ్వకుండా దీనిని తయారు చేసినట్లు ఇస్రో తెలిపింది. ఈ మొట్టమొదటి స్వదేశీ క్రూ మాడ్యూల్‌ను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అభివృద్ధి చేయగా.. హైదరాబాద్‌కు చెందిన మంజీరా మెషిన్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో తయారు చేశామని ఇస్రో వెల్లడించింది. ఈ మాడ్యూల్‌ను అనేక సార్లు పరీక్షించి.. పనితీరును నిర్ధారించుకుంటామని పేర్కొంది. ఇందులో అమర్చిన సబ్‌సిస్టమ్స్ పనితీరును, క్రూ ఎస్కేప్ సిస్టం పనితీరును పరీక్షిస్తామని ఇస్రో తెలిపింది.

ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు వయోపరిమితి పెంపుపై హర్షం

సీఎం వైఎస్ జగన్‌కు ఓసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరుణాకరరెడ్డి కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి/ కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అగ్రవర్ణ పేదల అభివృద్ధి, సంక్షేమం కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను ఐదేళ్లు పొడిగించడం, ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ పడే అభ్యర్థులకు వయో పరిమితిని ఐదేళ్లు సడలించడం హర్షణీయమని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తున్నప్పటికీ ఎక్కడా వయోపరిమితి సడలించలేదని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఇక నుంచి వెలువడే అన్ని ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు వయోపరిమితిని 34 నుంచి 39 సంవత్సరాలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో వేలాది మంది నిరుద్యోగ ఓసీ అభ్యర్థులు లబ్ధి పొందే అవకాశం ఉందని తెలిపారు. కాపు, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, కమ్మ, వైశ్య కార్పొరేషన్‌లను ఈడబ్ల్యూఎస్ శాఖ పరిధిలోకి తీసుకురావడం శుభపరిణామమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల నిబంధనలను రాష్ట్రంలో సరళతరం చేసి రూ.8లక్షల ఆదాయ పరిమితిని మాత్రమే పరిగణలోకి తీసుకునేలా ఉత్తర్వులు ఇవ్వడం నిరుపేద ఓసీలకు మేలు చేస్తుందని తెలిపారు.

జర్నలిస్టులను బలి చేయడం దారుణం

'ఈనాడు'పై వార్తా పత్రికలు, జర్నలిస్ట్ సంఘాల ఆగ్రహం

సాక్షి, అమరావతి: చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం పాత ఫొటోలతో టీడీపీ నాయకుడు పట్టాభి కథనాన్ని అల్లడమే కాకుండా.. అది బట్టబయలైన తర్వాత డెస్క్ జర్నలిస్టులను బలి చేయడం దారుణమంటూ 'ఈనాడు'పై వార్తా పత్రికలు, జర్నలిస్ట్ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. చిన్న, మధ్యతరహా వార్తా పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు శనివారం ఒక ప్రకటనలో 'ఈనాడు' యాజమాన్య తీరును తప్పుపట్టారు. టీడీపీని అధికారంలోకి తీసుకురావడం కోసం పత్రికా విలువలకు 'ఈనాడు' తిలోదకాలు ఇవ్వడం బాధగా ఉందన్నారు. ఈనాడు చేతిలో బలైన జర్నలిస్టులకు అన్ని యూనియన్లు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

మీ రాజకీయ ప్రయోజనాలకు ఉద్యోగులు బలవ్వాలా?

ఈనాడు యాజమాన్యం తమ రాజకీయ ప్రయోజనాల కోసం డెస్క్ జర్నలిస్టులను ఉపయోగించుకొని.. ఆ తర్వాత వారిపై వేటు వేయడం దారుణమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉమ్మడి తూర్పు గోదావరి శాఖ అధ్యక్షుడు కె.స్వాతి ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డెస్క్ జర్నలిస్టులకు న్యాయం చేయాలని, ఈ విధానాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పాత ఫొటోలతో కథనాలు అల్లి పత్రికా విలువలకు తలవంపులు తేవడమే కాకుండా.. డ్యామేజీ చేసిన తర్వాత సవరణలు, వివరణలు లోపల పేజీల్లో వేయడం సరికాదన్నారు.

జనసేన పొత్తుతోనే ఎన్నికలకు వెళ్తాం: సోము



గంగవరం(చిత్తూరు జిల్లా): జనసేనతో పొత్తుతోనే ఎన్నికలకు వెళతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. గంగవరం మండల కేంద్రంలో శనివారం బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున సోము వీర్రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థులు గెలుస్తారని తెలిపారు. జనసేన పొత్తుతోనే ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు 2024 ఎన్నికలకు కూడా వెళ్తామని తెలిపారు.

తాగి డ్రైవింగ్ చేయడం.. అతి వేగంతో వాహనాలు నడపటం.. సిగరెట్లు తాగడం వంటివి ఎలా ప్రాణాంతకమవుతాయో.. రోజంతా మంచంపై కూర్చోవడం.. ఎలాంటి కదలికలు లేకుండా ఉండటం కూడా అంతే ప్రాణాంతకమని మీకు తెలుసా. సోమరితనం మీ విలువైన కాలంతోపాటు మీ ఆరోగ్యాన్ని కూడా నాశనం చేస్తుంది. శరీరానికి తగినంత వ్యాయామం చేయకపోతే అకాల మరణాలు సంభవించే అవకాశాలు 500 రెట్లు అధికమని 'ది లాన్సెట్'లో ప్రచురించిన ఓ అధ్యయనం స్పష్టం చేసింది. నడక లేదా పరుగు వంటి సాధారణ వ్యాయామాలు చేయడానికి కూడా తీరిక లేని వ్యక్తి వ్యాధులను ఆహ్వానిస్తాడని వెల్లడించింది.

వద్దు 'లే'.. జీ' నడవటం ఈజీ



మరణాలకు నాలుగో ప్రధాన కారణం బద్ధకమే

శారీరక శ్రమ లేకపోవడమే ఆరోగ్య సమస్యలకు కారణం



- ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న మరణాలకు నాలుగో ప్రధాన కారణం శ్రమ లేమి
- నడక, వ్యాయామం వంటి కార్యకలాపాలతో ఎన్నో ప్రయోజనాలు
- శారీరక శ్రమ ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య శాఖ చర్యలు

సాక్షి, అమరావతి: బడి ఈడు పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఏ వయసు వారైనా తగినంత శారీరక శ్రమ చేయడం ఆరోగ్యానికి చాలా అవసరం. ఇంటినుంచి అడుగు బయట పెట్టగానే బైక్ లేదా కారెక్కి తుర్రుమని గమ్యస్థానానికి చేరుతున్న వారెందరో ఉన్నారు. ఒక్క క్లిక్‌తో గుమ్మం వద్దకే అగ్గిపెట్టె నుంచి అన్నిరకాల వస్తువులు వచ్చి చేరుతున్నాయి. దీంతో బద్ధకస్తులు పెరిగిపోతున్నారు. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధులబారిన పడుతున్న వారి సంఖ్య కూడా శరవేగంగా పెరుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో నడక, జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, జిమ్ చేయడం లాంటి ఏదో ఒక వ్యాయామం చేసి తీరాలని వైద్యులు సూచిస్తున్నారు.

భారం పెరిగిపోతోంది

ప్రజలు బద్ధకిస్టులుగా మారడం.. ఆధునిక ఆహారపు అలవాట్ల వల్ల గుండె జబ్బులు, పక్షవాతం, క్యాన్సర్ వంటి నాన్ కమ్యూనికబుల్ (ఎన్‌సీడీ) వ్యాధులు దేశంలోను, రాష్ట్రంలోనూ విపరీతంగా పెరిగిపోతున్నాయి. దేశంలో 63 శాతం, రాష్ట్రంలో 68 శాతం మరణాలకు ఎన్‌సీడీ వ్యాధులకు కారణమవుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే ఎన్‌సీడీ నివారణ, నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 30 ఏళ్ల పైబడిన వారందరికీ స్క్రీనింగ్ నిర్వహించి.. వారి ఆరోగ్యంపై నిరంతర ఫాలో అప్‌ను వైద్య శాఖ చేపడుతోంది. రాష్ట్రంలో ఇప్పటివరకూ 2.80 కోట్ల మందికి స్క్రీనింగ్ నిర్వహించగా.. 55.41 లక్షల మందిలో రక్తపోటు లక్షణాలు వెలుగు చూశాయి. వీరిలో 16.28 లక్షల మందిలో సమస్య నిర్ధారణ అయింది. 5.46 లక్షల మంది ప్రస్తుతం చికిత్సలో ఉండగా.. 5.14 లక్షల మందిలో సమస్య అదుపులోనే ఉంది. అదేవిధంగా 53.92 లక్షల మందిలో మధుమేహం సమస్య వెలుగు చూడగా.. 12.29 లక్షల మందికి సమస్య నిర్ధారణ అయింది. వీరిలో 4.17 లక్షల మంది ప్రస్తుతం చికిత్సలో ఉన్నారు. 3.65 లక్షల మందిలో సమస్య అదుపులో ఉంది. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఎన్‌సీడీ బాధితులపై వైద్య శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

ప్రజలు తగినంత శారీరక శ్రమ చేయకపోవడం మరణాలకు నాలుగో ప్రధాన కారణంగా ఉంటోందని డబ్ల్యూహెచ్‌వో సైతం హెచ్చరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న మరణాలకు నాలుగు ప్రధాన కారణాలను పరిశీలిస్తే అధిక రక్తపోటు మొదటి స్థానంలో ఉంది. ఆ తరువాత స్థానాల్లో పొగాకు వినియోగం, మధుమేహం, శారీరక శ్రమ చేయకపోవడం వంటివి ఉంటున్నాయి. తగినంత శారీరక శ్రమ లేకపోవడంతో ప్రజలు దీర్ఘకాలిక జబ్బులైన మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, క్యాన్సర్, గుండె సమస్యలు, మానసిక రుగ్మతల బారిన పడుతున్నారు. వీటిని నయం చేసుకోవడానికి ఏటా రూ.25 వేల కోట్ల మేర ఖర్చవుతోందని, పదేళ్లలో ఈ ఖర్చు రూ.2.50 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని గత ఏడాది ఓ నివేదికలో డబ్ల్యూహెచ్‌వో స్పష్టం చేసింది. పట్టణీకరణ పెరుగుదల, రవాణా సౌకర్యంలో మార్పులు, అవుట్‌డోర్ పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు అందుబాటులో లేకపోవడం, శారీరక శ్రమ ఆవశ్యకతపై అవగాహన లేకపోవడం వంటి కారణాలు ప్రజలను బద్ధకిస్టులుగా మార్చుతున్నాయి.

గ్లోబల్ స్టేటస్ రిపోర్ట్ ఆన్ ఫిజికల్ యాక్టివిటీ-2022 నివేదిక ప్రకారం దేశంలో శారీరక శ్రమ చేయని వారి శాతాలు ఇలా..

వయసు	మహిళలు (శాతం)	పురుషులు (శాతం)
70 పైబడిన వారు	60	38
18 పైబడిన వారు	44	22
11-17	76	72

ప్రజల్లోకి తీసుకుని వెళ్లేలా..

దీర్ఘకాలిక జబ్బుల బారిన పడేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండటంతో ప్రజలకు శారీరక శ్రమ ఆవశ్యకతను తెలియజేసి.. వారిని నడక, వ్యాయామం ఇతర కార్యకలాపాల వైపు మళ్లించడంపై వైద్య శాఖ దృష్టి సారించింది. ఈ క్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థలు, ఎన్‌జీవోల సహకారాన్ని తీసుకుని వాకింగ్ ట్రాక్‌లు, గ్రౌండ్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక రచించారు. పాఠశాల దశలోనే పిల్లల్లో వ్యాయామం, నడక రోజువారీ కార్యకలాపాల్లో భాగంగా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఇప్పటికే సమావేశం నిర్వహించాం



ప్రజలకు వాకింగ్ చేయడానికి వీలుగా మైదానాలను అందుబాటులోకి తీసుకురావడం కోసం ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో ఇప్పటికే సమావేశం నిర్వహించాం. తమ గ్రౌండ్‌లను ఉదయం, సాయంత్రం ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరాం. వివిధ శాఖలను సమన్వయం చేసుకుని ప్రజల రోజువారి దినచర్యలో వాకింగ్, జాగింగ్, వ్యాయామం, ఇతర శారీరక శ్రమ కార్యకలాపాలను భాగం చేసేలా కార్యక్రమాలు చేపడతాం.

– జె.నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

మార్పు రావాలి



పాశ్చాత్య జీవన విధానానికి ప్రజలు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో అలవాట్లలో మార్పు రావాలి. మన పూర్వీకుల జీవన విధానాల్లోకి మనం వెళ్లాలి. రోజుకు కనీసం 30 నిమిషాలు నడక, వ్యాయామం, ఈత ఇలా ఏదో ఒక శారీరక శ్రమ చేయాలి. తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది. గుండె, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. ఊబకాయం నుంచి బయటపడొచ్చు.

– డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, కర్నూలు జీజీహెచ్

నారాయణ మెడికల్ కాలేజీ వద్ద ఆందోళన

- ప్రాక్టికల్స్‌లో కావాలనే ఫెయిల్ చేశారు
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఆరోపణ



నారాయణ వైద్యకళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ సాక్షి, అమరావతి: 'తమ బిడ్డలకు వైద్య విద్య థియరీ పరీక్షల్లో 90 శాతం, 88 శాతం మార్కులొచ్చాయి. అయితే ప్రాక్టికల్ పరీక్షల్లో మాత్రం ఫెయిల్ చేశారు.' ఇది అన్యాయమంటూ పలువురు వైద్య విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు సరిగా ప్రాక్టికల్స్ చేయలేదని యాజమాన్యం చెబుతోందని తెలిపారు. అయితే, థియరీ పరీక్షల్లో 90, 88, 85 మార్కులు ఎలా వచ్చాయో తెలపాలంటూ డిమాండ్ చేశారు. వైద్యకళాశాల డీన్, అధ్యాపకులు మళ్లీ పరీక్షలు రాసుకోండి అంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు తమ వద్దకు ట్యూషన్‌కు రావాలనే ఉద్దేశంతోనే ఇలా చేశారని ఆరోపించారు. కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. వైద్య కళాశాల వద్ద ఆందోళన అనంతరం పలువురు మెడికోల (వైద్య విద్యార్థులు) తల్లిదండ్రులు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. మరోవైపు కళాశాల డీన్ మాట్లాడుతూ గత నెలలో నారాయణ కళాశాలలో నిర్వహించిన ఫైనల్ ఇయర్ ఎంబీబీఎస్ పార్ట్–2 ప్రాక్టికల్ పరీక్షల్లో కొంత మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారన్నారు. ఇందుకు కళాశాలను నిందించడం దురదృష్టకరమన్నారు.

అంతమంది ఫెయిల్ అవ్వడానికి కారణమేంటి?

ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పార్ట్–2 పరీక్షల్లో నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఫెయిల్ కావడంతో పలువురు తల్లిదండ్రులు ఈ విషయాన్ని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బాబ్జి దృష్టికి తీసుకువచ్చారు. యాజమాన్యం చేసిన తప్పిదాల వల్లే తమ పిల్లలు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఎందుకు ఫెయిల్ అయ్యారో తెలియజేయాలని నారాయణ కాలేజీ ప్రిన్సిపాల్‌ను విశ్వవిద్యాలయం వివరణ కోరింది. కళాశాలలో సుమారు 250 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఉండగా, 106 మంది పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. వీరిలో 56 మంది ప్రాక్టికల్స్, థియరీ రెండింటిలో ఫెయిల్ అవ్వగా, 50 మంది థియరీలో ఉత్తీర్ణత సాధించి, ప్రాక్టికల్స్‌లో మాత్రమే ఫెయిల్ అయ్యారు.

ఈనాడు పత్రికను బహిష్కరించాలి

- పారిశ్రామిక సదస్సుతో రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది రామోజీరావు ఉద్దేశం
- రాష్ట్రానికి మంచి పేరు వస్తుందనే ప్రభుత్వంపై దుష్ప్రచారం
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ పారిశ్రామిక సదస్సుతో పెట్టుబడులు పెరిగి రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే అక్కసుతో ఈనాడు రామోజీరావు దిగజారుడు రాతలు రాస్తున్నాడని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రామోజీరావును వ్యాపారపరంగా పెంచి పోషించిన విశాఖ నగరం అభివృద్ధి చెందకూడదని.. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు రాకూడదని.. కేవలం చంద్రబాబు సీఎం అయితే ఇద్దరూ కలిసి దోచుకోవచ్చనే దురుద్దేశంతోనే ఈ విషపురాతలు రాస్తున్నారని విమర్శించారు. ఇందుకు నిరసనగా రాష్ట్ర ప్రజలంతా ఈనాడు పత్రికను బహిష్కరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ పత్రిక సమాజానికి హానికరమని.. దమ్ముంటే పార్టీ పెట్టి ప్రజల్లోకి రావాలని రామోజీరావుకు అమర్‌నాథ్ సవాల్ విసిరి ఈనాడు దినపత్రిక ప్రతిని చించి వేశారు. ఇక్కడి మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

ఈనాడు పత్రికకు పునాది వేసింది విశాఖ ప్రజలు.. ఇక్కడ జరిగే జీఐఎస్ సదస్సుకు సుమారు 50 దేశాల నుంచి పారిశ్రామిక దిగ్గజ ప్రతినిధులు హాజరవుతున్నారు. రాష్ట్రం ఎక్కడ అభివృద్ధి చెందుతుందో.. ఎక్కడ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందోనన్న అక్కసుతో పారిశ్రామికవేత్తలను తప్పుదోవ పట్టించేందుకు రామోజీరావు తన పత్రికలో చెత్త రాతలు రాస్తున్నారు. తాజాగా.. 'పారిశ్రామిక రాయితీ జాడేది' అన్న శీర్షికపై ఈనాడులో వచ్చిన వార్త తీవ్ర అభ్యంతరకరం. ఎంఎస్‌ఎంఈలకు ఎన్నికల కోడ్ ఉన్నందునే రాయితీలు కాస్త వాయిదా పడ్డాయి. చంద్రబాబు చెల్లించని రూ.3,600 కోట్లు ఎంఎస్‌ఎంఈ ఇన్సెంటివ్ బకాయిలను సీఎం జగన్ చెల్లించిన విషయం రామోజీరావుకు తెలీదా? కోవిడ్ సమయంలో ఎంఎస్‌ఎంఈలకు రూ.900 కోట్ల రీస్టార్ట్ ప్యాకేజీని అందజేసిన విషయం రామోజీరావుకు కనబడలేదా? ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉండడం కూడా మింగుడు పడటం లేదు. అభివృద్ధి గురించి మీరు చెప్పకపోయినా పర్వాలేదు.. రాష్ట్ర ఇమేజ్‌ని మాత్రం దెబ్బతీయొద్దు.

జీఐఎస్‌కు 6,500 మంది రిజిస్ట్రేషన్

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు సుమారు 6,500 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ప్రముఖ పారిశ్రామిక దిగ్గజాలు ముఖేష్ అంబానీ, అదానీ, టాటా బిర్లా, జీఎంసీ గ్రూపులకు చెందిన అధినేతలూ వస్తున్నారు. ఈ సదస్సు ద్వారా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాబోతున్నాయి. దీని కారణంగా రాష్ట్ర ముఖచిత్రం మారనుంది. ఇక రాష్ట్రంలో ఉన్న సముద్ర తీరాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నాం. మారిటైం బోర్డు ద్వారా రూ.15 వేల కోట్ల ఖర్చుతో మూడు పోర్టుల నిర్మాణం చేపడుతున్నాం. దేశంలో పోర్టు సిటీలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో.. విశాఖ కూడా అదే విధంగా అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే విప్రో సంస్థ విశాఖలో వెయ్యి మంది సిబ్బందితో తన కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించుకుంది.

కదిరి టీడీపీ ఇన్‌చార్జ్ 'కందికుంట' బరితెగింపు

- సీఐ మధు ఇంటిపై అనుచరులతో కలిసి దాడికి తెగబడ్డ వైనం
- దుర్భాషలాడుతూ, తొడగొడుతూ రెచ్చిపోయిన టీడీపీ నేత
- వైఎస్సార్‌సీపీ నేతలపై రాళ్ల దాడి, పలువురికి గాయాలు

కదిరి టౌన్: టీడీపీ నేతలు అరాచకాలు పెచ్చుమీరిపోయాయి. కొద్దిరోజుల క్రితం కృష్ణా జిల్లా గన్నవరంలో సీఐపై టీడీపీ నేతల దాడిని మరువకముందే.. తాజాగా శ్రీసత్యసాయి జిల్లా కదిరిలోనూ ఒక సీఐపై ఆ పార్టీ నేతలు విరుచుకుపడ్డారు. కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న కందికుంట వెంకట ప్రసాద్ బరితెగించారు. తన అనుచరులతో కలిసి శనివారం రాత్రి ఏకంగా పట్టణ సీఐ మధు ఇంటిపై దాడికి తెగబడ్డారు. దౌర్జన్యాలు, భూ దందాలకు కదిరిలో కందికుంట వెంకట ప్రసాద్ పేరుగాంచారు. కదిరికి సీఐ మధు రాకతో కందికుంట అరాచకాలకు అడ్డుకట్ట పడింది. దీంతో ఆయనపై ఎలాగైనా దాడి చేయాలని కందికుంట కొన్నాళ్లుగా కుట్రపన్నుతున్నారు. ఇప్పటికే ఒకసారి దాడికి ప్రయత్నించారు. అయినా భయపడకుండా సీఐ విధులు నిర్వర్తిస్తుండడంతో ఓర్వలేని కందికుంట.. శనివారం రాత్రి తన అనుచరులతో కలిసి కదిరి ఎన్‌జీవో కాలనీలో ఉన్న సీఐ నివాసంపైన దాడికి తెగబడ్డారు. 'రేయ్ సీఐ మధు ఎక్కడరా నువ్వు.. రా తేల్చుకుందాం' అంటూ నానా దుర్భాషలాడారు. ఆ సమయంలో సీఐ ఇంట్లో లేకపోవడంతో కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకుని వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు ఆందోళనకారులను పంపించేశారు. అక్కడితో ఆగని కందికుంట... మళ్లీ అనుచరులతో కలిసి సైదాపురం ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో రోడ్డుపై బైఠాయించారు. మీసాలు మెలేసి తొడకొట్టి హంగామా సృష్టించారు. దీంతో కొన్ని గంటలపాటు వాహనాలు స్తంభించిపోయాయి. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు చెప్పులు, రాళ్లు విసిరారు. దీంతో కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులకు గాయాలయ్యాయి. కందికుంటపై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.



అనకాపల్లిలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న ప్రజలు

రామోజీ.. తీరు మార్చుకోండి

రాజకీయంగా చంద్రబాబును పైకి లేపడం కోసం పాత ఫొటోలతో తప్పుడు ప్రచారం చేయడం 'ఈనాడు' రామోజీకే చెల్లిందని రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతూనే ఉంది. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టకపోయినా, కొట్టారంటూ 2021 నాటి ఫొటోలతో కథనం ప్రచురించడంపై విజయవాడ రూరల్ మండలం పరిధిలోని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో, అనకాపల్లి జిల్లా యలమంచిలి, అనకాపల్లిలో శనివారం ప్రజలు ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. రామోజీరావు ఇకనైనా తీరు మార్చుకోవాలని నినాదాలు చేశారు.

– భవానీపురం (విజయవాడపశ్చిమ)/ సాక్షి, అనకాపల్లి

రాష్ట్రానికి పట్టిన చీడపురుగు చంద్రబాబు

2024లో అన్ని స్థానాల్లోనూ గెలుస్తాం: మంత్రి సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం రూరల్: ఈ రాష్ట్రానికి పట్టిన చీడపురుగు చంద్రబాబు అయితే ఆయన కుమారుడు లోకేశ్ మూర్ఖుడని పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వ్యాఖ్యానించారు. శ్రీకాకుళంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేశ్ చేస్తున్న పాదయాత్రతో ఒరిగేదేమీ ఉండదన్నారు. ఇటీవల చంద్రబాబు గన్నవరం, ఏలూరు వెళ్లి మీసాలు మెలేసి, తొడలు కొట్టడం చూస్తే ఆయన రౌడీ రాజకీయాలకు పాల్పడుతున్నట్లు అర్థమవుతోందన్నారు. గన్నవరంలో పట్టాభి ఆడిన డ్రామాలు అందరికీ తెలుసునన్నారు. పద్నాలుగేళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు హయాంలో కరెంటు చార్జీలు తగ్గించాలని వైఎస్సార్‌సీపీ ధర్నాలు చేస్తే కాల్చి పారేయండి అంటూ బాబు ఆదేశాలు జారీచేశారని మంత్రి గుర్తుచేశారు. కులాల మధ్య చిచ్చుపెట్టడం తప్ప చంద్రబాబు రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీలేదని ఆయన విమర్శించారు. 'నీ హయాంలోనే నాయీ బ్రాహ్మణులకు తోకలు కత్తిరిస్తానన్నావు. ఎస్సీ, ఎస్టీలుగా ఎవరు పుట్టాలని కోరుకుంటారు అన్నావు' అని గుర్తుచేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బాబును రాష్ట్ర ప్రజలు తరిమికొడతారన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఇంటికీ మేలు చేసిందని.. అందుకే ప్రతి గడపకూ తాము ధైర్యంగా వెళ్తున్నామని మంత్రి చెప్పారు. రానున్న 2024 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

మళ్లీ టీడీపీకి హ్యాండ్ ఇవ్వకండి

- మేం వస్తే ఇసుక ఉచితం
- సీపీఎస్ రద్దు గురించి బాబు చర్చలు
- పాదయాత్రలో నారా లోకేశ్



సాక్షి, తిరుపతి: గత ఎన్నికల్లో మాదిరిగా ఈసారి కూడా టీడీపీకి హ్యాండ్ ఇవ్వకండని, టీడీపీ అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ భవన నిర్మాణ కార్మికులకు చెప్పారు. సీపీఎస్ రద్దు గురించి చంద్రబాబు నిపుణులతో చర్చిస్తున్నారని అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా లోకేశ్ శనివారం ఉదయం తిరుపతిలో పార్టీ నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల మాజీ నేతలు, కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. కొత్త ఇసుక పాలసీతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు సంపాదిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్చకు సిద్ధమన్నారు. తాము ఉద్యోగులను సొంత మనుషుల్లా చూసుకున్నామని, ప్రస్తుతం ఉద్యోగులపై కక్ష గట్టారని ఆరోపించారు. ఉద్యోగులంతా ఏకం కావాలన్నారు.

సీబీఐ నుంచి ఎలాంటి నోటీసులూ రాలేదు

వైఎస్ భాస్కర్‌రెడ్డి స్పష్టీకరణ



పులివెందుల: విచారణకు హాజరుకావాలంటూ సీబీఐ అధికారుల నుంచి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని వైఎస్సార్‌సీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సీబీఐ అధికారులు నోటీసులు ఇచ్చి శనివారం తనను విచారణకు పిలిచినట్లు కొన్ని వార్తా పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవాలని ఖండించారు. గతంలో నోటీసు ఇవ్వడానికి సీబీఐ అధికారులు వచ్చినప్పుడు తాను ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాల వల్ల ఈనెల 24 తర్వాత అందుబాటులో ఉంటానని సమాచారం ఇచ్చానని తెలిపారు. ఆ తర్వాత తనకు సీబీఐ అధికారులు నోటీసులు ఇవ్వలేదని చెప్పారు.

జూ.ఎన్టీఆర్‌ను టీడీపీలోకి లోకేశ్ ఆహ్వానించడం పెద్ద జోక్: ఎమ్మెల్యే వంశీ



గన్నవరం: ఎన్టీ రామారావు స్థాపించిన టీడీపీలో కలిసి పనిచేద్దామని జూనియర్ ఎన్టీఆర్‌ను లోకేశ్ ఆహ్వానించడం అతి పెద్ద జోక్ అని కృష్ణా జిల్లా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. నందమూరి వంశీకుల పార్టీలోకి జూనియర్ ఎన్టీఆర్‌ను ఆహ్వానించడం అంటే అత్త సొమ్మును అల్లుడు దానం చేసినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్.. జూనియర్ ఎన్టీఆర్‌కు తాత అని, లోకేశ్ తాత ఖర్జూర నాయుడని చెప్పారు. 2009 ఎన్నికల్లో లోకేశ్ గాలికి తిరుగుతున్నప్పుడే జూనియర్ ఎన్టీఆర్ టీడీపీ కోసం ప్రాణాలొడ్డి పనిచేశారని గుర్తుచేశారు. అటువంటి ఎన్టీఆర్‌కు ఎవరి దయ అవసరం లేదన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలకు ఖండన

గన్నవరం పాకిస్తాన్‌లో ఉందా.. అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వంశీ తీవ్రంగా ఖండించారు. దేశంలో ఎవరైనా, ఎక్కడికైనా నిరభ్యంతరంగా వెళ్లొచ్చని, సెక్షన్ 144 అమలులో ఉన్నప్పుడు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎవరినైనా నియంత్రించొచ్చని గుర్తుచేశారు. ముద్రగడ పద్మనాభంను మూడేళ్లు ఇంటి నుంచి బయటకు రాకుండా, మంద కృష్ణ మాదిగను ఐదేళ్లపాటు రాష్ట్రంలోకి రాకుండా చంద్రబాబు ఏ చట్టం, ఏ రాజ్యాంగం ప్రకారం అడ్డుకున్నారో చెప్పాలన్నారు. తనను పశువుల డాక్టర్ అని హేళన చేస్తున్న చంద్రబాబు ఏమైనా ఆర్ఈసీ వరంగల్‌లో, లోకేశ్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చదివారా.. అని ప్రశ్నించారు.

బడుగుల రాజ్యాధికార ప్రధాత వైఎస్ జగన్

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం వైపుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కొనియాడారు. శనివారం బీసీ భవన్‌లో సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌చార్జి కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లు, బీసీ నాయకుల పాత్ర అనే రౌండ్ టేబుల్ సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇటీవల ఏపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో 18 మంది అభ్యర్థులకు 11 మంది బీసీలను ఎంపిక చేయడం అంటే బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కార్యక్రమం జరగలేదని తెలిపారు. మార్చి 13 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో బీసీ నాయకులు వ్యూహం ప్రకారం ముందుకు వెళ్లాలని జాతీయ స్థాయిలో ఉన్న పార్లమెంటు సభ్యులందరినీ ఐక్యం చేస్తూ భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఇప్పటికే ఏపీ సీఎం జగన్ సూచనతో రాజ్యసభలో ఫ్లోర్ లీడర్ విజయసాయిరెడ్డి ప్రైవేటు బిల్లు పెట్టారని కృష్ణయ్య గుర్తుచేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, రంగబాబు, పవన్, అశోక్‌కుమార్, వి.అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



మూఢుడు కోపపడునది నిమిషములోనే బయలుపడును.
వివేకి నిందను వెల్లడిపరచక యూరకుండును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.సప్తమి తె.5.03 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి అష్టమి, **నక్షత్రం:** భరణి ఉ.8.21 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.8.41 నుండి 10.22 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.28 నుండి 5.15 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

నితీష్ కుమార్ (బిహార్ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కాంగ్రెస్ నుంచి వచ్చే సిగ్నల్ కోసం ఎదురుచూస్తూ ఉన్నాను. 24న కాంగ్రెస్ ప్లీనరీ మొదలైంది. ఆ రోజు సిగ్నల్ రాలేదు. నిన్న ప్లీనరీ రెండో రోజు. నిన్నా సిగ్నల్ రాలేదు! ఇవాళ ప్లీనరీ ఆఖరి రోజు. ఈరోజూ సిగ్నల్ రాకపోతే ఇక మళ్లీ వచ్చే ప్లీనరీ వరకు సిగ్నల్ రానట్లే. ఏడాది మొత్తంలో ప్లీనరీ జరిగే ఆ మూడు రోజులు మాత్రమే కాంగ్రెస్ కాస్త యాక్టివ్‌గా ఉంటుంది.

సల్మాన్ ఖుర్షీద్‌కి ఫోన్ చేస్తున్నాను. కనెక్ట్ కావడం లేదు! షకీల్ అహ్మద్‌కి చేశాను. కనెక్ట్ అవుతోంది కానీ వెంటనే కట్ అయిపోతోంది! పవన్ బన్సాల్‌కి చేశాను. అవుట్ ఆఫ్ కాలింగ్ ఏరియా అని వస్తోంది!

రాయ్‌పూర్ ఏమీ రెడ్ జోన్‌లో లేదు మావోయిస్టులు వెళ్లి అక్కడి సెల్ టవర్స్ పేల్చేసి ఉంటారని అనుకోడానికి. ఒకవేళ రాయ్‌పూర్ రెడ్ జోన్‌లో ఉన్నా కూడా మావోయిస్టులేమీ కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లినవాళ్లు కాదు.. తమకు పనికొచ్చేవాటిని కూడా ధ్వంసం చేసేయడానికి.



మళ్లొకసారి సల్మాన్ ఖుర్షీద్‌కి ఫోన్ చేశాను. ఊహూ. కలవడం లేదు! ఖుర్షీద్ కాంగ్రెస్ సీనియర్ లీడర్. ప్లీనరీకి వెళ్లడానికి ముందు పట్నాలో కలిసినప్పుడు ఆయనే నాతో అన్నారు.. 'కలిసి పని చేద్దాం అని కాంగ్రెస్ ప్లీనరీ నుంచి సిగ్నల్ రాగానే అందరికన్నా ముందు నేనే మీతో కలిసి పని చేసేందుకు వస్తాను నితీష్ భాయ్..' అని!

ఖర్గేకి కూడా ఒకసారి ఫోన్ చేసి చూద్దామని అనుకుంటూ, అలవాటుగా మళ్లీ ఖుర్షీద్‌కే చేశాను. ఫోన్ కనెక్ట్ అయింది!

"ఖుర్షీద్ భాయ్.. మీ ఫోన్‌లెందుకు కనెక్ట్ కావడం లేదు?" అని అడిగాను.

ఖుర్షీద్ పెద్దగా నవ్వారు. "నితీష్ భాయ్.. మీతో ఫోన్‌లో కనెక్ట్ కావడం, కాకపోవడం అటుంచండి. ప్లీనరీలో పక్కపక్కనే పదిహేను వేల మందిమి కూర్చొని ఉన్నా.. మాలో మేము ఒకరితో ఒకరం కనెక్ట్ కాలేకపోతున్నాం. ఖర్గే ఒక్కరే మాట్లాడుతున్నారు. అందరం ఆయనకే కనెక్ట్ అయి ఉన్నాం.." అన్నారు!

"ఖుర్షీద్ భాయ్.. 'కలిసి పనిచేద్దాం. మోదీ పని పడదాం' అని ప్లీనరీ నుంచి సిగ్నల్ రావచ్చని మీరే కదా చెప్పారు. షకీల్ అహ్మద్ మాటల్ని వింటుంటే.. 'ఎవరితోనూ కలిసే పని లేదు. కాంగ్రెస్ ఒక్కటే మోదీని ఓడిస్తుంది' అనే సిగ్నల్ వస్తుందేమో అనిపిస్తోంది!" అన్నాను.

"అవునా! ఆయనింకా మాట్లాడందే!!" అని నవ్వారు ఖుర్షీద్.

"ప్లీనరీలో కాదు ఖుర్షీద్ భాయ్. ప్లీనరీకి వెళ్లే ముందు మాట్లాడారు! 'మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఏడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వారితో కలిసి ఉంది. పది రాష్ట్రాల్లో బలమైన ప్రతిపక్షంగా ఉంది..' అన్నారు. అంటే.. మోదీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు జేడీ(యూ) గానీ, ఆర్జేడీ గానీ, మరెవరూ గానీ అక్కర్లేదనేగా..!" అన్నాను.

"నితీష్ భాయ్.. ఆ సందర్భం వేరే. ప్రతిపక్షాలన్నీ ఏకమై అధికారంలోకి వస్తే కనుక అప్పుడు రాహుల్ గాంధీనే ప్రధాని అని చెప్పడం షకీల్ ఉద్దేశం.." అన్నారు ఖుర్షీద్!

ఆయనతో మాట్లాడుతుండగానే లైన్ కట్ అయి, పవన్ బన్సాల్ లైన్‌లోకి వచ్చే ప్రయత్నం చేస్తుండటం కనిపించింది. ప్లీనరీ ఏర్పాట్లు చూస్తున్నది ఆయనే. లిఫ్ట్ చేశాను.

"నితీష్‌జీ.. మీరు నాకు ఫోన్ చేసినట్లున్నారు కదా?!" అన్నారాయన.

"అవును బన్సాల్‌జీ. మీవాళ్ల ఫోన్‌లు కలవకపోతుంటే, ఆ దగ్గర్లో ఏమైనా ఉన్నారేమోనని మీకు ఫోన్ చేశానంతే.." అని చెబుతున్నానూ.. లైన్ కట్ అయింది!

1996లో, 2004లో, 2009లో అందరం కనెక్ట్ అయి పనిచేశాం. 'ప్రధాని' అభ్యర్థి ఎవరో ప్రకటించకుండానే ఆ మూడు ఎన్నికల్లో విజయం సాధించాం. 2024 ఎన్నికల్లో కూడా 'ప్రకటించని అభ్యర్థి' తో మాత్రమే గెలుపు సాధ్యమౌతుంది. ఆ అభ్యర్థి రాహుల్ అయినా, నితీష్ అనే నేనైనా, మరొకరు ఎవరైనా!

మొదటైతే సిగ్నల్ రావాలి.

వినాశ కాలే విపరీత బుద్ధిః



జనతంత్రం

వర్ధెల్లి మురళి



చాపకింద నీరు మాదిరిగా వ్యవస్థల్లోకి పాక్కుంటూ వాటిని తనకు అనుకూలంగా మార్చుకునే విద్యలో పీహెచ్‌డీ చేసిన రాజకీయ నాయకుడు ఈ దేశంలో చంద్రబాబు ఒక్కడే. ఈ పాకుడు కళతోనే ముప్పయ్యేళ్లుగా ఆయన రాజకీయాల్లో కొనసాగగలుగుతున్నారు. రక్తబీజుడు వెదజల్లే నెత్తురులోంచి సైన్యాన్ని తయారు చేసుకున్నట్టు ఈయన వివిధ వ్యవస్థల్లో తన సైన్యాన్ని తయారుచేసుకున్నాడు. అందుకోసం ఏం వెదజల్లాడనేది రహస్యం. మీడియా అధిపతులను వ్యాపార మిత్రులుగా, ఆశ్రిత పెట్టుబడిదారులుగా మార్చుకొని, వారిచేత జేజేలు కొట్టించుకొని ఒక నాయకునిగా వ్యవహారంలోకి వచ్చాడు. ఈ మీడియా భజన కార్యక్రమం శ్రుతి మించడంతో అది ఎల్లో మీడియాగా ఏనాడో అప్రతిష్ఠను మూటకట్టుకున్నది.

న్యాయ వ్యవహారాల్లో ఎలా నెగ్గుకు రావాలో చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని ఏ తెలుగువాడిని అడిగినా టక్కున చెప్పేస్తాడు. బెంచ్ హంటింగ్, నాట్ బిఫోర్ వంటి కోర్టు పదజాలం చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతనే ప్రజల్లోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీని ఎన్టీ రామారావు స్థాపించుకున్నాడనీ, దాని జెండాను, ఎన్నికల గుర్తును తానే డిజైన్ చేసుకున్నాడనీ నాటి తెలుగు ప్రజలకు తెలుసు. అయినప్పటికీ ఆ పార్టీపై దురాక్రమణ చేసి హైకోర్టు ద్వారా దానికి న్యాయ ముద్రను వేయించుకున్న బాబు లాఘవం గురించి కూడా ప్రజలకు తెలుసు.

తెలుగుదేశం పార్టీకి మద్దతు దారుణంగా 26 శాతానికి పడిపోయిందని సర్వేలో వెల్లడైంది. గడిచిన మూడు నెలల్లో ఐదు శాతం పతనం. ఈ స్థాయి పతన దశలో వున్న పార్టీ బతికి బట్టగట్టి ఏడాది లోపల ఎన్నికలకు సమాయత్తం కావడం అసాధ్యం. ఈ సర్వే ఫలితాలను ఎంత రహస్యంగా ఉంచుదామనుకున్నా కుదరలేదు. పార్టీ శ్రేణుల్లో చాలామందికి తెలుసు. మిత్రపక్షాలకూ తెలుసు. మన బలాన్ని బట్టే కదా పొత్తు కుదుర్చుకునేవారు బేరమాడేది. ఈపాటికే బయల్దేరవలసిన పవన్ కల్యాణ్ వారాహి రథం ఎందుకో బయల్దేరలేదు. ఎల్లో ముఠాకు కవి హృదయం అర్థమైంది. కడుపుమంట పుట్టుకొచ్చింది. పవన్ కల్యాణ్‌కు కేసీఆర్ వెయ్యి కోట్లతో బేరం పెట్టారని బ్లాక్‌మెయిలింగ్‌కు దిగింది. ఐననూ కదలిక లేదు. బహుశా ఇప్పటికే కుదిరిన ఒప్పందాన్ని తిరగరాయాల్సి రావచ్చు. లోకేశం బాబు శనివారం నాడు ఎన్టీఆర్ బావకు నర్మగర్భంగా ఆహ్వానం పలికాడు. ఇదొక విశేషం. లోకేశం బావ కారణంగానే ఎన్టీఆర్ బావ తెలుగుదేశం పార్టీకి దూరమయ్యాడనేది బహిరంగ రహస్యం. తెలుగుదేశం పార్టీని ఇప్పడున్న స్థితి నుంచి పైకి లేపడానికి ఎన్టీఆర్, పవన్ కల్యాణ్‌లే కాదు... అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ వంటి క్రేన్లను ఉపయోగించినా ఫలితముండదు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై కట్టుకథల ప్రచారం చాలాకాలం నుంచి జరుగుతున్నదే. ప్రభుత్వం జనరంజక కార్యక్రమాలను అమలుచేస్తున్న ప్రతి సందర్భంలోనూ మీడియా దృష్టి మళ్లించేందుకు ఏదో ఒక రభసను సృష్టించే ప్రయత్నాలను కూడా తెలుగుదేశం పార్టీ ఇప్పటికే ప్రారంభించింది.

రక్తబీజుడు అనే అసురుని వృత్తాంతం మన పురాణాల్లో ఉన్నది. ఈ కథను చాలామంది వినే ఉంటారు. ఆ రాక్షసుడు అతిభయంకరంగా తపస్సు చేసి బ్రహ్మదేవుడిని వశపరచుకొని దారుణమైన ఒక వరాన్ని సంపాదించుకున్నాడు. వాడి ఒంటి నుంచి రాలే ఒక్కో రక్తపు బొట్టులోంచి ఒక్కో రక్తబీజుడు పుట్టుకొస్తాడు. అలా పుట్టుకొచ్చిన జూనియర్ రక్తబీజులు కార్చే ప్రతి రక్తపు బొట్టులోంచి ఒక్కో సబ్‌జూనియర్ రక్తబీజుడు ఉద్భవిస్తాడు. ఆ విధంగా ఒక్క నెత్తురు చుక్క నుంచే వేలమందితో కూడిన సైన్యాన్ని సృష్టించుకోగల వరాన్ని పొందడంతో వాడు చెలరేగిపోయాడు. అతడి దాష్టీకానికి, దోపిడీకి అతల సుతల సురాతల భూతలాది చతుర్దశ లోకాలూ గజగజ వణికిపోయాయి. దేవతలు హడలిపోయి పాహి... పాహి అంటూ పరుగులు తీశారు. చివరికి సర్వశక్తి స్వరూపిణి పార్వతీదేవి కాళీమాత అవతారాన్ని ఎత్తవలసి వచ్చింది. దైత్యుని దునుమాడి ఆ తల్లి లోకాలను కాపాడుకున్నదని దేవీ మహత్యం కథ ద్వారా మనకు తెలుస్తున్నది.

మహాకాళి తొమ్మిది ఛాయల్లో ఒకరు మన బెజవాడ కనకదుర్గమ్మ. అమ్మవారు కొండ మీద వేంచేసి ఉండగా కొండ కింద రక్తబీజుని అంశతో కూడిన రాజకీయాలు నేటికీ జరుగుతుండటం ఒక విషాదం. సాక్షాత్తూ అమ్మవారి సమక్షంలో క్షుద్రపూజలు కూడా చేసి రక్తబీజుని వారసత్వాన్ని ఈ 'అంశాం'కురాలు ఘనంగా చాటుకున్నాయి. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పట్టాలు తప్పకుండా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు చెక్స్ అండ్ బ్యాలెన్సెస్‌తో కూడిన పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేశారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు స్వతంత్రమైన మూడు స్తంభాలుగా వ్యవహరించాలని భావించారు. మీడియాను నాలుగో స్తంభంగా గౌరవించారు. ఎలక్షన్ కమిషన్, విజిలెన్స్ కమిషన్ వగైరాలను స్వతంత్ర సంస్థలుగా రూపొందించారు. రాజకీయ నాయకత్వం వ్యవస్థల మీద దండయాత్ర చేసి నియంతృత్వంలోకి దేశాన్ని మళ్లించకుండా పలు చర్యలను తీసుకున్నారు.

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వ్యవస్థల మీదకు రాజకీయ నాయకత్వం జరుపుతున్న దండయాత్రలపై పలుమార్లు ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. బహిరంగ దండయాత్రలు కాకుండా చాపకింద నీరు మాదిరిగా వ్యవస్థల్లోకి పాక్కుంటూ వాటిని తనకు అనుకూలంగా మార్చుకునే విద్యలో పీహెచ్‌డీ చేసిన రాజకీయ నాయకుడు ఈ దేశంలో చంద్రబాబు ఒక్కడే. ఈ పాకుడు కళతోనే ముప్పయ్యేళ్లుగా ఆయన రాజకీయాల్లో కొనసాగగలుగుతున్నారు. రక్తబీజుడు వెదజల్లే నెత్తురులోంచి సైన్యాన్ని తయారుచేసుకున్నట్టు ఈయన వివిధ వ్యవస్థల్లో తన సైన్యాన్ని తయారుచేసుకున్నాడు. అందుకోసం ఏం వెదజల్లాడనేది రహస్యం. మీడియా అధిపతులను వ్యాపార మిత్రులుగా, ఆశ్రిత పెట్టుబడిదారులుగా మార్చుకొని, వారిచేత జేజేలు కొట్టించుకొని ఒక నాయకునిగా వ్యవహారంలోకి వచ్చాడు. ఈ మీడియా భజన కార్యక్రమం శ్రుతి మించడంతో అది ఎల్లో మీడియాగా ఏనాడో అప్రతిష్ఠను మూటకట్టుకున్నది.

న్యాయ వ్యవహారాల్లో ఎలా నెగ్గుకు రావాలో చంద్రబాబుకు తెలిసినంతగా ఎవరికీ తెలియదని ఏ తెలుగువాడిని అడిగినా టక్కున చెప్పేస్తాడు. బెంచ్ హంటింగ్, నాట్ బిఫోర్ వంటి కోర్టు పదజాలం చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతనే ప్రజల్లోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీని ఎన్టీ రామారావు స్థాపించుకున్నాడనీ, దాని జెండాను, ఎన్నికల గుర్తును తానే డిజైన్ చేసుకున్నాడనీ నాటి తెలుగు ప్రజలకు తెలుసు. తెలుగుదేశం పార్టీలో ఆశ్రయం కోరుతూ ఒక శరణార్థి మాదిరిగా చంద్రబాబు ప్రవేశించాడని కూడా ప్రజలకు తెలుసు. అయినప్పటికీ ఆ పార్టీపై దురాక్రమణ చేసి హైకోర్టు ద్వారా దానికి న్యాయ ముద్రను వేయించుకున్న బాబు లాఘవం గురించి కూడా ప్రజలకు తెలుసు. ఎన్ని కేసులు వచ్చినా దర్యాప్తు జరక్కుండా స్టేలు తెచ్చుకోగల చాకచక్యం గురించి కూడా తెలుసు. రాజకీయ ప్రత్యర్థుల మీద శూన్యంలోంచి అభియోగాలు సృష్టించి పకడ్బందీగా కేసులు నడపగల దిట్ట అని కూడా తెలుసు.

కీలకమైన అనేక పబ్లిక్ విభాగాల్లో, దర్యాప్తు సంస్థల్లో తనకు అనుకూలమైన మానవ వనరులను గుప్పిట్లో పెట్టుకోవడంలో ఈయన ప్రావీణ్యం సంపాదించినట్టు ఇప్పటికే రుజువైంది. సీబీఐ, ఐటీ, విజిలెన్స్ వగైరా విభాగాల్లోని కొందరు వ్యక్తులు గతంలో చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించారని చాలా ఆరోపణలు కూడా వచ్చాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా వ్యవహరించిన ఒక అధికారి చంద్రబాబు అవసరాలకు అనుగుణంగా ఎముకలు మెడలో వేసుకొని మరీ వ్యవహరించిన తీరు తెలిసిన విషయమే. బాబు హయాంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన అధికారి పచ్చ కండువాను బహిరంగంగా కప్పుకోవడం మాత్రమే మిగిలింది. ఆయన అప్రకటిత తెలుగుదేశం ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడన్న ఆరోపణలున్నాయి.

ఇటువంటి చంద్రబాబుకు రామోజీ వంటి మీడియా అధిపతులు తోడుగా నిలబడి గడిచిన పాతిక ముప్పయ్యేళ్లుగా ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుపుతున్న అత్యాచారాల కథలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తూనే ఉన్నాయి. రామోజీ గొంతెమ్మ కోర్కెలకు తలొగ్గనందువల్లనే, అక్రమాలకు సహకరించనందువల్లనే చంద్రబాబుతో కలిసి వెన్నుపోటు పొడిచారని ఎన్టీ రామారావు స్వయంగా ఆరోపించారు. హైదరాబాద్ శివార్లలో ఫిలిం సిటీ సామ్రాజ్యాన్ని నిర్మించుకోవడంలో రామోజీ అనేక అక్రమాలకు పాల్పడ్డారనేందుకు సాక్ష్యాలున్నాయి. ఈ అక్రమాలకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తోడ్పాటు పూర్తిగా ఉన్నది. అసైన్డ్ భూములను కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరం. కానీ రామోజీ వాటిని యథేచ్ఛగా కొనుగోలు చేసి చట్ట ఉల్లంఘనకు పాల్పడ్డారు. 'నాలా' చట్టాన్ని ఉల్లంఘించి అక్రమ నిర్మాణాలకు పాల్పడ్డారు, ఫిలిం సిటీలో ఇటువంటి అక్రమ నిర్మాణాలు 147 ఉన్నాయని ప్రభుత్వ అధికారులే లెక్క తేల్చారు. 600 మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాల కింద రాష్ట్ర ప్రభుత్వం పంచిపెట్టిన 16 ఎకరాల భూమిని కూడా రామోజీ తన కబ్జాలోనే ఉంచుకున్నారు. ఆ స్థలాన్ని అప్పగించాలని పలుమార్లు సీపీఎం ఆధ్వర్యంలో పేద ప్రజలు ప్రదర్శనగా వెళ్లారు. వారిని తరిమికొడుతున్నాడే తప్ప వారి భూమిని వారికి ఇప్పటికీ అప్పగించడం లేదు.

తన ఫైవ్‌స్టార్ ఫిలిం సిటీ పక్కన పేదల ఇళ్లేమిటనే అసహ్య భావనతోనే రామోజీ వారిని తరిమేస్తున్నాడని అనుకోవాలి. ఈ అపూర్వ సహోదరుల భావసారూప్యత చూడండి. అమరావతి ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే సామాజిక సమతౌల్యత దెబ్బతింటుందని కోర్టుకే వెళ్లిన చంద్రబాబు... ఫిలిం సిటీ చేరువలో పేదల ఇళ్లుంటే గ్లామర్ దెబ్బతింటుందని ప్రభుత్వం ఇచ్చిన భూమిలోకి లబ్ధిదారులు రాకుండా తరిమేస్తున్న వ్యక్తి రామోజీ... ఇద్దరి ఐడియాలజీ పెత్తందారివర్గ ప్రయోజనాలే అని చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలవా? ఇద్దరూ పేద ప్రజల సాధికారత బద్ధవిరోధులే అని చెప్పడానికి ఎన్ని దుష్టాంతాలు కావాలి? ప్రభుత్వ స్కూళ్లను బాగుచేస్తుంటే, ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ఠం చేస్తుంటే వీరూ, వీరి అనుబంధ ఎల్లో మీడియా సంయుక్తంగా కళ్లల్లో నిప్పులు పోసుకోలేదా? పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో పాఠాలు చెబుతుంటే గగ్గోలు పెట్టలేదా? ఇప్పటికీ పెట్టడం లేదా?

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాన్ని రామోజీ బాహాటంగా ఉల్లంఘించిన విషయం ప్రజలకు తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా ఆయన 2,600 కోట్ల రూపాయల డిపాజిట్లను వసూలు చేశారు. ఈ నేరానికి రెండేళ్ల జైలు, రెట్టింపు సొమ్ము అంటే రూ. 5,200 కోట్ల జరిమానా పడాలి. కానీ రిలయన్స్ దగ్గర అప్పుచేసి ఆ సొమ్ము తిరిగి చెల్లించాను కనుక కేసు తూచ్ అంటున్నారు రామోజీ. దొంగతనం బయటపడిన తర్వాత ఆ దొంగసొత్తును వెనక్కు ఇచ్చేస్తే శిక్ష ఉండదా? భారత శిక్షాస్మృతిలో అటువంటి వెసులుబాటు ఏమైనా ఉన్నదా? చంద్రబాబు అండ్ కో లోని కీలక సభ్యులంతా ఇటువంటి గురువింద గింజలే. ఈ గింజలన్నీ కలిసి ఇప్పుడొక ఉద్యమానికి శ్రీకారం చుట్టాయి. ఈ ముఠాలోని కమెండోల్లాంటి కీలక సభ్యులను ముందుజాగ్రత్త కోసం చంద్రబాబు ఎప్పుడో బీజేపీలో చేర్పించారు. తమ ప్రయోజనాల కోసం ఏ గడ్డి కరిచేందుకైనా, ఏ జెండా మోసేందుకైనా ఏమాత్రం సిగ్గుపడని షార్ప్ షూటర్స్ వీళ్లంతా. చంద్రబాబుకు అనుకూలంగా జాతీయస్థాయిలో వ్యవస్థలను మేనేజ్ చేసే కార్యక్రమంలో వీళ్లంతా ఇప్పుడు బిజీగా మారిపోయారు. నిత్య అసత్య వ్రత కథనాలతో ఎల్లో మీడియా విరుచుకుపడుతున్నది. వ్యవస్థల్లో ప్రవేశపెట్టిన డమ్మీ రక్తబీజులంతా ఏకకాలంలో ఒకే రాగం తీస్తున్నారు.

విషయం సుస్పష్టం. సాఫ్ సీదా. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్వయంగా చెప్పినట్టు ఇప్పుడక్కడ వర్గపోరు జరుగుతున్నది. పేదల అనుకూల విధానాలను జగన్ ప్రభుత్వం ప్రబలంగా అమలు చేస్తున్నది. పెత్తందారీవర్గ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. ఈ వర్గానికి నాయకత్వం వహిస్తున్న బాబు–రామోజీ ముఠా స్వార్థ ప్రయోజనాలకు ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ట్రెజర్ హంట్ స్వప్నం కరిగిపోతున్నది. రాజధాని పేరుతో తలకెత్తుకున్న లక్షల కోట్ల వ్యాపారం చెదిరిపోతున్నది. భూములపై పెట్టుబడి పెట్టిన వారిలో అసహనం పెరుగుతున్నది. ఎన్నికల దాకా ఆగేంత ఓపిక లేదు. ఎన్నికల్లో గెలుస్తామన్న ఆశ లేదు. కోట్ల రూపాయలు తగలేసి మూడు నెలలకోసారి నిపుణుల చేత చేయించుకుంటున్న సర్వేలు వెక్కిరిస్తున్నాయి. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి అంతో ఇంతో ఓట్ల శాతం పెరగాలి. గత ఎన్నికల్లో టీడీపీకి 39 శాతం ఓట్లు వచ్చాయి. ఫిబ్రవరి మొదటివారంలో వచ్చిన సర్వే ఫలితాలు కరకట్ట అతిథిగృహం గుండెల్లో డైనమైట్లను పేల్చాయి.

తెలుగుదేశం పార్టీకి మద్దతు దారుణంగా 26 శాతానికి పడిపోయిందని సర్వేలో వెల్లడైంది. గడిచిన మూడు నెలల్లో ఐదు శాతం పతనం. ఈ స్థాయి పతన దశలో వున్న పార్టీ బతికి బట్టగట్టి ఏడాది లోపల ఎన్నికలకు సమాయత్తం కావడం అసాధ్యం. ఈ సర్వే ఫలితాలను ఎంత రహస్యంగా ఉంచుదామనుకున్నా కుదరలేదు. పార్టీ శ్రేణుల్లో చాలామందికి తెలుసు. మిత్రపక్షాలకూ తెలుసు. మన బలాన్ని బట్టే కదా పొత్తు కుదుర్చుకునేవారు బేరమాడేది. ఈపాటికే బయల్దేరవలసిన పవన్ కల్యాణ్ వారాహి రథం ఎందుకో బయల్దేరలేదు. ఎల్లో ముఠాకు కవి హృదయం అర్థమైంది. కడుపుమంట పుట్టుకొచ్చింది. పవన్ కల్యాణ్‌కు కేసీఆర్ వెయ్యి కోట్లతో బేరం పెట్టారని బ్లాక్‌మెయిలింగ్‌కు దిగింది. ఐననూ కదలిక లేదు. బహుశా ఇప్పటికే కుదిరిన ఒప్పందాన్ని తిరగరాయాల్సి రావచ్చు. లోకేశం బాబు శనివారం నాడు ఎన్టీఆర్ బావకు నర్మగర్భంగా ఆహ్వానం పలికాడు. ఇదొక విశేషం. లోకేశం బావ కారణంగానే ఎన్టీఆర్ బావ తెలుగుదేశం పార్టీకి దూరమయ్యాడనేది బహిరంగ రహస్యం. తెలుగుదేశం పార్టీని ఇప్పుడున్న స్థితి నుంచి పైకి లేపడానికి ఎన్టీఆర్, పవన్ కల్యాణ్‌లే కాదు... అమితాబ్ బచ్చన్, రజనీకాంత్ వంటి క్రేన్లను ఉపయోగించినా ఫలితముండదు.

వైఎస్ జగన్ ప్రభుత్వంపై కట్టుకథల ప్రచారం చాలాకాలం నుంచి జరుగుతున్నదే. ప్రభుత్వం జనరంజక కార్యక్రమాలను అమలుచేస్తున్న ప్రతి సందర్భంలోనూ మీడియా దృష్టి మళ్లించేందుకు ఏదో ఒక రభసను సృష్టించే ప్రయత్నాలను కూడా తెలుగుదేశం పార్టీ ఇప్పటికే ప్రారంభించింది. నవంబర్ సర్వే ఫలితాల తర్వాత వేగాన్ని మరింత పెంచింది. ఫిబ్రవరి ఫలితాలతో పార్టీ పెద్దలతోపాటు మీడియా పెద్దలు కూడా విచక్షణ కోల్పోయారు. అనపర్తిలో, గన్నవరంలో గోక్కోవడం ఈ విచక్షణా రాహిత్యంలో భాగమే. ఎన్ని అసత్యాలు రాసేందుకైనా, ప్రసారం చేసేందుకైనా వెనుకాడేది లేదన్నట్టుగా ఎల్లో మీడియా రెచ్చిపోతున్నది. తానే రెచ్చగొట్టి సవాల్ చేసి, గన్నవరం వెళ్లిన పట్టాభిని పోలీసులు కొట్టినట్టుగా ఈనాడు బ్యానర్ వార్తలను వండేయడం క్షుద్రవిద్యకు పరాకాష్ఠ. ఇందుకోసం రెండేళ్ల కిందటి ఫోటోలను ఈనాడు నిస్సిగ్గుగా వాడేసింది. నడిరోడ్డు మీద గుడ్డలూడదీసుకొని పత్రికారంగ మాన మర్యాదలను మంటగలిపింది.

వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రతిష్ఠను మసకబరచడానికి ఎంత దారుణానికైనా దిగజారేందుకు తెలుగుదేశం, ఎల్లోమీడియాలు సిద్ధంగా ఉన్నాయని ఇటీవలి పరిణామాలన్నీ నిరూపిస్తున్నాయి. 2019లో జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును ఎల్లో మీడియా పలురకాల మలుపులు తిప్పుతున్న తీరు పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఎందుకంటే గతంలో వైఎస్ జగన్‌పై దాఖలైన తప్పుడు కేసుల దర్యాప్తు సందర్భంగా కూడా కొందరు దర్యాప్తు అధికారులతో కలిసి ఈ ముఠా ఇదే వ్యూహాన్ని అమలు చేసింది. శుక్రవారం నాడు సీబీఐ అధికారులను కలిసిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైఎస్ అవినాశ్‌రెడ్డి చెప్పిన మాటలు గమనించదగ్గవి. కేసు దర్యాప్తు ఫ్యాక్ట్స్ టార్గెట్‌గా కాకుండా పర్సన్ టార్గెట్‌గా జరగడం సరికాదని అవినాశ్ అన్నారు. ఎవరినో ఇరికించే ఉద్దేశంతోనే దర్యాప్తు జరుగుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రాథమిక సాక్ష్యాలను, వాస్తవాలను విస్మరిస్తూ దర్యాప్తు జరుగుతున్నదని ఇంగిత జ్ఞానానికి కూడా అవగతమవుతున్నది.


ఈ కేసులో నిందితుడుగా వున్న సునీల్ యాదవ్ అనే వ్యక్తి బెయిల్ పిటీషన్ వేసుకుంటే దాని మీద సీబీఐ కౌంటర్ వేసింది. ఆ కౌంటర్‌లోకి అవినాశ్‌రెడ్డి పేరును లాక్కొచ్చింది. తెల్లారి ఎల్లో మీడియాలో 'అవినాశ్ ఇంట్లో సునీల్', 'అవినాశ్‌రెడ్డే' వంటి పతాక శీర్షికలతో మసాలా వార్తలు వచ్చాయి. అవి చదివినవారు హత్య వెనుక అవినాశ్‌రెడ్డి హస్తముందని అనుకోవాలి. హత్య జరిగిన రోజు రాత్రి సునీల్ యాదవ్ అనే వ్యక్తి అవినాశ్ ఇంట్లో ఉన్నాడని గూగుల్ చెప్పిందట. గూగుల్ చెప్పింది గనుక అదే నిజమని అఫిడవిట్‌లో సీబీఐ పేర్కొన్నది. కానీ, ఆరోజు రాత్రి మూడు గంటలపాటు తానూ సునీల్ యాదవ్, నందిక అనే ఆస్పత్రి వద్ద కలిసే ఉన్నామని భరత్ యాదవ్ అనే విలేకరి చెప్పిన విషయాన్ని, ఇచ్చిన వీడియో సాక్ష్యాన్ని సీబీఐ పరిగణనలోకి తీసుకోలేదు. వివేకా రాసినట్టు చెబుతున్న లేఖ హత్యాస్థలంలో ఆయన పీఏ కృష్ణారెడ్డి దాచి పెట్టాడు. పొద్దున అక్కడికి వచ్చిన అవినాశ్‌కు గానీ, పోలీసులకు గానీ వెంటనే ఆ లేఖను ఇచ్చి ఉన్నట్లయితే అది హత్య అనే విషయం వెంటనే తెలిసి ఉండేది. లేఖను ఎవరికీ ఇవ్వొద్దని వివేకా అల్లుడు ఎందుకు ఆదేశించినట్టు? వివేకానందరెడ్డి రెండో వివాహం చేసుకోవడం వారి కుటుంబంలో పెద్ద వివాదానికి కారణమైంది. రెండో కుటుంబానికి ఆస్తిలో వాటా ఇవ్వడానికి వివేకా నిర్ణయించారన్నది కూడా రహస్యమేమీ కాదు. ఈ నిర్ణయాన్ని మొదటి భార్య, కూతురు, అల్లుడు రాజశేఖరరెడ్డి, అల్లుని సోదరుడు శివప్రకాశ్‌రెడ్డి (వీరు వివేకా మొదటిభార్య సోదరులు) వ్యతిరేకిస్తున్నారు. కేసులో నిందితులైన ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి, దస్తగిరి చాలాకాలంగా వివేకాకు సన్నిహితులు. ఆ కారణంగా ఆయన మొదటి కుటుంబ సభ్యులతో కూడా వారికి సాన్నిహిత్యం ఉన్నది. కేసు దర్యాప్తులో ఈ ప్రాసంగిక కోణం కనిపించడం లేదేమన్న అనుమానం సాధారణ ప్రజల్లో కూడా ఉన్నది. ఏమైనా సీబీఐ దర్యాప్తు జరుగుతున్నది. న్యాయస్థానం విచారణ పూర్తి చేయవలసి ఉన్నది. ఈలోగానే ఎల్లో మీడియా నిత్యం తీర్పులు రాసేయడం, వారికి దర్యాప్తు అధికారుల నుంచి లీకులు అందడం విలువల పతనానికి పరాకాష్ఠ. ప్రజా కోర్టులో వైఎస్ జగన్‌ను గెలవ లేమన్న భీతితోనే ఈ కూటమి ఉన్మాదపూరితంగా వ్యవహరిస్తున్నదని అనుకోవాలి.

vardhelli1959@gmail.com

వేణువై పలకరించి... స్నేహమై పరిమళించి...

కొందరు మనుషులుంటారు, వాళ్లు మనుషులెవరూ చెయ్యలేని పనులు చేస్తారు. వారిని దేవతలనో, దేవుళ్లనో పొగిడే లోపే సామాన్యులుగా తమ అసామాన్యత్వాన్ని చాటుకుంటారు. అటువంటి వారిని సామాన్యులే నెత్తిన పెట్టుకుని మోస్తారు. అందుకు మన కాలపు సాక్ష్యం తుమ్మల వేణుగోపాలరావు... సింపుల్‌గా వేణు మాస్టారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి పట్టుదలగా చదివి, అంచెలంచెలుగా పైస్థాయికి ఎదిగిన వ్యక్తి ఆయన. ఎక్కడో కృష్ణా జిల్లాలోని ఘంటశాల పాలెంలో పుట్టి అమెరికాలో ఎమ్మెస్ చేసే వరకూ ఎదగడం అంటే ఆ రోజుల్లో అంత సులువేమీ కాదు. కానీ, ఇలా ఎదుగుతున్న క్రమంలోనే ఆయన తన చుట్టూ ప్రపంచపు లోతును సులువుగానే కనుగొన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను ఆకళింపు జేసుకున్నారు. రావాల్సిన మార్పులకు వేగుచుక్క కావాలని నిశ్చయించుకున్నారు. వయసు, హోదా, సామాజిక స్థితులను పట్టించుకోకుండా అందరికీ స్నేహ హస్తం చాచారు. కడ వరకూ అందరికీ మంచి స్నేహితుడిగా నిలిచి పోయారు.

డిగ్రీ పరీక్షలు రాసి విశాఖలోని హెచ్‌బీ కాలనీలో అడుగు పెట్టిన నాకు, ఆయన ఎదురు పడినప్పుడు హడిలి చచ్చా. మామూలు కాలేజీ ప్రిన్సిపాల్ అంటేనే ఉలికిపాటుగా ఉండే వయసులో ఏకంగా యూనివర్సిటీలో ప్రిన్సిపాల్ అనేసరికి మాటలు పెగల్లేదు. నా పరిస్థితి అర్థం చేసుకున్న ఆయన నెమ్మదిగా లోపలకు వెళ్లి పోయారు. చలసాని ప్రసాద్, కృష్ణాబాయిలతో మాట్లాడి వెళ్లిపోతుంటే బయటకు వచ్చి 'అరవైలో ఇరవై' అనే పుస్తకం, దానితోపాటు చిన్న బుక్‌లెట్ చేతిలో పెట్టారు. అప్పుడు రాళ్లయినా అరిగించుకునే ఆకలితో ఉండేవాడిని కాబట్టి రాత్రికి రాత్రే చదివేశా. ఆయనంటే గౌరవం రెట్టింపు అయ్యింది. కానీ, మళ్లీ కలిసినప్పుడు మాత్రం మామూలే. అందుకు కారణం, ఆయన గట్టిగా, ఖరాకండీగా, నిర్దిష్టంగా మాట్లాడటం. రావిశాస్త్రి, కారా మాస్టార్ల గురించి ఆసక్తికరమైన కబుర్లు చెప్పే వారు. ఆయనకు గుర్తుకు వచ్చి నప్పుడల్లా 'మీరు ఇది తప్పకుండా చదవాలి', 'ఇది చూశారా?' అంటూ లోపలెక్కడ్నించో పుస్తకాలు పట్టుకొచ్చి ఇచ్చే వారు.



విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మార్గ దర్శిగా నిలిచిన వేణు మాస్టారు కృషినీ, ప్రతిభనీ, ఆశయాలనీ... ఇటు విద్యా రంగం వారు గానీ, అటు సాహిత్య రంగంవారు గానీ గుర్తించకపోయినా సొంత గ్రామస్థులు అక్కున చేర్చుకుని విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషకరం. అక్కడే వికాస కేంద్రం కూడా ఏర్పాటు చేసి, ఆయన భావాలను బాగానే ఒంట బట్టించుకున్నట్టు నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో సాన్నిహిత్యం కలిగిన అనేకమంది చిన్నా, పెద్దల అభిప్రాయాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించడం ద్వారా ఆయన గురించి భావితరాలు కూలంకుషంగా తెలుసుకునే వీలు కల్పిస్తున్నారు.

తుమ్మల వేణుగోపాలరావు లాంటి కృషీవలురు అరుదుగా ఉంటారు. అటువంటి అసామాన్యులను పట్టించుకుని, పదిమందికీ ఆదర్శంగా నిలిపేవారే ప్రస్తుత సమాజానికి అవసరం.

– దేశరాజు
సీనియర్ జర్నలిస్ట్ I 9948680009

(నేడు కృష్ణా జిల్లా ఘంటసాల పాలెంలో తుమ్మల వేణుగోపాలరావు విగ్రహావిష్కరణ)

క్లుప్తంగా...

కురుక్షేత్రలో లక్ష చండీ మహాయజ్ఞం పరిపూర్ణం



శివపార్వతులకు హారతి ఇస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో జరుగుతున్న లక్ష చండీ మహాయజ్ఞం శనివారంతో పరిపూర్ణమైంది. 2,160 మంది బ్రాహ్మణులు 1,12,320 సార్లు చండీ పారాయణ హోమాలు నిర్వహించారు. లోకశాంతిని కాంక్షిస్తూ శివ పార్వతుల కల్యాణం కమనీయంగా జరిపారు. శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి భక్తులకు కల్యాణ అక్షింతలు అందజేశారు. యజ్ఞభూమిని హరియాణా డీజీపీ పీకే అగర్వాల్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ స్పెషల్ డీజీ రామశాస్త్రి, ఢిల్లీకి చెందిన ఐపీఎస్ అధికారి నాయక్, గోరఖ్‌పూర్ ఎంపీ రవికిషన్, హిమాచల్‌ప్రదేశ్ మాజీ స్పీకర్ రాజీవ్ బిందాల్ తదితరులు సందర్శించారు. చండీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. ఆదివారం జరిగే మహా పూర్ణాహుతితో ఈ క్రతువు పూర్తవుతుంది. పూర్ణాహుతికి ముందు పరివార దేవతల హవనాలు, ప్రాయశ్చిత్త హోమాలు ఉంటాయని విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి తెలిపారు. చండీ యజ్ఞంతో పాటు 1,936 అతిరుద్ర హోమాలు జరిగాయని చెప్పారు. లక్ష చండీ మహా యజ్ఞానికి అనూహ్య స్పందన వచ్చిందని యజ్ఞం నిర్వాహకురాలు గుంటీమాత ఆనందం వ్యక్తం చేశారు.

తిరుపతిలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు

- శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో నిర్వహణ
- వరల్డ్ రికార్డ్స్‌లో నమోదయ్యేలా 48 గంటల పాటు కళా ప్రదర్శనలు

సాక్షి, అమరావతి: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, చేజర్ల ఇంద్రాణి ట్రస్ట్ చైర్మన్ కింగ్ ఇంద్ర సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలను తిరుపతిలో నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు తెలిపారు. ఏప్రిల్ 9, 10 తేదీల్లో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో 48 గంటలు నిర్విరామంగా కళా ప్రదర్శనలు, పుస్తక ఆవిష్కరణలు, ప్రపంచ కవితోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమం పలు ప్రపంచ రికార్డుల్లో నమోదుకానుందని వెల్లడించారు. పాల్గొన్న కళాకారులందరినీ సత్కరించడంతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని వివరించారు. ఇప్పటికే ఉచిత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైందని, పాల్గొనదలచిన వారు 82475 19925 వాట్సాప్ నంబర్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంస్థ జాతీయ మీడియా ప్రతినిధి అమ్మోజీ బమ్మిడి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వైద్య విద్యార్థి ఆత్మహత్య

లబ్బీపేట(విజయవాడ తూర్పు): తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంకు చెందిన నవీన్ అనే వైద్య విద్యార్థి పురుగు మందు తాగి.. విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వివరాలివి. ఖమ్మంకు చెందిన నవీన్–2019 బ్యాచ్‌లో విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో చేరాడు. 10 రోజుల క్రితం ఇంటికి వెళ్లిన అతడు ఈ నెల 15వ తేదీన పురుగు మందు తాగాడు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తొలుత పరీక్షల్లో ఫెయిలై డిటైన్డ్ కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్టు భావించినా.. నవీన్ ఇప్పటికే డిటైన్డ్ అయ్యే సబ్జెక్టులు అన్నీ పాస్ అయినట్టు స్నేహితులు చెబుతున్నారు. ఇటీవలే కొన్ని సబ్జెక్ట్ పరీక్షలు కూడా రాసినట్టు పేర్కొంటున్నారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ విఠల్‌రావును వివరణ కోరగా.. నవీన్ ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు స్నేహితులు కూడా చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు.

17 నుంచి విజ్ఞాన్‌లో 'సృజనాంకుర'

చేబ్రోలు (గుంటూరు): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో మార్చి 17, 18 తేదీలలో విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయస్థాయి 'సృజనాంకుర–2కే23' పోటీలు నిర్వహిస్తున్నట్టు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఇన్నోవేటర్ సుధాన్షు మణి హాజరు కానున్నారని వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 15 వేల మంది విద్యార్థులు తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు. రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులను విజేతలకు అందజేస్తామన్నారు.

మొత్తం 9 కేటగిరీల్లో పోటీలు

సృజనాంకురలో మొత్తం 9 కేటగిరీల్లో పోటీలను నిర్వహించనున్నారు. ఆటోమేషన్, ఇన్ఫ్రా ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కెమికల్ టెక్నాలజీ, కంప్యూటర్ అప్లికేషన్స్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్, బేసిక్ సైన్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తారు. వర్సిటీ రిజిస్ట్రార్ రఘునాథన్ పాల్గొన్నారు.

లైక్, షేర్.. చీటింగ్



ఇంట్లో కూర్చునే లక్షలు సంపాదించవచ్చంటూ సోషల్ మీడియాలో ప్రకటనలు

- వాట్సాప్, టెలిగ్రాం చాటింగ్‌తో ముగ్గులోకి..
- ఫేక్ వెబ్‌సైట్‌లతో బురిడి
- విజయవాడలో రోజురోజుకీ పెరుగుతున్న బాధితులు

విజయవాడ స్పోర్ట్స్: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని యువత విలవిల్లాడుతున్నది. అత్యాశకు పోయి రూ.లక్షలకు లక్షలు సమర్పించుకుంటుంది. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. నిత్యం ఈ తరహా ఘటనలు ఎక్కడో ఓచోట వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఇటీవల కాలంలో విజయవాడ సీతారామపురం ప్రాంతానికి చెందిన ఓ యువతి హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. వర్క్ ఫ్రం హోంలో భాగంగా ప్రస్తుతం సీతారామపురంలోని తన ఇంటి నుంచే పనిచేస్తున్నది. ఈ నెల ఐదో తేదీన తన వాట్సాప్‌కు వచ్చిన మెసేజ్‌కు ఆకర్షితురాలై వెంటనే మెసేజ్‌లోని వెబ్‌సైట్‌ను క్లిక్ చేసింది. వెబ్‌సైట్‌లోకి వెళ్లి వివరాలను చెక్ చేసుకుంటుండగానే సదరు కంపెనీ నుంచి ఆమెకు ఫోన్ కాల్ వచ్చింది. 'ఇన్‌స్టా గ్రాం, యూ ట్యూబ్, ఫేస్‌బుక్‌లో వచ్చే వీడియోలు చూసి లైక్, షేర్ చేస్తే డబ్బులు చెల్లిస్తామని, ఇంట్లో కూర్చునే నెలకు లక్షలు సంపాదించవచ్చు అని ఫోన్‌లో చెప్పిన వ్యక్తి మాటలను నమ్మింది. యువతికి టాస్క్‌లు మొదలయ్యాయి. ఆ రోజు తన సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి కాసేపు విరామం ఇచ్చి ఈజీగా వచ్చే డబ్బుల కోసం తాపత్రయపడి కష్టపడి కొత్త పని టాస్క్‌లు పూర్తి చేసింది. వెంటనే ఆమె బ్యాంక్ ఖాతాలో రూ.1,200 జమయ్యాయి. దీంతో అదే పనిగా మరుసటి రోజు టాస్క్‌లు పూర్తి చేయడంతో మళ్లీ రూ. 2 వేలు ఆమె బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. యువతి బానిసత్వాన్ని గ్రహించిన సైబర్ నేరగాళ్లు ఆమెను అప్పుడే అసలైన ముగ్గులోకి దించారు. 'రూ.5 వేలు డిపాజిట్ చేసే కొన్ని పేరున్న కంపెనీల టాస్క్‌లు ఇస్తాం, ఆ కంపెనీ ప్రొడక్ట్స్‌కు రేటింగ్ ఇవ్వాలంతే.. ఇది సింపుల్ టాస్క్... ఎక్కువ లాభాలొస్తాయి..!' అని నమ్మించారు. రూ.5 వేలు డిపాజిట్ చేసి టాస్క్ పూర్తి చేసి వెబ్‌సైట్ వాలెట్ చెక్ చేసుకుంది. అందులో రూ.10 వేలు జమకావడంతో ఆనందంతో విత్‌డ్రా చేసుకుందామని విఫలయత్నం చేసింది. వెంటనే కంపెనీ ప్రతినిధులను ఫోన్‌లో సంప్రదించింది. రూ. ఏడు వేలు డిపాజిట్ చేసి టాస్క్ పూర్తి చేస్తే మీ వాలెట్‌లో ఉన్న రూ.10 వేలు తీసుకోవచ్చని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. ఆ విధంగానూ చేసినా డబ్బు రాలేదు. బాధితురాలు డబ్బులు డిపాజిట్ చేస్తూనే ఉంది.. తీసుకోవడానికి వీలు లేని డబ్బులు వాలెట్‌లో పెరుగుతూనే ఉన్నాయి. ఈ విధంగా ఆ యువతి కేవలం 10 రోజుల్లో 14 లక్షల 13 వేల 900 రూపాయలను చెల్లించిన తరువాత సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో విసురుతున్న వలలో నిరుద్యోగులతో సహా ఉద్యోగులు, ఉన్నత విద్యావంతులు పడుతుండడం గమనార్హం. ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల కేంద్రంగా ఈ తరహా మోసాలు జరుగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

జిల్లాలో పెరుగుతున్న ఘటనలు

ఈ ఆన్‌లైన్ మోసాల బాధితులు రోజురోజుకీ పెరుగుతున్నారు. నిత్యం స్మార్ట్ ఫోన్‌కే అంకితమవుతున్న వ్యక్తులు ఈ సైబర్ ఉచ్చులో పడుతున్నారు. ఈ ఏడాది జనవరి మూడో తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఈ తరహా ఘటనలపై సైబర్ పోలీస్ స్టేషన్‌లో 19 కేసులు నమోదయ్యాయి

అప్రమత్తంగా ఉండండి..



స్మార్ట్ ఫోన్ వినియోగంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. సులువుగా డబ్బులు వస్తాయని నమ్మి మోసపోవద్దు. ఈ తరహా ఘటనల్లో సైబర్ నేరగాళ్లు ప్రత్యేకంగా రూపొందించుకున్న ప్రోగ్రామింగ్ ద్వారానే వెబ్ లింక్స్‌ను తయారు చేస్తారు. డబ్బులు చెల్లింపులు యూపీఐ, ఐఎంపీఎస్, ఆర్టీజీఎస్, నెఫ్ట్ తదితర పద్ధతుల ద్వారా సేకరిస్తారు. నేరగాళ్ల కదలికలపై నిఘా ఉంచాం. బాధితులకు న్యాయం చేస్తాం.

– టి.కె.రాణా, పోలీస్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా

● అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు రైతులు శనివారం గుర్తించారు. అనంతరాజు పేట పంచాయతీ లక్ష్మీనగర్ వెనుక ఉన్న పంట పొలాల్లో చిరుత పులి పాద ముద్రలు గమనించారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి ఫారెస్టు అధికారి రఘునాథ్ రెడ్డికి సమాచారం అందించారు. వెంటనే ఆయన సిబ్బందితో వచ్చి రైతులతో కలిసి పంట పొలాల్లో తిరిగి చిరుత పులి పాద ముద్రలను ధ్రువీకరించారు. నిఘా పెట్టి పులిని పట్టుకుని అడవుల్లో వదిలే చర్యలు తీసుకుంటామన్నారు.

80 ఏళ్ల వయసులో వెంటాడిన జైలు శిక్ష

25 ఏళ్ల క్రితం రూ.5 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఎంపీడీవో

- వృద్ధుడినని, అనారోగ్యంతో బాధపడుతున్నానని వేడుకోలు
- కుదరదని స్పష్టం చేసిన హైకోర్టు
- వేర్వేరు సెక్షన్ల కింద ఏడాది, 6 నెలల జైలుశిక్ష



సాక్షి, అమరావతి: ఓ ప్రధానోపాధ్యాయుడి నుంచి రూ.5 వేల లంచం డిమాండ్ చేసినందుకు ఏసీబీ అధికారులు 25 ఏళ్ల క్రితం పెట్టిన కేసు ఓ మాజీ ఎంపీడీవోను వృద్ధాప్యంలోనూ వెంటాడింది. 80 ఏళ్ల వయసులో ఆ అధికారి జైలు శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి ఎదురైంది. తన వయసు 80 ఏళ్లని.. అనారోగ్యంతో బాధపడుతున్నానని తెలిపిన ఆ మాజీ ఎంపీడీవో.. తనను కనికరించాలని అభ్యర్థించాడు. నిర్ద్వందంగా తిరస్కరించిన హైకోర్టు శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే గరిష్ట శిక్షతో కాకుండా కనిష్ట శిక్షతో సరిపెట్టింది. లంచం తీసుకున్నందుకు ఏసీబీ పెట్టిన కేసును కొట్టేస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు కొట్టేసింది. అప్పటి అధికారికి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7 కింద 6 నెలల జైలు, రూ.5వేల జరిమానా విధించింది. అలాగే సెక్షన్ 13(1)(డీ) కింద ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. ఈ రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు శుక్రవారం తీర్పు వెలువరించారు.

విధుల్లోకి చేర్చుకునేందుకు లంచం డిమాండ్

కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన యూవీ శేషారావు అప్పట్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసే వారు. ఆయనకు అదే జిల్లాలోని నడిమ తిరువూరు పాఠశాలకు బదిలీ కావడంతో.. విధుల్లో చేరేందుకు వెళ్లిన శేషారావును విధుల్లో చేర్చుకోలేదు. దీంతో ఆయన పరిపాలన ట్రిబ్యునల్ (ఏపీఏటీ)ను ఆశ్రయించగా.. ఆయనకు అనుకూలంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ట్రిబ్యునల్ ఉత్తర్వులను అమలు చేయడంతో పాటు జీతం బకాయిలను ఇప్పించాలని కోరుతూ శేషారావు అప్పటి తిరువూరు ఎంపీడీవో బత్తిన వెంకటేశ్వరరావు వద్దకు వెళ్లారు. ఇందుకు వెంకటేశ్వరరావు రూ.5 వేల లంచం అడిగారు. ఇవ్వలేనని చెప్పినా వినలేదు. దీంతో శేషారావు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శేషారావు నుంచి లంచం తీసుకుంటుండగా ఎంపీడీవో వెంకటేశ్వరరావును ఏసీబీ అధికారులు 1998లో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసుపై విచారణ జరిపిన విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టు లంచం తీసుకున్నారనేందుకు ఎలాంటి సాక్ష్యాలు లేవంటూ వెంకటేశ్వరరావుపై ఏసీబీ పెట్టిన కేసును కొట్టేస్తూ 2005లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏసీబీ అధికారులు 2007లో హైకోర్టులో అప్పీల్ చేశారు.

అప్పటి తీర్పును తప్పుపట్టిన హైకోర్టు

ఈ అప్పీల్‌పై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు విచారణ జరిపి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఏసీబీ ప్రత్యేక కోర్టు తీర్పును తప్పుపట్టారు. వెంకటేశ్వరరావు లంచం తీసుకున్నారనేందుకు ఆధారాలు ఉన్నాయని తేల్చారు. లంచం డిమాండ్ చేశారనేందుకు, లంచం తీసుకున్నారనేందుకు ఏసీబీ అధికారులు పూర్తి సాక్ష్యాధారాలను కోర్టు ముందుంచారని తెలిపారు. ఈ సాక్ష్యాధారాలను ఏసీబీ ప్రత్యేక కోర్టు సరైన కోణంలో విశ్లేషించలేదని ఆక్షేపించారు. వాదనల సమయంలో తన వయసు 80 ఏళ్లని, అనారోగ్యంతో బాధపడుతున్నానని వెంకటేశ్వరరావు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వాదనను తోసిపుచ్చుతున్నట్టు న్యాయమూర్తి స్పష్టం చేశారు. అయితే అవినీతి నిరోధక చట్టంలో నిర్దేశించిన గరిష్ట శిక్షకు బదులు కనిష్ట శిక్ష విధిస్తున్నట్టు పేర్కొన్నారు. సెక్షన్ 7 కింద 6 నెలల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా, సెక్షన్ 13(1)(డీ) కింద ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు.

ఆరు లక్షల టికెట్లు 60 నిమిషాల్లో ఖాళీ

- శ్రీవారి దర్శనానికి ఆన్‌లైన్‌లో విడుదల చేసిన టీటీడీ

తిరుమల: శ్రీవారి దర్శనాలకు ఆన్‌లైన్‌లో డిమాండ్ కొనసాగుతూనే ఉంది. మార్చి నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను శుక్రవారం ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేసింది. ఆరు లక్షల టికెట్లను భక్తులు 60 నిమిషాల వ్యవధిలోనే బుక్ చేసేసుకున్నారు. ఏప్రిల్, మే మాసాలకు సంబంధించిన అంగప్రదక్షిణ టికెట్లను రోజుకు 750 చొప్పున టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తే కేవలం 9 నిమిషాల వ్యవధిలో భక్తులు పొందారు. మార్చి నెలకు సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను రోజుకు 20 వేల చొప్పున 6.2 లక్షల టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తే గంటా 25 నిమిషాల వ్యవధిలో భక్తులు కొనుగోలు చేసేశారు. దీంతో టీటీడీ ఖాతాలో గంట వ్యవధిలో రూ.18.6 కోట్లు జమైంది. వయోవృద్ధులు, వికలాంగుల దర్శనానికి సంబంధించి రోజుకు వెయ్యి చొప్పున మార్చి నెలకు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తే గంటా 35 నిమిషాల వ్యవధిలో భక్తులు పొందారు. ఇక మూడు నెలలకు సంబంధించి రూ.10 వేల శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తే భక్తుల నుంచి అదే స్పందన లభిస్తోంది. మూడు నెలల కాలానికి సంబంధించిన 46 వేల టికెట్లను విడుదల చేస్తే రెండు గంటల వ్యవధిలో 10 వేల టికెట్లను భక్తులు కొనుగోలు చేయడంతో టీటీడీకి రూ.10 కోట్లు జమైంది. ఇలా ధరలతో సంబంధం లేకుండా శ్రీవారి దర్శనాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల చేయడమే తరువాయి అన్నట్లుగా భక్తులు పొందుతున్నారు. కాగా, తిరుమలలో శుక్రవారం అర్ధరాత్రి వరకు 61,265 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గన్నవరం సీఐకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

- దళిత జేఏసీ జాతీయ నాయకుడు పెరికే వరప్రసాదరావు



గుడివాడ టౌన్: గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కనకారావు కులధ్రువీకరణ పత్రం విషయంలో తాను చేసిన విమర్శలకు చంద్రబాబు నాయుడు తక్షణం క్షమాపణ చెప్పాలని దళిత జేఏసీ జాతీయ నాయకుడు పెరికే వరప్రసాదరావు డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దళిత నాయకులతో కలిసి ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కనకారావు బీసీ–సీ అంటూ ప్రచారం చెయ్యడం చంద్రబాబుకు తగదన్నారు. ఎస్సీలను అవమానపరుస్తూ ప్రకటనలు చేసిన చంద్రబాబును తక్షణమే అరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు. గన్నవరం తహసీల్దార్ విడుదల చేసిన కుల ధ్రువీకరణ పత్రం చెల్లదనడం చంద్రబాబు అవివేకానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈనాడు పత్రిక కనకారావు బీసీసీ అని ప్రచురించడం జర్నలిజానికే సిగ్గుచేటన్నారు.

బీసీలను రాజ్యాధికారం వైపు నడిపిస్తున్న సీఎం జగన్

- కొనియాడిన బీసీ సంఘాల నేతలు
- బీసీ సాధికారతలో దేశానికి ఆదర్శంగా నిలిచారంటూ ప్రశంస



మాట్లాడుతున్న తోలేటి శ్రీకాంత్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): దేశ చరిత్రలో బీసీలను గుర్తించడమే కాకుండా, వారిని రాజ్యాధికారం వైపు నడిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పలువురు బీసీ సంఘాల నేతలు ప్రశంసించారు. మున్నెన్నడూ లేని విధంగా బీసీలకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పించడమే అందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ బీసీలందరూ మూకుమ్మడిగా సీఎం జగన్‌కు మరోమారు పట్టం కట్టనున్నారని వారు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో 'బీసీలు –జగనన్న ప్రభుత్వం ప్రాధాన్యత' అంశంపై శనివారం జరిగిన చర్చా వేదిక నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ సామాజిక సాధికారత సాధనలో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో కూడా శాసన మండలిలో ఈ స్థాయిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు ఏనాడూ ప్రాతినిధ్యం కల్పించిన దాఖలాల్లేవన్నారు. నాడు చంద్రబాబు సామాజిక అన్యాయానికి పాల్పడగా.. సీఎం జగన్ ఆయా వర్గాల సాధికారత కోసం నిబద్ధతతో అడుగులేస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్.కృష్ణయ్య ఫోన్‌లో తన సందేశాన్ని వినిపించారు. ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్‌యాదవ్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బుద్దా నాగేశ్వరరావు, బీసీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్‌పీ రావు, రాష్ట్ర రజక సంఘాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ రాచకొండ జాన్‌బాబు, ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

మహిళదే ఆ మృతదేహం

- అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గడ్డివాములో కాలిన మృతదేహంపై నిర్ధారణ
- దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- మహిళా కమిషన్ ఆరా

సాక్షి, అమరావతి/రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరం–పసలపూడి గ్రామాల మధ్య గడ్డివాములో పూర్తిగా కాలిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం మహిళదని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ నెల 24న మండపేట–కాకినాడ ప్రధాన రహదారిని ఆనుకుని పంట పొలం దిమ్మపై ఉన్న గడ్డివాములో మృతదేహం బయటపడింది. మంటల్లో పూర్తిగా కాలిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం మహిళదా... పురుషుడిదా... అనే విషయంలో పోలీసులు తొలుత నిర్ధారణకు రాలేదు. అయితే, దీనిపై రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి నేతృత్వంలో మండపేట రూరల్ సీఐ శివగణేష్ దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనాస్థలంలో క్షుణ్ణంగా పరిశీలించగా, మహిళ తలకు పెట్టుకునే క్లిప్ కాలిన స్థితిలో కనిపించింది. గడ్డివాము సమీపంలో పగిలిన గాజు ముక్కలు, కొద్దిదూరంలో చెప్పులు దొరికాయి. వీటి ఆధారంగా ఆ మృతదేహం మహిళదేనని నిర్ధారణకు వచ్చారు. ఈ ఆధారాలతోనే కేసు చిక్కుముడి వీడాల్సి ఉంది. మరోవైపు పోలీసులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో మిస్సింగ్ కేసుల వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహం వివరాలతో మిస్సింగ్ కేసులను సరిపోల్చుకుని చూస్తున్నారు. అయితే, శనివారం సాయంత్రం వరకు ఎటువంటి క్లూ దొరకలేదని సమాచారం.

నేరస్తులను గుర్తించి అరెస్ట్ చేయండి : జయశ్రీరెడ్డి



కర్రి జయశ్రీ రెడ్డి

మాచవరం–పసలపూడి గ్రామాల మధ్య గడ్డివాములో పూర్తిగా కాలిన మహిళ మృతదేహం ఘటనపై రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సుధీర్ బాబుతో మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీ రెడ్డి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మహిళ పట్ల అంత కర్కశత్వానికి పాల్పడిన నేరస్తులను గుర్తించి తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారని, ప్రత్యేక బృందాలతో విచారణను ముమ్మరం చేసినట్లు ఎస్పీ వివరించారు. నేరస్తులను త్వరగా పట్టుకుంటామన్నారు. కేసు సమగ్ర విచారణ నివేదికను మహిళా కమిషన్‌కు సమర్పిస్తామని తెలిపారు.

ప్రకృతి సాగులో ఏపీ ఆదర్శం

- ప్రీ మాన్సూన్ సోయింగ్ పద్ధతిలో 3.70 లక్షల మంది రైతులు
- 1.32 లక్షల మహిళా సంఘాల సభ్యులకూ భాగస్వామ్యం
- పదేళ్లలో రాష్ట్రంలో 28 లక్షల మందికి భాగస్వామ్యం
- ప్రకృతి సాగుతో ఖర్చు తక్కువ.. ఆదాయం వృద్ధి
- యువత తిరిగి గ్రామాలకు చేరుకునేందుకు దోహదం



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఉద్యమంలా సాగుతున్న ప్రకృతి వ్యవసాయానికి అరుదైన గౌరవం దక్కింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం ఇటీవల విడుదల చేసిన సామాజిక ఆర్థిక సర్వేలో ఏపీలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని ప్రశంసించింది. రాష్ట్రంలో ప్రకృతి సాగు ద్వారా వస్తున్న సామాజిక మార్పులను ప్రత్యేకంగా ప్రస్తావించింది. అన్ని రాష్ట్రాలూ ఏపీని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించింది. తొలుత 704 గ్రామాల్లో 40 వేల మందితో ప్రారంభమైన ప్రకృతి సాగు రాష్ట్ర ప్రభుత్వంలో ఓ ఉద్యమంలా రూపుదిద్దుకొంది. ప్రస్తుతం 3,730 గ్రామాల్లో 6.30 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రీ మాన్సూన్ సోయింగ్ పద్ధతిలో (తొలకరి వర్షాలు కంటే ముందే విత్తనం వేయడం) 3.70 లక్షల మంది రైతులు ఏపీలో ప్రకృతి సాగు చేస్తున్నారు. మిగతా రైతులు వీరితో పాటు ఖరీఫ్, రబీలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రైతులు కాకుండా ఈ ఉద్యమంలో ఇప్పటివరకు 1.32 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు భాగస్వాములయ్యారు. 1.71 లక్షల మంది పేద, మధ్య తరగతుల ప్రజలు ఇళ్లలో కిచెన్ గార్డెన్లను పెంచుతున్నారు. 45 వేల మంది రైతులు ఏడాది పొడవునా ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటలు సాగు చేస్తూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. ఘన జీవ, ద్రవ జీవామృతాలు, కషాయాలు, వివిధ రకాల ద్రావణాలను రైతుల ముంగిట అందించేందుకు గ్రామైక్య సంఘాల సహకారంతో 3,909 బయో ఇన్‌పుట్ షాపులను ఏర్పాటు చేసింది. వచ్చే పదేళ్లలో రాష్ట్రంలో 28 లక్షల మందిని ప్రకృతి సాగులో భాగస్వాములను చేయాలన్నది లక్ష్యం. రాష్ట్ర సహకారంతో పొరుగు రాష్ట్రాల్లో మరో 4 లక్షల మందిని ప్రకృతి సాగు వైపు మళ్లించేలా ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసింది. ఏపీ స్ఫూర్తితో ఈ ఏడాది జాతీయ స్థాయిలో కోటి ఎకరాల్లో ప్రకృతి సాగుకు కేంద్రం చర్యలు చేపట్టింది.

ప్రకృతి సాగుతో వలసలకు అడ్డుకట్ట

ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన మార్పులపై సామాజిక ఆర్థిక సర్వేలో పలు ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు. ప్రకృతి సాగు వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గి రైతుల నికర ఆదాయం పెరుగుతున్నట్టు సర్వే పేర్కొంది. నగరాలకు వలసలు వెళ్లే యువతను తిరిగి గ్రామాలకు రప్పిస్తుందని తెలిపింది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లిన రాష్ట్ర యువతలో కొందరు ఇప్పటికే రాష్ట్రానికి తిరిగి వచ్చి ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. ఇదే కాకుండా పంట దిగుబడులను అంచనా వేసేందుకు ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఐడీఎస్) ఆధ్వర్యంలో చేపడుతున్న పంట కోత ప్రయోగాలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు ఏపీలో నిరూపితమైందని సర్వే వెల్లడించింది. వ్యవసాయంలో ఖర్చుతో పాటు రిస్కును తగ్గించి దిగుబడులను పెంచడం ద్వారా అధిక ఆదాయం లభిస్తుందని పేర్కొంది. వాతావరణ అనుకూల మార్పులకు బాటలు వేస్తోందని, సురక్షితమైన రసాయన రహిత ఆరోగ్యకర పౌష్టికాహారాన్ని సమాజానికి అందిస్తుందని, నేల ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని, తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థను, జీవ వైవిధ్యత పునరుత్పత్తి ద్వారా భావితరాలకు రక్షణగా నిలుస్తుందని పేర్కొంది. ఈ సాగు ప్రయోజనాలు ఏపీలో నిరూపితమయ్యాయని కూడా వెల్లడించింది. ప్రకృతి వ్యవసాయం అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలను, మహిళా సంఘాల భాగస్వామ్యాన్ని డాక్టర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని నీతి ఆయోగ్ ప్రతినిధి బృందం అభినందించిన అంశాన్ని ఆర్థిక సర్వే నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీని ఆదర్శంగా తీసుకొని మిగిలిన రాష్ట్రాలు కూడా ప్రకృతి సాగు వైపు అడుగులు వేయాలని ఆ సర్వేలో పేర్కొన్నారు.

సామాజిక సర్వేలో ప్రస్తావించడం హర్షణీయం

రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉద్యమంలా సాగుతున్న ప్రకృతి వ్యవసాయం వల్ల సమాజంలో వస్తున్న మార్పులు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఏపీసీఎన్ఎఫ్ (ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) చేస్తున్న కృషిని సామాజిక ఆర్థిక సర్వే ప్రశంసించడం హర్షణీయం. ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆర్థిక సర్వే ఊతమిస్తోంది.

– టి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ

నేడు పీజీడీఎం కోర్సులకు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు

చెన్నై: మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇంటర్నేషనల్ బిజినెస్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌ల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా (పీజీడీఎం) కోర్సులకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలను చేపట్టనుంది. వీటిని ఈ నెల 26న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. రామ్‌దా బై విందం, చెన్నై ఎగ్మోర్ గాంధీ ఇర్విన్ రోడ్, అన్సారీ ఎస్టేట్, ఎగ్మోర్, చెన్నై లో వీటిని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్యాట్, మ్యాట్, ఎక్స్‌ఏటీ, సీమ్యాట్, ఏటీఎంఏ, జీమ్యాట్‌ల్లో టాప్ స్కోర్లు వచ్చిన వారికి స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు 9391932129 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1800 120 4473 ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా...

..బీజేపీకి 100 సీట్లే: నితీశ్

పూర్ణియా: కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలన్నీ ఏకమై పోరాడితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వంద సీట్లకే కట్టడి చేయవచ్చని బిహార్ సీఎం నితీశ్ కుమార్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలతో జట్టుకట్టే విషయంలో కాంగ్రెస్ తొందరగా ఒక నిర్ణయానికి రావాలన్నారు. 'నా సూచనను మీరు అంగీకరిస్తే కాషాయ పార్టీని 100 సీట్లలోపే కట్టడి చేయవచ్చు. అంగీకరించని పక్షంలో ఏం జరుగుతుందో మీకు తెలుసు'అని ఆయన కాంగ్రెస్ నుద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలను ఏకం చేసి, బీజేపీని అధికారం పీఠం నుంచి దించేయడమే తన ఏకైక లక్ష్యమన్నారు. తన లక్ష్యం సాకారమయ్యేందుకు కృషి చేస్తున్నానని, బీజేపీని దేశంలో లేకుండా చేయాలని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లోని పూర్ణియాలో శనివారం జరిగిన మహాఘట్‌బంధన్ ర్యాలీలో నితీశ్ ప్రసంగించారు.

బీజేపీవి విభజన రాజకీయాలు: లాలూ
కుల, మత ప్రాతిపదికన దేశప్రజలను విభజించే కుట్రకు బీజేపీ తెరతీసిందని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స తర్వాత ఢిల్లీకి చేరుకున్న లాలూ అక్కడి నుంచే పూర్ణియాలో మహాకూటమి ర్యాలీనుద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. 'మైనారిటీలంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లకు గిట్టదు. కులం, మతాల వారీగా జనాన్ని విడగొట్టడమే బీజేపీ పని. బీజేపీని ఓడించే సంకల్పానికి బిహార్ నుంచి శ్రీకారం చుడదాం' అని పిలుపునిచ్చారు.

భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఎన్ఈపీ: మోదీ

న్యూఢిల్లీ: యువత సామర్థ్యం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్య, నైపుణ్యాలకు నూతన జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) కొత్త రూపమిచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. ఏళ్లుగా విద్యావిధానంలో సరళత లోపించడంతో ఈ రంగంలో స్తబ్దత ఆవరించిందని చెప్పారు. ఎన్ఈపీలో విద్య, నైపుణ్యాలకు సమాన ప్రాముఖ్యత లభించిందన్నారు. దీని వల్ల విద్యార్థులకు ప్రతిబంధకాలుగా మారిన గత నిబంధనలను తొలగించి విద్యారంగంలో మరిన్ని సంస్కరణలను చేపట్టేందుకు ప్రభుత్వానికి వీలు కలుగుతుందని ప్రధాని చెప్పారు. విద్య, నైపుణ్యాలతో యువశక్తిని సంసిద్ధులను చేయడం అంశంపై శనివారం జరిగిన బడ్జెట్ అనంతర వెబినార్‌నుద్దేశించి ఆయన ప్రసంగించారు. 'మన ఉపాధ్యాయుల పాత్ర ఇకపై కేవలం తరగతి గదులకే పరిమితం కారాదు. దేశవ్యాప్తంగా ఉన్న మన విద్యా సంస్థలకు మరిన్ని రకాల బోధనోపకరణాలు అందుబాటులోకి రానున్నాయి. వీటివల్ల గ్రామాలు, నగరాల్లోని పాఠశాలల మధ్య అంతరాన్ని తగ్గించే అనేక అవకాశాలు ఉపాధ్యాయులకు చేరువలో రానున్నాయి'అని ప్రధాని మోదీ చెప్పారు.



అమెరికాను వణికిస్తున్న జాంబీ డ్రగ్


ప్రాణాంతకంగా మారుతున్న జైలజీన్-ఫెంటానిల్ మిశ్రమం

- విచ్చలవిడిగా వాడుతున్న డ్రగ్ బానిసలు
- భయంకరమైన సైడ్ ఎఫెక్టులకు కారణం
- ఒళ్లంతా పుండ్లు, అవయవాల తొలగింపు
- ఫిలడెల్ఫియాలో మొదలై దేశమంతా వ్యాప్తి
- 36 రాష్ట్రాల్లో విస్తరించిన జాంబీ డ్రగ్
- కెనడాలో కూడా విస్తరిస్తున్న జాడ్యం



జాంబీ డ్రగ్ వాడితే...

- జైలజీన్ చర్మాన్ని, మాంసాన్ని తినేస్తుంది.
- కేంద్ర నాడీ వ్యవస్థపై నేరుగా తీవ్ర ప్రభావం చూపుతుంది.
- రక్తనాళాలు పాడవుతాయి. రోగ నిరోధక శక్తి క్షీణిస్తుంది.
- దాంతో చర్మం ఊడటంతో పాటు ఒళ్లంతా పుండ్లు పుడతాయి.
- పుండ్లు ముదిరి సంబంధిత అవయవాలు కుళ్లిపోతున్నాయి. వాటిని తీసేయాల్సి వస్తోంది.
- మతిమరుపు వంటి మరెన్నో భయానక సైడ్ ఎఫెక్టులూ తలెత్తుతాయి.
- గుండె, ఊపిరితిత్తుల పనితీరు, కంటిచూపు మందగిస్తాయి.
- శ్వాస అందదు. బీపీ పడిపోయి ప్రాణాంతకంగా మారుతుంది.



జైలజీన్. ప్రస్తుతం అమెరికాను వణికిస్తున్న 'జాంబీ' డ్రగ్. గుర్రాలు, ఆవులు తదితర జంతువుల్లో నరాలకు విశ్రాంతి ఇచ్చే నిమిత్తం అనుమతించిన ఈ ట్రాంక్విలైజర్ ఇప్పుడక్కడ పెను విలయానికి దారి తీస్తోంది. దీన్ని ఫెంటానిల్ అనే డ్రగ్‌తో కలిపితే అత్యంత హెచ్చు పొటెన్సీతో కూడిన ప్రాణాంతకమైన మత్తుమందుగా మారుతోంది. కారుచౌకగా తయారవుతుండటంతో డ్రగ్ డీలర్లు కొన్నేళ్లుగా దీన్నే విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. ట్రాంక్, ట్రాంక్ డోప్, జాంబీ డ్రగ్‌గా పిలిచే ఈ డ్రగ్ ప్రస్తుతం యూఎస్ వీధుల్లో పొంగిపొర్లుతోంది. ఎక్కడ చూసినా డ్రగ్ బానిసలు ట్రాంక్ మత్తులో జోగుతూ కన్పిస్తున్నారు. శరీరంపై దీని దుష్ప్రభావాలు చాలా తీవ్రంగా ఉంటున్నాయి. ఒంటిపై పుండ్లు పడటం, చర్మం ఊడిపోవడంతో మొదలై చూస్తుండగానే ఒంట్లో శక్తులన్నీ ఉడిగిపోయే పరిస్థితి తలెత్తుతోంది. అడుగు తీసి అడుగేయడమూ కష్టమై బాధితులు నడిచే శవాల్లా మారి అచ్చం జాంబీలను తలపిస్తున్నారు! ఈ ధోరణి కొంతకాలంగా మరీ ప్రమాదకర స్థాయిలో పెరిగిపోతోంది.

> "జాంబీ డ్రగ్ తమకు మరింతగా లాభాల పంట పండించగలదని ఫిలడెల్ఫియా డ్రగ్ డీలర్లు తొలుత కనిపెట్టారు. ఇప్పుడిది అమెరికాను దాటి కెనడా దాకా విస్తరించింది"
> – నబురన్ దాస్‌గుప్తా, ఎపిడెమాలజిస్ట్, సీనియర్ సైంటిస్ట్, నార్త్ కరోలినా వర్సిటీ

కేంద్ర స్థానం ఫిలడెల్ఫియా

ఈ జాంబీ డ్రగ్ ఉత్పాతానికి ఫిలడెల్ఫియా కేంద్ర స్థానంగా తేలింది. మామూలుగానే ఈ నగరం డ్రగ్స్ డీలర్లకు, బానిసలకు అడ్డా. దాంతో సహజంగానే జాంబీ డ్రగ్ వాడకం కూడా ఇక్కడ విచ్చలవిడిగా పెరిగింది. ఏ వీధిలో చూసినా దీని ప్రభావంతో ఎటూ కదల్లేక ఎక్కడపడితే అక్కడ పడిపోయిన డ్రగ్ బానిసలే కన్పిస్తున్నారు. జాంబీ డ్రగ్ బెడద చూస్తుండగానే అమెరికా అంతటికీ పాకుతోంది. తూర్పున న్యూయార్క్, మసాచుసెట్స్, మైన్, పశ్చిమ తీరంలో కాలిఫోర్నియా, ఒరెగాన్, వాషింగ్టన్, దక్షిణాన టెక్సాస్, లూసియానా, అలబామా... ఇలా 36కు పైగా రాష్ట్రాల్లో వేలాది జాంబీ కేసులు వెలుగు చూడటం అధికారులను ఆందోళన పరుస్తోంది. సమస్య తీవ్రత బయటికి కన్పిస్తున్న దానికంటే చాలా ఎక్కువగా ఉందని అధికారులే అంగీకరిస్తున్నారు. ఫిలడెల్ఫియాలోనే ఏకంగా 90 శాతానికి పైగా డోప్ టెస్ట్ శాంపిళ్లలో జైలజీన్ జాడలు కన్పించాయి. న్యూయార్క్ నగరంలో 25 శాతానికి పైగా శాంపిళ్లలో జైలజీన్ బయటపడింది.

సులువుగా దొరికేస్తోంది


జైలజీన్ అమెరికాలో అతి సులువుగా దొరుకుతోంది. కేవలం పశువుల డాక్టర్ చీటీ చాలు. పైగా కారుచౌక కూడా. దీంతోపాటు దీని సరఫరాపై పెద్దగా నియంత్రణ కూడా లేదు. ఇది డ్రగ్ మాఫియాకు మరింతగా కలిసొచ్చింది. కరోనా సమయంలో ఫెంటానిల్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. ఆ క్రమంలోనే ట్రాంక్ వాడకం పెచ్చరిల్లింది! మితిమీరిన డ్రగ్స్ వాడకం వల్ల మరణిస్తున్న వారి సంఖ్య అమెరికాలో బాగా పెరుగుతోంది. 2021లో లక్ష మందికి పైగా డ్రగ్స్‌కు బలయ్యారు! వీటిలో 70 వేలకు పైగా కేసుల్లో ఫెంటానిల్ వాడినట్టు తేలింది. వాటిలో చాలావరకు ట్రాంక్ కేసులేనని అనుమానిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

చికిత్స లేదు

ఫిలడెల్ఫియా తదితర చోట్ల స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే ఆస్పత్రులు, క్లినిక్‌లకు జాంబీ డ్రగ్ బాధితులు బారులు తీరుతున్నారు. చాలామందికి కాళ్లు, చేతులు తీసేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు. తమ వద్దకు వస్తున్న వారికంటే రకరకాల కారణాలతో ముఖం చాటేస్తున్న వారే చాలా ఎక్కువగా ఉంటారని వారంటున్నారు. అయితే జైలజీన్ ఓవర్ డోస్ తాలూకు దుష్ప్రభావాలను తగ్గించేందుకు చికిత్స ఏదీ ఇప్పటిదాకా అందుబాటులో లేకపోవడం మరింత ఆందోళనకు కారణమవుతోంది. ఫెంటానిల్‌తో పాటు ఇతర డ్రగ్స్ తాలూకు లక్షణాలను నెమ్మదింపజేయడానికి వాడే నాలోగ్జోన్ వంటివాటినే ప్రస్తుతానికి వీరికీ వాడుతున్నారు. కాకపోతే జైలజీన్ వాడకంతో తలెత్తున్న శ్వాస, బీపీ సమస్యలకు ఇది పని చేయడం లేదు. జైలజీన్ వాడకం తాలూకు సైడ్ఎఫెక్టుల గురించి హెచ్చరిస్తూ అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) గత నవంబర్లోనే చాలా రాష్ట్రాల్లోని ఆస్పత్రులు, క్లినిక్‌లకు అలర్ట్ పంపింది. చూడటానికి ఇతర డ్రగ్ ఓవర్ డోస్ కేసుల్లాగే కన్పించడం వల్ల దీన్ని ఆరంభ దశలోనే కనిపెట్టడం కూడా కష్టమే.

అమెరికాలో డ్రగ్ ఓవర్ డోస్ మరణాలు



ఫెంటానిల్ మరణాలు



జైలజీన్ కథా కమామిషు

- గుర్రాలు, ఆవులు, గొర్రెలపై వాడేందుకు దీన్ని 1962లో తయారు చేశారు.
- అప్పట్లోనే మనుషులపైనా ప్రయోగాలు చేసినా శ్వాస, హృదయ స్పందన, బీపీ తగ్గిపోవడంతో నిలిపేశారు.
- 2000 నుంచీ డ్రగ్ బానిసలు దీన్ని హెరాయిన్‌తో కలిపి తీసుకోవడం మొదలైంది.



- కొకైన్, ఓపియం వంటివాటితో కలిపినా ఇది ప్రాణాంతకమే. కానీ ఫెంటానిల్ చౌక కావడంతో ఎక్కువగా దాన్నే వాడుతున్నారు.
- ఇలా ట్రాంక్‌గా పిలిచే జైలజీన్-ఫెంటానిల్ మిశ్రమ డ్రగ్ వాడకం 2011లో ప్యూర్టోరికోలో మొదలైంది.
- ప్యూర్టోరికో వాసులు ఎక్కువగా ఉండే ఫిలడెల్ఫియాలోని కెన్సింగ్టన్ తదితర చోట్లకూ పాకింది.
- కారుచౌకగా దొరుకుతుండటంతో కరోనా వేళ దీని వాడకం విచ్చలవిడిగా పెరిగింది.
- ఇప్పుడు అమెరికాలో కనీసం 30కి పైగా రాష్ట్రాల్లో విస్తరించి వణుకు పుట్టిస్తోంది.
- జైలజీన్ కారుచౌక. పైగా కేవలం పశువుల డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటే ఎంత పరిమాణంలో అయినా దొరుకుతుంది.
- ఇంజక్షన్‌తో పాటు పొడి రూపంలో కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండటంతో డ్రగ్ డీలర్ల పని మరింత తేలికైంది.
- హెరాయిన్ డోసు కనీసం 10 డాలర్లు పెట్టనిదే దొరకదు. కానీ ట్రాంక్ మాత్రం మూడు నాలుగు డాలర్లకే దొరికేస్తోంది.
- ఇల్లూ వాకిలీ లేక రోడ్లపై కాలం గడుపుతూ ఏళ్ల తరబడి డ్రగ్స్‌కు బానిసలైన అమెరికన్లంతా ట్రాంక్ బాట పడుతున్నారు.

నా ఇన్నింగ్స్ ముగిసింది!

- కాంగ్రెస్ ప్లీనరీలో సోనియా వ్యాఖ్యలు
- రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం
- అధ్యక్షురాలిగా మాత్రమేనన్న పార్టీ



నవ రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): 'పార్టీలో నా ఇన్నింగ్స్ పూర్తి అయిందని భావిస్తున్నా' అంటూ కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి! శనివారం కాంగ్రెస్ ప్లీనరీ రెండో రోజు సమావేశాలు ఇందుకు వేదికయ్యాయి. పాతికేళ్ల క్రితం సోనియా అధ్యక్షురాలయ్యాక ఆమె సారథ్యంలో పార్టీ సాధించిన విజయాలు, స్మరణీయ ఘటనలపై వీడియోను ప్రదర్శించారు. అది చూశాక సోనియా ఉద్వేగంతో మాట్లాడారు. ''1998లో తొలిసారిగా పార్టీ అధ్యక్షురాలినవడాన్ని గౌరవంగా భావిస్తా. ఈ పాతికేళ్లలో పార్టీ ఎన్నో శిఖరాలను అధిరోహించింది. సవాళ్లు ఎదుర్కొంది. 2004, 2009 ఎన్నికల విజయాలు, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో పాలన నాకెంతో సంతోషం కలిగించాయి. రాహుల్ సారథ్యంలో సాగిన భారత్ జోడో యాత్ర నాకెంతో సంతృప్తిని ఇచ్చింది. పార్టీ కీలక మలుపులో జరిగిన ఆ యాత్ర నా ఇన్నింగ్స్‌కు సంపూర్ణ సంతృప్తినిచ్చింది. ఈ యాత్ర ఘన విజయం ద్వారా పార్టీలో నా ఇన్నింగ్స్ ముగిసిందని భావిస్తున్నా. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో నవతరానికి ఖర్గే తన అపార అనుభవంతో మార్గదర్శకం చేస్తారు'' అని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలు పార్టీతో పాటు జాతీయ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయంగా మారాయి. సోనియా వ్యాఖ్యలకు ఎవరికి వారు భాష్యం చెప్పుకున్నారు. ఆమె క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుంటున్నారనీ కొందరన్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లోనూ చర్చనీయంగా మారడంతో కాంగ్రెస్ నాయకురాలు కుమారి సెల్జా దీనిపై స్పష్టతనిచ్చారు. 'పార్టీ అధ్యక్షురాలిగా తన ఇన్నింగ్స్ ముగిసిందన్నది మాత్రమే సోనియా వ్యాఖ్యల ఉద్దేశం'' అని వివరణ ఇచ్చారు.

బీజేపీపై సోనియా నిప్పులు
దేశంలో మైనారిటీలపై కక్షగట్టిన బీజేపీ.. విస్తృతస్థాయిలో విద్వేషాగ్నిని ఎగదోస్తోందని సోనియా ఆరోపించారు. ''మోదీ సర్కార్ కేవలం ఒక్క కుబేరుడికి లబ్ధి చేకూర్చే విధానాలు అవలంబిస్తూ దేశ ఆర్థికవ్యవస్థ పటిష్టతను దెబ్బ తీస్తోంది. మైనారిటీలు, మహిళలు, దళితులు, గిరిజనులను లక్ష్యం చేసుకుని దేశంలో విద్వేష వాతావరణాన్ని బీజేపీ సృష్టించింది. ఈ తరుణంలో కాంగ్రెస్ కార్యకర్తలు కార్యసాధకులై ముందుకు కదలాలి. పార్టీ విస్పష్టమైన సందేశాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి పౌరుడిదాకా తీసుకెళ్లాలి. రాజ్యాంగ విలువల తీవ్ర ఉల్లంఘనకు బీజేపీ సర్కార్ తెగించింది. ఖర్గే నాయకత్వంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల పోరులో బీజేపీని ఓడించే లక్ష్యాన్ని పార్టీ కార్యకర్తలు సాధించి చూపాలి'' అని పిలుపునిచ్చారు.

పొత్తుకు సై

- బీజేపీని గద్దె దింపడమే లక్ష్యం
- భావసారూప్య పార్టీలతో పొత్తులు
- త్యాగాలకూ సిద్ధం: ఖర్గే
- ప్లీనరీలో శ్రేణులనుద్దేశించి ప్రసంగం


ప్లీనరీ వేదికపై సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరులు

నవ రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్): ప్రజావ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భావసారూప్య పార్టీలతో చేయిచేయి కలిపేందుకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల్లో ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. లక్ష్య సాధన కోసం త్యాగాలు చేసేందుకు వెనుకాడబోమని ఉద్ఘాటించారు. రాయ్‌పూర్‌లో పార్టీ ప్లీనరీలో ప్రసంగిస్తూ ప్రధాని మోదీపైనా విమర్శలు ఎక్కుపెట్టారు. 'ఢిల్లీ ప్రధానసేవకుడైన ఆయన ముఖచిత్రంతో రోజూ పత్రికల్లో అడ్వర్‌టైజ్‌మెంట్లు వస్తూనే ఉన్నాయి. ఆయన మాత్రం తన సొంత స్నేహితుడి కోసం 'సేవలందిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. 'పేదల వ్యతిరేక వైఖరి బీజేపీ డీఎన్ఏలోనే ఉంది. ప్రజాస్వామ్యం ఖూనీకాకుండా ఆపేందుకు ప్రజాఉద్యమం వెల్లువలా రావాల్సిన అవసరమొచ్చింది. భారత్ జోడో యాత్ర.. ప్రజాసమస్యలకు గొంతుకగా మారింది. బీజేపీ హయాంలో రాజ్యాంగ విలువలు, సామాజిక సామరస్యం దెబ్బతిన్నాయి. చైనాతో సరిహద్దు వివాదం, పెచ్చరిల్లుతున్న విద్వేషం, పెరిగిన ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఆర్థిక అసమానతలు దేశానికి పెను సవాళ్లు విసురుతున్నాయి. ఈ తరుణంలో కాంగ్రెస్ నేతృత్వంలోని భావసారూప్య పార్టీలే కొత్త ప్రభుత్వపాలన ద్వారా ప్రజాసంక్షేమాన్ని సాధ్యంచేయగలవు. అందుకోసం ఎలాంటి త్యాగాలు చేసేందుకైనా సదా సిద్ధం' అని వ్యాఖ్యానించారు. 'పార్లమెంటరీ, రాజ్యాంగ సంప్రదాయాలను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు ఈడీ, సీబీఐలను బీజేపీ రంగంలోకి దింపింది. ఛత్తీస్‌గఢ్‌లో ప్లీనరీ సమావేశాలకు ఇబ్బందికలిగేలా ఇక్కడి నేతలపై ఈడీ దాడులకు తెగబడింది. అయినా నేతలు తెగవతో ఎదుర్కొని సమావేశాలు సజావుగా సాగేలా చేశారు' అని అన్నారు.

రైతుకు రూ.27.. వారికి రూ.1,000 కోట్లు
కుబేరుడు గౌతమ్ అదానీని ఉద్దేశిస్తూ.. 'దేశం ఎటు పోతోంది? ఓవైపు రైతుకు రోజుకు కేవలం రూ.27 ఆదాయం దక్కుతుంటే ప్రధాని స్నేహితుడు రోజుకు రూ.1,000 కోట్ల ఆదాయం ఎలా రాబట్టగలుగుతున్నారు? కోవిడ్ కాలంలో ప్రధాని స్నేహితుల సంపద 1,300 శాతం ఎగసింది. రైల్, బెయిల్ (భారత్ హెవీ ఎలక్ట్రికల్స్), సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా).. ఇలా ప్రతీదీ వారికే ధారాదత్తం చేస్తున్నారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ అయినా ఉంచుతారో లేక వీరికే అమ్మేస్తారోనని ప్రజల్లో ఆలోచనలు పెరిగాయి. ధరాఘాతంతో దేశ ప్రజల ఇంటి బడ్జెట్ తలకిందులవుతుంటే ఇక్కడి పారిశ్రామికవేత్తలు అపరకుబేరుల అవతారం ఎత్తుతున్నారు. అధికార బుల్డోజర్ కింద పేదలు నలిగిపోతున్నారు. ఓవైపు చైనా భారత భూభాగంలోకి చొరబడుతుంటే విదేశాంగ మంత్రి జైశంకర్ తన తండ్రికి అప్పట్లో ప్రమోషన్ దక్కలేదని వాపోతారు' అని ఖర్గే అన్నారు.

ఇవే మా లక్ష్యాలు
'సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగంలో కోట్లాదిమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. నిత్యావసర సరకుల ధరలు దించుతాం. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గిస్తాం. రైతుల ఉత్పత్తులకు సరైన ధర కల్పిస్తాం. విద్వేష వాతావరణాన్ని చెదరగొట్టి సామరస్యాన్ని సాధించి చూపుతాం. ధన బలం, అధికార బలం లేకుండా చూస్తాం. దేశ పురోభివృద్ధిలో ప్రజలతో కలిసి నడుస్తాం. ముందుండి నడిపిస్తాం' అన్నారు.

సీడబ్ల్యూసీలో 50 శాతం వారికే
వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)లో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలు, మహిళలు, యువత, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ శనివారం కాంగ్రెస్ పార్టీ తన పార్టీ రాజ్యాంగానికి సవరణ చేసింది. సవరణ ప్రకారం పార్టీ నుంచి ప్రధానులైన నేతలు, మాజీ ఏఐసీసీ చీఫ్‌లకు సీడబ్ల్యూసీలో సభ్యత్వం ఉంటుంది. సీడబ్ల్యూసీ సభ్యుల సంఖ్యను 25 నుంచి 35కు పెంచారు. ఇకపై పార్టీలో కేవలం డిజిటల్ మెంబర్‌షిప్, రికార్డులను కొనసాగిస్తారు.

మూడో ఫ్రంట్‌తో ఎన్డీయేకే మేలు
మూడో ఫ్రంట్ అనే మాటే వినపడకుంటే భావసారుప్యత ఉన్న అన్ని పార్టీలను 'గుర్తించి', 'సమీకరించి', 'ఏకంచేసే' బృహత్తర పనికి వెంటనే పూనుకోవాలనే రాజకీయ తీర్మానం ముసాయిదాలో కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 'కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు లౌకిక, సామ్యవాద శక్తుల ఏకీకరణే అసలైన హాల్‌మార్క్‌గా నిలుస్తుంది. ఎన్డీయేకు వ్యతిరేకంగా విపక్షాలను ఐక్యం చేయాల్సిన అత్యవసరస్థితి ఇది. ఆలస్యం చేస్తే అది ఎన్డీయేకే మేలు చేస్తుంది' అని ముసాయిదాలో నేతలు ఆందోళన వ్యక్తంచేశారు.

'ప్రధాని ఆశతోనే కాంగ్రెస్, ఆర్జేడీతో దోస్తీ

బిహార్ సీఎం నితీశ్ కుమార్‌పై అమిత్ షా ధ్వజం

లారియా(బిహార్): బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్‌పై బీజేపీ అగ్రనేత అమిత్ షా ఆరోపణల వర్షం కురిపించారు. బిహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లాలోని లారియాలో శనివారం ర్యాలీలో అమిత్ షా ప్రసంగించారు. 'మూడేళ్లకోసారి నితీశ్‌కు ప్రధాని పీఠంపై ప్రేమ పుట్టుకొస్తుంది. అందుకే హఠాత్తుగా బీజేపీతో పొత్తును తెగతెంపులు చేసుకుని కాంగ్రెస్, ఆర్జేడీతో జట్టుకట్టారు. ఆయన పచ్చి అవకాశవాది' అంటూ నిప్పులు చెరిగారు.'బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ కంటే బీజేపీనే ఎక్కువ సీట్లు సాధించినా ఇచ్చిన మాట కోసం నితీశ్‌నే మోదీ ముఖ్యమంత్రి చేశారు. ఇకపై నితీశ్‌తో ఇక జట్టుకట్టేదిలేదు' అని తేల్చిచెప్పారు.

బెంగాల్‌లో కేంద్రమంత్రి కాన్వాయ్‌పై దాడి

దిన్హాటా: పశ్చిమబెంగాల్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ ప్రామాణిక్ కాన్వాయ్‌పై తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులుగా భావిస్తున్న వారు దాడికి పాల్పడ్డారు. కూచ్‌బెహార్ జిల్లా దిన్హాటా ప్రాంతంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. 'పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తుండగా టీఎంసీ కార్యకర్తలు నా కాన్వాయ్‌పై రాళ్లతో దాడి చేశారు. బాంబులు విసిరారు. కాల్పులు కూడా జరిపారు. దాడిలో పలువురు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు. పోలీసులు చూస్తుండగా ఇవన్నీ జరిగాయి'అని మంత్రి ఆరోపించారు. ఈ సందర్భంగా టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టి, పరిస్థితిని సద్దుమణిగించారు.

ఎదురుకాల్పుల్లో నేలకొరిగిన ముగ్గురు జవాన్లు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ అటవీప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు డీఆర్జీ జవాన్లు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు, డీఆర్జీ బలగాలు జేగురుగొండ నుంచి దండకారణ్య అటవీ ప్రాంతంలో రోజువారీ గాలింపుల్లో ఉండగా కందేడ్ అటవీ ప్రాంతంలో శనివారం ఉదయం మావోయిస్టులు కాల్పులు జరిపారు. ముగ్గురు జవాన్లు మృతి చెందగా గాయపడిన వారిని వెంటనే క్యాంప్‌కు తరలించి వైద్యమందించారు. రెండు ఏకే 47 తుపాకులు, 51 ఎంఎం మోర్టార్‌ను మావోయిస్టులు అపహరించారు. కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయి ఉంటారని పోలీసులంటున్నారు. వారి కోసం భారీగా కూంబింగ్ చేపట్టినట్టు బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్‌రాజ్ చెప్పారు.

ఆర్మీ జవాన్‌ను హతమార్చిన మావోయిస్టులు
చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో శనివారం ఓ ఆర్మీ జవాన్‌ను మావోయిస్టులు హతమార్చారు. జిల్లాలోని బడెతెవాడకు చెందిన జవాన్ మోతీరామ్ సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. సమీపంలోని ఉసేలీ వారపు సంతలో కోడి పందేలు చూస్తుండగా ముగ్గురు మావోయిస్టులు మూడు రౌండ్ల కాల్పులు జరపడంతో మోతీరాం అక్కడికక్కడే మృతిచెందారు.

శాంతి ప్రక్రియలో భాగస్వామ్యానికి సిద్ధం

- ఉక్రెయిన్ సంక్షోభంపై మోదీ
- జర్మనీ చాన్స్‌లర్ షోల్జ్‌తో భేటీ


రాష్ట్రపతి ముర్ముతో షోల్జ్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని భారత్ పదేపదే చెబుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఇందుకు సంబంధించిన ఎలాంటి శాంతి ప్రక్రియలోనైనా భాగస్వామిగా మారేందుకు భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఢిల్లీలో శనివారం జర్మన్ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్‌తో చర్చలు జరిపారు. ఏడాదిగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ సంక్షోభం పర్యవసానాలు ముఖ్యంగా ఆహారం, ఇంధన భద్రత వంటి పలు అంశాలతో వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతలు, వాతావరణ మార్పు వంటి అంశాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు విడుదల చేసిన ఒక సంయుక్త ప్రకటనలో షోల్జ్..'ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ తీవ్ర విపత్తు, ఇది ప్రపంచంపై విపరీత దుష్ప్రభావాలను కలుగజేసింది. ఈ అంశంపై ఐక్యరాజ్య సమితి సహా అన్ని వేదికలపై మనం వేసే అడుగులపై స్పష్టత అవసరం'అని పేర్కొన్నారు. హింసామార్గం ద్వారా సరిహద్దులను ఎవరూ మార్చ జాలరని షోల్జ్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్వేచ్ఛావాణిజ్యం ఒప్పందం(ఎఫ్‌టీఏ), పెట్టుబడుల రక్షణ ఒప్పందాలను సాధ్యమైనంత తొందరగా ఖరారు చేయాలనుకుంటున్నట్లు షోల్జ్ చెప్పారు.

భారత్ వైఖరి మొదట్నుంచీ అదే
'ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చలు, దౌత్యమార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ మొదట్నుంచీ కోరుతోంది. ఇందుకు సంబంధించి జరిగే శాంతి ప్రక్రియలో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉంది'అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితిలోనూ ఇదే విషయం కుండబద్దలు కొట్టిందన్నారు. 'భారత్, జర్మనీల మధ్య రక్షణ, భద్రత సహకారం వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకంగా మారనుంది. ఈ రంగాల్లో మరిన్ని అవకాశాలను అన్వేషించాలి. ఉగ్రవాదం, వేర్పాటు వాదంపై పోరులో భారత్, జర్మనీల మధ్య మంచి సహకారం కొనసాగుతోందని మోదీ అన్నారు. భారత్‌లో రెండు రోజుల పర్యటనకు గాను షోల్జ్ శనివారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు.

అమెరికాను వదలని మంచు తుపాను


కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఆల్పైన్ మిడోస్ ప్రాంతంలో కొండలా పేరుకుపోయిన మంచు

లాస్‌ఏంజెలెస్: అమెరికాలోని పశ్చిమ రాష్ట్రాలు మంచు తుపాను తాకిడికి విలవిల్లాడుతున్నాయి. దాదాపు 10 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు మూతబడ్డాయి. ఒక్క శుక్రవారమే 300పైగా విమాన సర్వీసులు రద్దవగా, మరో 5 వేల సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. కాలిఫోర్నియా, మిషిగన్ రాష్ట్రాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. సియొర్రా నెవడా, దక్షిణ కాలిఫోర్నియా పర్వత శ్రేణుల్లో 1.5 మీటర్ల మేర మంచు కురియవచ్చని, ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పశ్చిమ తీరంలోని కీలకమైన నార్త్–సౌత్ హైవేను కలిపే ఇంటర్ స్టేట్ –5ను మూసివేశారు. మిషిగన్‌లో మంచు కురియడంతో కరెంటు లైన్లు తెగిపోయాయి. ఒక దశలో మిషిగన్‌లోని 8.20 లక్షల ఇళ్లకు కరెంటు సరఫరా బందయింది. గత 50 ఏళ్లలో ఇంత తీవ్రంగా ప్రభావం చూపిన మంచు తుపాను ఇదేనని డెట్రాయిట్ విద్యుత్ శాఖాధికారి ఒకరు చెప్పారు. .శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో భారీ స్థాయిలో మంచుకురియడం చాలా అరుదని శంకర్ క్రిష్ణన్ అనే స్థానికుడు చెప్పారు.

నేపాల్ కొత్త అధ్యక్షుడిగా పౌద్యాల్!

ఎనిమిది పార్టీల మద్దతు • ప్రమాదంలో ప్రచండ సర్కారు!

కాఠ్మాండూ: నేపాల్ నూతన అధ్యక్షుడిగా నేపాలీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రామచంద్ర పౌద్యాల్ ఎన్నికయ్యే అవకాశముంది. దేశాధ్యక్ష ఎన్నికల్లో భాగంగా శనివారం ఆయన అభ్యర్థిత్వానికి ఎనిమిది రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. కేపీ శర్మ ఓలీ నేతృత్వంలోని సీపీఎన్(యూఎంఎల్), పుష్పకమల్ దహాల్(ప్రచండ) నేతృత్వంలోని సీపీఎన్(మావోయిస్ట్ సెంటర్), మరో ఐదు పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన సంగతి తెల్సిందే. అయితే కూటమి పార్టీ అయిన సీపీఎన్(యూఎంఎల్) బలపరిచిన అభ్యర్థి సుభాష్ నెబాంగ్‌కి కాకుండా అధికార కూటమిలోలేని వేరొక పార్టీ అభ్యర్థికి ప్రధానమంత్రి ప్రచండ మద్దతు పలకడంతో రెండునెలల క్రితమే కొలువుదీరిన ప్రభుత్వం కూలే పరిస్థితులు నెలకొన్నాయి. నేపాల్ పార్లమెంట్‌లో పార్టీల ప్రస్తుత బలాబలాల ప్రకారం ఈ ఎనిమిది పార్టీలు బలపరిచే అభ్యర్థే వచ్చే నెలలో జరిగే దేశాధ్యక్ష ఎన్నికల్లో గెలుస్తారు. ప్రచండ నిర్ణయంతో ఆగ్రహించిన అధికార కూటమిలోని నేషనల్ డెమొక్రటిక్ పార్టీ తాము ప్రభుత్వం నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ ఛైర్మన్ రాజేంద్ర ప్రసాద్ లింగ్డెన్ ఉప ప్రధానిగా రాజీనామా చేశారు. కూటమి పార్టీలు మద్దతు ఉపసంహరిస్తే నెలరోజుల్లోపు పార్లమెంట్‌లో ప్రచండ విశ్వాస పరీక్షలో నెగ్గాలి.



ప్రశాంత సంధ్య

శనివారం సాయంత్రం బెంగళూరు ఆర్ఆర్ నగరలో నిర్మలమైన ఆకాశంలో సంధ్యా శోభ. మెట్రో మార్గం పై నుంచి కెమెరా క్లిక్‌మంది

న్యూస్‌రీల్

24 గంటల్లో రూ. 6వేల కోట్ల టెండర్లా?

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల వ్యవధిలో రూ.6 వేల కోట్ల విలువ చేసే 1,830 టెండర్లను పిలిచి కావలసినవారికి కట్టబెట్టిందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పృథ్వీరెడ్డి ఆరోపించారు. శనివారం నగరంలో పార్టీ ఆఫీసులో ఈ మేరకు ఆధారాలను విడుదల చేశారు. శుక్రవారం వేకువజామున 4.30 నుంచి 25 తేదీ వేకువజామున 2.30 మధ్య రూ.6 వేల కోట్ల మొత్తం చేసే 1,830 అల్పావధి పనులకు టెండర్లు పిలిచారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. కొద్దిరోజుల్లో ఎన్నికలు జరుగుతుండగా హడావుడిగా టెండర్లను ఇవ్వడం సబబు కాదన్నారు. ప్రజల సొమ్మును లూటీ చేయడమే దీని వెనుకున్న ఉద్దేశమన్నారు.

రాష్ట్రంలో అమిత్ షా నివాసం

శివాజీనగర: కర్ణాటకలో ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంమంత్రులు అమిత్ షా, ధర్మేంద్ర ప్రధాన్‌లు రాష్ట్రంలోనే నివాసం ఉంటారని మంత్రి ఆర్.అశోక్ అన్నారు. శనివారం బాగలకోట జిల్లా బీళగి నియోజకవర్గంలో మాట్లాడుతూ పార్టీని గెలిపించాలని వారు ఇక్కడికే వస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకుల తరహాలో వచ్చి ప్రసంగించి వెళ్లిపోవడం కాదని, ఇక్కడికి వచ్చి నివాసం ఉంటారని తెలిపారు. మరోసారి రాష్ట్రంలో కమలం వికసించాలని కేంద్ర నాయకులు మెగా ప్లాన్ వేస్తున్నారని తెలిపారు.

తప్పుడు తేదీతో డెత్ సర్టిఫికెట్

మైసూరు: తప్పుడు తేదీతో డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన గ్రామ అకౌంటెంట్ ఉదంతం ఇది. తలకాడు లో గ్రామ అకౌంటెంట్ ప్రశాంత్ చేసిన ఈ పనికి నరేంద్ర అనే వ్యక్తి ఇబ్బందుల్లో పడ్డాడు. వివరాలు.. తలకాడుకు చెందిన టి.రంగేగౌడ 2018, డిసెంబర్ 7న కారు ప్రమాదంలో గాయపడి మైసూరు కావేరి ఆస్పత్రిలో చికిత్స చేరాడు, చికిత్స ఫలించక 8న మరణించాడు. డెత్ సర్టిఫికెట్ కావాలని మైసూరు పాలికెలో ఆయన కుమారుడు నరేంద్ర దరఖాస్తు చేసుకున్నాడు. జారీ అయిన డెత్ సర్టిఫికెట్‌లో 8వ తేదీకి బదులుగా 7వ తేదీ అని రాయడంపై ఫిర్యాదు చేశాడు. రంగేగౌడ పేరిట ఉన్న పొలం కుటుంబ తగాదాల్లో ఉంది. ఈ క్రమంలో ప్రత్యర్థులకు మేలు చేకూర్చేలా ప్రశాంత్ తప్పుడు తేదీని ఇచ్చారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కానీ ప్రశాంత్‌పై ఎలాంటి చర్యలు లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

ఓటీపీ రాకుంటే, నో ఓటు



- మొబైల్ టవర్ కోసం 2 గ్రామాల వాసుల వినూత్న నిరసన
- చిక్కమగళూరు జిల్లాలో అభియాన

యశవంతపుర: ఇప్పుడు అందరూ ఆన్‌లైన్లో లావాదేవీలు చేయడం పరిపాటైంది. లావాదేవీల్లో ఓటీపీని ఎంటర్ చేశాకే పూర్తవుతుంది. కానీ తాము మొబైల్ టవర్లు– ఇంటర్నెట్ లేని కారణంగా ఓటీపీ వసతిని పొందలేకున్నామని చిక్కమగళూరు జిల్లా కళస తాలూకా బలిగె, మెణసిన హడ్య గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నందున ఓటుకు ముడిపెట్టారు.

హామీలపై నమ్మకం లేదు

నాయకులపై నమ్మకం వద్దు, వారిచ్చే హామీలు మాకొద్దు, మా గ్రామంలో మొబైల్ టవర్ కావాలని జనం డిమాండ్ చేస్తున్నారు. ఓటీపీ లేకుంటే– ఓటు లేదనే నినాదంతో ఆందోళన మొదలుపెట్టారు. ఈ నినాదంతో అంతటా బ్రోచర్లను అంటించడం ఆరంభమైంది. నక్సలైట్ల ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన పోలీసులు బలిగె, మెణసినహడ్య గ్రామాలకు మొబైల్ టవర్‌ను వేయలేదు.

నెట్ లేకుంటే ఎలా

టవర్లు వేయకుంటే, వచ్చే విధానసభ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించారు. 70 కుటుంబాలున్న గ్రామంలో 10 ఏళ్ల నుంచి మొబైల్ నెట్‌వర్క్ లేదు, ఫలితంగా ఇంటర్నెట్ కూడా అందని పండే అయ్యింది. ఈ డిజిటల్ యుగంలో ప్రభుత్వం సౌకర్యాలు కావాలన్నా మొబైల్, ఇంటర్నెట్ చాలా ముఖ్యమయ్యాయని గ్రామస్తులు తెలిపారు. కాగా, ఓటీపీ లేకుంటే ఓటు లేదనే అభియానతో ప్రజాప్రతినిధులలో చలనం కనపడుతోంది. ఆందోళనలను విరమించాలని గ్రామాల పెద్దలకు రాయబారాలు పంపారు. ఈ అభియాన సోషల్ మీడియాలో వైరల్‌గా మారి నెటిజన్లు గ్రామస్థులకు మద్దతుగా సందేశాలు పెడుతున్నారు.



ఓటీపీ రాకుంటే ఓటు లేదంటూ పోస్టర్లు

ఆదర్శనీయులు కేసీ రెడ్డి


- సౌధ ఆవరణలో రాష్ట్ర తొలి సీఎం విగ్రహావిష్కరణ

శివాజీనగర: రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి కేసీ రెడ్డి జన్మస్థలంలో స్మారకం నిర్మాణానికి సర్కారు సహకరిస్తుందని సీఎం బొమ్మై తెలిపారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే.సీ.రెడ్డి కంచు విగ్రహాన్ని శనివారం విధానసౌధ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ స్వాతంత్ర్య పోరాటకులు, ఆదర్శవంతులైన కే.సీ.రెడ్డి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆయన, న్యాయవాదిగా, పాత్రికేయునిగా పనిచేశారు. ముఖ్యమంత్రి, కేంద్రమంత్రిగానూ ఉన్నారు, ఆయన భవిష్యత్తులో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన చట్టాలు, యంత్రాంగాన్ని నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఆ మహనీయులు చూపించిన మార్గంలో మనం నడవాలని తెలిపారు. కర్ణాటకకు పునాది వేసిన నాయకుడిని జ్ఞాపకం చేసుకోవటానికి విధానసౌధలో విగ్రహం ఆవిష్కరించినట్లు తెలిపారు.



విగ్రహం వద్ద సీఎం బొమ్మై, కేసీ రెడ్డి కుటుంబీకులు

కునుకు పట్టనివ్వని భూప్రకంపనలు



విజయపుర జిల్లాలో తరచూ భూ ప్రకంపనలు

- విజయపుర జిల్లాలో కలకలం

సాక్షి, బళ్లారి: విజయపుర (బిజాపుర) జిల్లాలో పదే పదే భూ ప్రకంపనలు సంభవిస్తుండటంతో జనం భయం గుప్పిట్లో పట్టుకుని జీవిస్తున్నారు. శుక్రవారం రాత్రి విజయపుర జిల్లాలోని కళ్లకవటిగి, గొణసగి, బాబానగర, టక్కళికి, హుబనూరు, సోమదేవరహట్టి, మలకనదేవరహట్టి తదితర గ్రామాలు, పట్టణాల్లో భూమి కంపించింది. భూమిలో నుంచి పెద్ద శబ్దం కూడా వచ్చినట్లు తెలుస్తోంది.

జనం పరుగులు

నిద్రలో ఉన్నప్పటికీ మెలకువ రావడంతో జనం ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. భయంతో రాత్రంతా నిద్ర లేకుండా గడిపారు. భూ ప్రకంపనలకు ముందు కుక్కలు మొరిగాయని కొందరు తెలిపారు. కొన్ని క్షణాల్లోనే తమ ఇళ్లు కంపించాయని, సామానులు దొర్లిపడ్డాయని చెప్పారు. దీంతో విలువైన వస్తువులను తీసుకుని ఇళ్లను ఖాళీ చేసి పరుగులు తీశారు. విజయపుర జిల్లాలో భూమి కంపించడం ఇదేమి మొదటిసారి కాదని, పదే పదే భూమి కంపిస్తుండటంతో ప్రభుత్వం అధ్యయనం చేయించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. కాగా, జిల్లాలో ఈ నెలలోనే రెండుసార్లు భూమి కంపించింది.



భూకంపం భయంతో రాత్రంతా జాగారం (ఫైల్)

ఉపకారానికి పోతే

- కుక్కలకు ఆహారం పెడుతోందని..
- మహిళా టెక్కీపై దుండగుల దాడి
- నగర శివార్లలో సంఘటన

బనశంకరి: పుణ్యానికి పోతే పాపం ఎదురైనట్లు జంతు ప్రేమికురాలికి దౌర్జన్యం ఎదురైంది. వీధి కుక్కలకు తిండి పెడుతోందని మహిళా టెక్కీ పై ఇద్దరు దాడికి పాల్పడిన బెంగళూరు ఆనేకల్ తాలూకా జిగణిలో చోటుచేసుకుంది. బృందావన లేఔట్‌లో గల వరుణ్ అపార్టుమెంట్ నివాసి మీరా తివారి బాధితురాలు. జిగణిలోని బృందావన లేఔట్‌లో వీధి కుక్కలు ఉన్నాయి. మహిళా టెక్కీ మీరా తివారి సొంత ఖర్చుతో వీధికుక్కలకు తిండి పెట్టేవారు. దీనిపై కొందరు ముందు నుంచి గుర్రుగా ఉన్నారు.

కోడిగుడ్లు తేవడానికి వెళ్లగా

మీరా తివారి కోడిగుడ్లు తీసుకురావడానికి సమీపంలోని కిరాణా అంగడికి వెళ్లగా అనుసరిస్తూ వీధి కుక్కలు కూడా వెళ్లాయి. ఈ సమయంలో షెడ్‌లో కూర్చున్న ఇద్దరు వ్యక్తులు ఆమెతో గొడవకు దిగారు. కట్టెలతో దాడికి పాల్పడడంతో కేకలు వేయగా ఆమె తల్లి పరుగున రావడంతో దుండగులు ఉడాయించారు. తరువాత బాధితురాలు 112 నంబరుకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించింది.



బాధితురాలి ఆక్రోశం

పోలీసులు చేరుకుని మీరా తివారిని ఆసుపత్రికి తరలించారు. కుక్కలకు సాయం చేస్తోందని గత మూడేళ్లలో మీరాతివారిపై దాడికి పాల్పడటం ఇది రెండోసారి. పోలీసులు దుండగులను అరెస్ట్ చేయడానికి బదులు కట్టుకథలు చెబుతున్నారని మీరా తివారి ఆరోపించింది. నిమ్హాన్స్ ఆసుపత్రిలో చికిత్సపొందిన అనంతరం ఆమె బన్నేరుఘట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ వివాదం భాష రంగు పులుముకోవడం గమనార్హం. నేను కన్నడలో బాగా మాట్లాడానని, కానీ నేను నాన్ లోకల్ అని, అహంకారి అని దూషించారని ఆమె తెలిపింది. నేను బెంగళూరులో పుట్టి పెరిగానని, 2018 నుంచి లేఔట్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నానని పేర్కొంది. కేసు దర్యాప్తులో ఉందని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని, ఇద్దరి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.



అంబర్‌గ్రిస్ పట్టివేత



తుమకూరు: అంతర్జాతీయ స్థాయిలో అంబర్‌గ్రిస్ (తిమింగళం వాంతి) విక్రయానికి బాగా డిమాండ్ ఉంది. పరిమళ ద్రవ్యాల తయారీలో ఉపయోగిస్తారు. తిపటూరు తాలూకా కడెహళ్లి గ్రామానికి చెందిన విరుపాక్షిగౌడ అలియాస్ పక్షిగౌడ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు తిపటూరు ఏపీఎంసీ మార్కెట్‌లో సుమారు రూ. 15 లక్షల విలువ చేసే తిమింగళం వాంతిని విక్రయిస్తున్నాడు. కేరళ పోలీసులు మారువేషంలో అక్కడికి చేరుకుని విరూపాక్షి గౌడని అరెస్టు చేసి తీసుకెళ్లారు. ఇతడు ఒక మంత్రికి సన్నిహితుడని తెలుస్తోంది.



దొరికిన తిమింగళం వాంతి ముద్దలు

కారుపై పడ్డ కడ్డీలు

యశవంతపుర: నమ్మ మెట్రో రైలు మార్గం కింద మరో ప్రమాదం జరిగింది. శాండల్ సోప్ ఫ్యాక్టరీ మెట్రో స్టేషన్ కింద వెళ్తున్న కారుపై ఇనుప కడ్డీలు పడ్డాయి. దీంతో కారు బానెట్, అద్దాలు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ప్రాణహాని జరుగలేదు. కడ్డీలు పడి నష్టం జరగడంపై కారు యజమాని రితేశ్‌శెట్టి మండిపడ్డాడు. అవే కడ్డీలు పాదచారులు లేదా బైకర్ల మీద పడి ఉంటే ఎలా ఉండేదని ప్రశ్నించారు. మెట్రో అధికారుల నుంచి పరిహారాన్ని ఇప్పించాలని సుబ్రమణ్యనగర పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎస్ఐ హల్‌చల్‌పై జిల్లాస్పత్రి సిబ్బంది ధర్నా

తుమకూరు: అత్యవసర చికిత్స విభాగంలో పని చేస్తున్న వైద్యుడు, సిబ్బందిపై దాడి చేయడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించిన పోలీసు అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది జిల్లా పోలీసు ఎస్పీ అధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. విధులకు అడ్డుపడిన పోలీసు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన సురేశ్ అనే వ్యక్తిని అర్ధరాత్రి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి అత్యవసర చికిత్స విభాగంలోని వైద్యులు, సిబ్బంది అవసరమైన చికిత్స అందించారు. ఆలస్యం కాకుండా చికిత్స అందించినప్పటికీ మద్యం సేవించి వచ్చిన రామకృష్ణ సక్రమంగా చికిత్స చేయడం లేదని హల్‌చల్ చేశాడని, రెండు గంటల పాటు గందరగోళం సృష్టించాడని సిబ్బంది ఆరోపించారు. ఇతర రోగుల చికిత్సకు కూడా ఆటంకం కలిగించాడు. ఇలా అనుచితంగా ప్రవర్తించిన రామకృష్ణపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆందోళన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



శనివారం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో దివాలా తీసిన సిరివైభవ సహకార సొసైటీ బాధితుల ధర్నా. తమ డిపాజిట్లను చెల్లించాలని నినాదాలు చేశారు



సిలికాన్ సిటీలో లైవ్‌బ్యాండ్ నృత్య ప్రదర్శనలను నిలిపివేయాలని ఫ్రీడంపార్క్ వద్ద మహిళా సంఘాల ధర్నా. వీటి వల్ల నేరాలు పెరుగుతున్నాయని ఆరోపించారు

ఆందోళనలో ఆత్మహత్యాయత్నం

- రిటైర్డు ఉద్యోగి మృతి, మరొకరి పరిస్థితి విషమం

శివాజీనగర: ఎయిడెడ్ విద్యాలయాల ఉద్యోగుల డిమాండ్లు తీర్చాలని నగరంలో ఫ్రీడం పార్క్‌లో జరుగుతున్న ధర్నాలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సిద్దరామయ్య హిరేమఠ (67) అనే రిటైర్డు ఉద్యోగి విక్టోరియా ఆసుపత్రిలో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. బాగలకోట జిల్లా పట్టదకల్లుకు చెందిన సిద్దయ్య, స్థానిక ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసి రిటైరయ్యారు. ఆయనకు కుమారుడు, నలుగురు కుమార్తెలున్నారు. పింఛన్ వంచిత ధర్నాలో గురువారం ఆవేదనతో హిరేమఠ, వెంకటరాజు అనేవారు అందరి ముందు పురుగుల మందు తాగారు. వారిద్దరినీ పోలీసులు ఆసుపత్రిలో చేర్చగా, హిరేమఠ మృతిచెందాడు, వెంకటరాజు ఆరోగ్యం విషమంగా ఉంది.

పింఛన్ పెంచేది లేదన్న సీఎం

మరోవైపు 14 రోజుల నుంచి సాగుతున్న ధర్నాను విరమించారు. పింఛన్ ఇవ్వడానికి సాధ్యపడదని ముఖ్యమంత్రి నేరుగా చెప్పారు. ధర్నాను విడిచిపెట్టి స్థలం ఖాళీ చేయాలని పోలీసులు ఒత్తిడి చేయడంతో గత్యంతరం లేక విరమించామని సంఘం అధ్యక్షుడు జీ.హనుమంతప్ప మీడియాకు తెలిపారు.

ఉద్యోగం పేరుతో రూ.47 లక్షల స్వాహా

- ఇద్దరిపై బాధితుడు ఫిర్యాదు

బనశంకరి: అగ్నిమాపకశాఖ, రెవెన్యూ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.47 లక్షలు తీసుకుని వంచనకు పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వంచనపై కెంగేరి హరీశ్ అనే వ్యక్తి హెచ్ఆర్.వీరభద్ర, తేజస్ అనే వారిపై హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు.. హరీశ్‌కు స్నేహితుని ద్వారా వీరభద్ర పరిచయం కాగా ఇతను తేజస్‌ను పరిచయం చేసి ఇతడి ద్వారా ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. నిజమేనని నమ్మిన హరీశ్ తన బంధువులకు ఉద్యోగాలు కావాలని చెప్పాడు.

పై వాళ్లు బాగా తెలుసని..

ఫైర్ విభాగంలో అగ్నిమాపక అధికారి, అలాగే పరిపాలనాశాఖ డైరెక్టరేట్‌లో ఆర్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి, మాకు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు బాగా తెలుసు, డబ్బు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తామని మభ్యపెట్టారు.

వారి మాటలను పూర్తిగా నమ్మిన హరీశ్ దశలవారీగా రూ.47 లక్షలను అప్పగించాడు. కానీ ఎలాంటి ఉద్యోగం ఇప్పించకపోవడంతో పాటు పత్తా లేకుండా పోయారు. మోసపోయినట్లు గ్రహించి న్యాయం చేయాలని హైగ్రౌండ్ పోలీస్‌స్టేషన్‌లో హరీశ్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వంచకుల కోసం గాలింపు చేపట్టారు.



కాలయముడైన తమ్ముడు

- కత్తితో పొడిచి అక్క హత్య
- బెంగళూరులో దారుణం



యశవంతపుర: మనవరాలిని తన వెంట ఊరికి తీసుకెళ్లడానికి వచ్చిన అక్కను తమ్ముడు గొడవపడి హత్య చేశాడు. ఈ ఘటన బెంగళూరు కెంగేరి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. కేజీఎఫ్ కోరమంగల లేఔట్‌కు చెందిన ఏళల్ అరసి (48) పెద్ద కూతురును సింధూను కేజీఎఫ్ బెమెల్ నగరకు చెందిన సొంత తమ్ముడు దివాకర్ (29)కు ఇచ్చి పెళ్లి చేసింది. వీరికి ఒక కూతురు ఉంది. కుటుంబ కలహాలతో సింధూ భర్తకు దూరంగా అమ్మమ్మ వద్ద కోలారులో ఉంటోంది.



ఏళల్ అరసి (ఫైల్)

మరోవైపు భర్త దివాకర్ భార్య బిడ్డను తీసుకుని బెంగళూరులోని కెంగేరి నాగదేవనహళ్లి బృందావన లేఔట్‌లో తన చెల్లెలు ఇంటికి వెళ్లాడు. ఇది తెలిసి అతని అక్క ఏళల్ అరసి వచ్చి మనవరాలిని తమ వెంట పంపాలని తమ్ముడ్ని కోరింది. తాను పంపేది లేదనడంతో పెద్ద రగడ మొదలైంది. దివాకర్ కత్తితో అక్క గొంతుపై పొడిచి పరారయ్యాడు. అడ్డుకోవడానికి వెళ్లిన సింధూ కుడి చేతికి బలమైన గాయాలు తగిలాయి. అరసిని సమీపంలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కెంగేరి పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుని కోసం గాలింపు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

వివాహిత మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నందిని లేఔట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. జై మారుతీనగరకు చెందిన కావ్య (26)కు 8 ఏళ్ల క్రితం మైసూరుకు చెందిన వెంకటేశ్‌తో వివాహమైంది. అతడు బేల్దారి పనిచేసేవాడు. 9 రోజుల క్రితమే కొత్త ఇంట్లోకి బాడుగకు వచ్చారు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఏం జరిగిందోకానీ శనివారం ఉదయం కావ్య ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

చెన్నబసవేశ్వర రథోత్సవం



పాల్గొన్న ఎమ్మెల్యే, స్వామీజీ, భక్తులు

రాయచూరు రూరల్: తాలూకాలోని నారదగడ్డ చెన్నబసవేశ్వరుని జాతర వైభవంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం ఆలయం వద్ద ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ప్రత్యేక పూజలు జరిపి వేలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరుకు చేరిన మృతుల సంఖ్య

హుబ్లీ: ధార్వాడ తాలూకా తేగూరు వద్ద జాతీయ రహదారి-4లో లారీ, కారు మధ్య గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే 5 ఏళ్ల బిడ్డతో పాటు ఐదుగురు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా, అవరాదికి చెందిన మడివాళప్ప బసవరాజ్(23) శుక్రవారం మృతి చెందాడు. మిగతా వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు గరగ పోలీసులు తెలిపారు.

కృష్ణా వంతెనకు మరమ్మతులు



వంతెనపై తారు రోడ్డును వేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: కర్ణాటక-తెలంగాణ రాష్ట్రాల మధ్య జాతీయ రహదారి-167లో కృష్ణా నదిపై ఉన్న పాత వంతెన మరమ్మతు పనులు శనివారం చురుగ్గా సాగాయి. వంతెనపై చిన్న చిన్న గోతులను పూడ్చి తారు రోడ్డును వేస్తున్నారు. పనులను సత్వరం పూర్తి చేసి యథావిధిగా వాహన రాకపోకల పునరుద్ధరణకు అధికారులు ముమ్మరంగా శ్రమిస్తున్నారు.

రూ.5.56 లక్షల నగదు చోరీ

హుబ్లీ: పాతహుబ్లీలోని సిమ్లానగర్ శకుంతల అనే మహిళ ఇంటి తలుపునకు ఉన్న తాళాన్ని పగులగొట్టి దొంగలు రూ.5.56 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి రూ.4.92 లక్షలు విలువ చేసే 123 గ్రాముల బంగారం, రూ.44 వేల విలువ చేసే 11 గ్రాముల వెండి, రూ.17 వేల విలువ చేసే వజ్ర ముత్యాలు, రూ.10 వేల నగదు చోరీ చేసి పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆప్‌లో కార్యకర్తల చేరిక

రాయచూరు రూరల్: తాలూకాలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి అవకాశమివ్వాలని గ్రామీణ అభ్యర్థి సుభాష్ చంద్ర సంబాజీ పేర్కొన్నారు. శనివారం దేవసూగూరు ఆలయం వద్ద వందలాది మంది కార్యకర్తలు బీజేపీ, జేడీఎస్, కాంగ్రెస్ పార్టీలను వీడి తన సమక్షంలో ఆప్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు పార్టీలో చేరారన్నారు.

హంపీలో స్మారకంపై పర్యాటకుడి చిందులు



హొసపేటె: హంపీలో శ్రీవిరుపాక్షేశ్వర దేవస్థానం సమీపంలోని హేమకూట స్మారకంపై ఓ పర్యాటకుడు నృత్యం చేయడంపై సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల హంపీ పురందరదాస మంటపం లోపల విదేశీ పర్యాటకులు మద్యం తాగిన ఘటన మరువక ముందే శనివారం హంపీని వీక్షించేందుకు వచ్చిన ఓ పర్యాటకుడు టిక్‌టాక్ చేయడం కోసం ఏకంగా హేమకూట స్మారకం మీదనే నృత్యం చేయడం కలకలం రేపింది. ఈ విషయంపై జిల్లాధికారి టీ.వెంకటేష్ మాట్లాడుతూ హంపీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగకుండా భద్రతను పటిష్టం చేస్తామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు రేవణ్ణసిద్దప్ప

హొసపేటె: మానసిక వ్యాధితో పాటు ఇటీవల కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన విజయనగర జిల్లా కొట్టూరులో జరిగింది. వివరాలు.. దావణగెరె జిల్లా హరిహర తాలూకాకు చెందిన రేవణ సిద్దప్ప తమ కుటుంబ సభ్యులతో కలిసి కొట్టూరు తాలూకా తూలహళ్లిలో రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చారు. ఏమైందో తెలియదు కానీ శుక్రవారం రాత్రి రేవణ్ణసిద్దప్ప(40) తూలహళ్లి గ్రామ శివార్లలోని వేపచెట్టుకు ఉరి వేసుకొన్నాడు. రేవణసిద్దప్ప గత రెండేళ్ల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. ఇటీవల కడుపునొప్పి కూడా రావడంతో వైద్యులకు చూపించినా నయం కాక పోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ ఘటనపై కేసు దర్యాప్తులో ఉందని కొట్టూరు పోలీసులు తెలిపారు.

రోడ్డు సొగసు చూడతరమా?

- అడుగడుగునా కంకర తేలి గుంతలు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



గోతులు పడి దుస్థితికి చేరిన రహదారిలో సంచరిస్తున్న భారీ వాహనాలు

సాక్షి,బళ్లారి: పేరు గొప్ప ఊరు దిబ్బ అంటే ఇదేనేమో. జిల్లాలోని దేశంలోనే పేరుగాంచిన జిందాల్ స్టీల్ ఫ్యాక్టరీ, కుడితినిలోని బళ్లారి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు, ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీలకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. జిల్లా అభివృద్ధికి వేల కోట్లు నిధులు వస్తున్నా రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

యథేచ్ఛగా భారీ వాహన రాకపోకలు..

కుడితిని నుంచి కంప్లికి వెళ్లే రహదారిలో భారీ వాహనాల రాకపోకలు పెద్ద సంఖ్యలో జరుగుతుంటాయి. ఆయా ప్రైవేటు కంపెనీలకు తమ వ్యాపారాల రీత్యా భారీ వాహనాలు తిరుగుతుండడంతో రోడ్డుకు కనీసం సొంత నిధులతో ప్యాచ్ వర్క్ కూడా చేయకపోవడంతో దరోజీ, హొసదరోజీ, తిమ్మలాపుర తదితర గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు, చుట్టుపక్కల ఉన్న ఫ్యాక్టరీల యజమానులు రోడ్డును బాగు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాపై తప్పుడు కుల దూషణ ఫిర్యాదు

- కార్పొరేటర్ రామాంజనేయులు

బళ్లారిటౌన్: ఆంధ్రాళ్‌లోని శ్మశాన స్థల విషయంలో తనపైన, తన మద్దతుదారుల పైన మాజీ కార్పొరేటర్ సీతారాం తప్పుడు కుల దూషణ ఫిర్యాదు చేశారని 8వ వార్డు కార్పొరేటర్ రామాంజనేయులు ఆరోపించారు. శనివారం పత్రికాభవనంలో పాలికె సభ్యులు ప్రభంజన్‌కుమార్, ముల్లంగి నందీష్, గాదెప్ప, పార్టీ నేతలు గుర్రం వెంకటరమణ తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 8వ వార్డులోని డీసీ కాలనీ పక్కన గల సర్వే-101లో 2 ఎకరాల భూమిని జిల్లా పాలన, శ్మశానం కోసం 1999లో మంజూరు చేసిందన్నారు. అయితే 2018లో సబ్ డివిజన్ జరిగిందని, ఈ స్థలాన్ని మాజీ కార్పొరేటర్ సీతారాం, పలువురు స్థానికులు సైట్లుగా చేసేందుకు సన్నద్ధం అయ్యారన్నారు. ఈ శ్మశానానికి కాంపౌండ్‌ను నిర్మించేందుకు పాలికె రూ.14 లక్షలను మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించేందుకు వెళ్లగా సీతారాం, ఆయన మద్దతుదారులు పనులకు అడ్డుపడ్డారన్నారు. దీంతో తాము ప్రశ్నించినందుకే తమపై కుల దూషణ ఫిర్యాదును దాఖలు చేశారని, పోలీసులు కూడా వారికే మద్దతిస్తూ తమ ఫిర్యాదుపై స్పందించడం లేదని ఆయన వాపోయారు.

రహదారి పనులు వెంటనే చేపట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప: తాలూకాలోని 64-హాశేకోట దగ్గర మారెమ్మ గుడి వద్ద నుంచి దడేసూగూరు దగ్గర గద్యాళ మారెమ్మ దేవస్థానం వరకు నిధులు మంజూరైన ఎన్.హెచ్-150ఏ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే సోమలింగప్ప డిమాండ్ చేశారు. ఆయన శనివారం నగరంలోని అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. చామరాజనగర్ నుంచి జేవర్గి వరకు నాలుగు లైన్ల రోడ్డును ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి నిధులు కూడా విడుదల చేసిందన్నారు. 13 నెలల్లోగా రోడ్డు పనులు పూర్తి కావాల్సి ఉన్నా సదరు కాంట్రాక్టర్ కొంచెం పనులు మొదలు పెట్టి ఒక వైపు రోడ్డును తవ్వేసి అర్థంతరంగా నిలిపివేయడం శోచనీయమన్నారు. దీని వల్ల వాహనదారులకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. అర్థంతరంగా ఆగిన పనులతో దుమ్ము, ధూళి చెలరేగి ప్రజానీకానికి ఆయాసం, దగ్గు వివిధ వ్యాధులు సోకుతున్నాయన్నారు. పైగా ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయన్నారు. ఈ అంశాలన్నింటి దృష్ట్యా రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరుతున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు మేకల వీరేశ్, మహాదేవ, సుకువాయి మల్లికార్జున, భూన్యాయ మండలి సభ్యులు హెచ్.బి.గంగప్ప, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్ తదితరులు

కంప్లి: దేవసముద్ర గ్రామంలో శనివారం రూ.4.50 కోట్ల ఖర్చుతో వాగుపై రోడ్డు వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంప్లి, కురుగోడుల్లో మినీ విధానసౌధ, వంద పడకల ఆస్పత్రులు, పీయూ కళాశాల సౌకర్యాన్ని కల్పించామన్నారు. త్వరలో తన అవధిలో జరిగిన క్షేత్ర అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేస్తానన్నారు. పీడీఓ సావిత్రి గౌరోజీ, జీపీ సభ్యులు నాయకర వెంకోబ, మౌనేష్, ప్రముఖులు కరెప్ప, కే.షణ్ముఖప్ప, తళవార నాగప్ప, దొడ్డనాయక, విరుపణ్ణ, కోలి చెన్నబసవ గుజ్జల హన్మంతప్ప, పీ.పంపణ్ణ, సూగూరు శేఖరప్ప, శివకుమార్, కెరెకెరె అంజినప్ప పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా జాగృతి

హుబ్లీ: వ్యసనరహిత సమాజాన్ని నిర్మించే ఉద్దేశంతో నగరంలో హుబ్లీ-ధార్వాడ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో విద్యానగర బీవీబీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించిన భారీ వాకథాన్‌ను పోలీస్ కమిషనర్ రమణగుప్తా ప్రారంభించారు. నగర ప్రముఖ వీధుల్లో మాదక వస్తువుల సేవనం, వివిధ అపరాధాలతో కలిగే దుష్పరిణామాల గురించి నడక ద్వారా జాగృతి కల్పించారు. పోలీస్ కమిషనరేట్, హుబ్లీ వెస్ట్ రోటరీ సంస్థ, ఎంస్కాయర్ సంస్థ తదితర సంఘ సంస్థల సహకారంతో జరిగిన ఈ వాకథాన్‌లో 500ల మందికి పైగా స్కూల్ విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ రమణ గుప్తా మాట్లాడుతూ యువత మాదక వ్యసనులు కాకుండా జాగృతి పెంపొందించాలన్నారు. వీటి వల్ల క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకుతున్నాయన్నారు. ప్రభుత్వం, సంఘ సంస్థలు, ప్రజలు కలిసి వీటిపై సమరం చేయాలన్నారు. దేశంలో మాదక వస్తువులపై నిషేధం ఉన్నా అడ్డదారుల్లో వీటిని సరఫరా చేస్తూ విక్రయిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రమణగుప్తా డీజే పాటకు అనుగుణంగా నృత్యం చేసి అలరించారు.

కట్నం కాటుకు మహిళ ఆత్మహత్య

- బంధువుల ఆందోళన



భర్త విఘ్నేశ్‌తో సౌందర్య (ఫైల్)

కృష్ణరాజపురం: నగరంలో వరకట్న వేధింపులను తాళలేక శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు సౌందర్య అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నాలుగేళ్ల క్రితం సౌందర్య (24)కు మెజెస్టిక్ వద్ద లక్ష్మణ్‌పురికి చెందిన విఘ్నేశ్‌తో వివాహం జరిగింది. వీరికి పిల్లలు కలగలేదు. అలాగే మరింత కట్నం తేవాలని భర్త, కుటుంబసభ్యులు ఆమెను వేధించేవారు. ఈ క్రమంలో శుక్రవారం కూడా పెద్ద గొడవ జరిగింది. విఘ్నేశ్ కుటుంబ సభ్యులంతా కలసి ఆమెను కొట్టడంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. భర్త విఘ్నేశ్, అత్త ఇర్పమ్మ, బంధువులు యశిల్‌విమల, రేవతి, శివు వేధించారని సౌందర్య బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై శేషాద్రిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఆమె మరణానికి కారణమైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, లేకుంటే మృతదేహాన్ని తీసుకెళ్లబోమని కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. ప్రస్తుతం బౌరింగ్ ఆస్పత్రి మార్చురీలో సౌందర్య మృతదేహం ఉంది.

ఘనంగా దుర్గామాత కుంభోత్సవం

- ముగిసిన అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన వేడుకలు



అమ్మవార్లను అలంకరించిన దృశ్యం

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది కిష్కింధా క్షేత్రం మేగోటె దుర్గామాత ఆలయంలో ఘనంగా దుర్గామాత ప్రాణ ప్రతిష్టాపన జరిగింది. ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం ఆనెగుంది గ్రామ చింతామణి సమీపంలో తుంగభద్ర నది నుంచి 108 కుంభాలతో గంగమ్మను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకాన్ని దుర్గామాత మానస పుత్ర, దాసోహ రత్న బ్రహ్మానంద స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ధార్మిక వేడుకల్లో రాజవంశస్తులు లలితారాణి శ్రీరంగదేవరాయలు, రాజా కృష్ణదేవరాయల కుటుంబీకులు, కలబురగి వేద పాఠశాల పరిమళ ఆచార్య బృందం, వాజేంద్ర ఆచారి, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షులు రాఘవేంద్ర శెట్టి, మేనేజర్ రాజన్న స్వామి, జీపీ అధ్యక్షులు, సభ్యులతో పాటు ఆనెగుంది, చిక్కరాంపుర, హనుమనహళ్లి, బసవనదుర్గ గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్సిటీలో విద్యార్థి అనుమానాస్పద మృతి

శివాజీనగర: నగరంలో అజీం ప్రేమ్ జీ విశ్వవిద్యాలయంలో అభిషేక్ షిండే (26) అనే విద్యార్థి అనుమానాస్పద రీతిలో చనిపోయాడు. శుక్రవారం సాయంత్రం మృతిచెందినట్లు తెలిసింది. మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన ఇతడు వర్సిటీలో ఎంఏ ఫస్టియర్ విద్యార్థి. వర్సిటీలో నెలకొన్న సమస్యలను తీర్చాలని పదకొండు రోజుల నుంచి విద్యార్థులు ధర్నా చేస్తున్నట్లు తెలిసింది. అటు విద్యార్థులు, ఇటు పాలకమండలి మధ్య పరిష్కారం ఖరారు కాలేదని తెలిసింది. ఈ దీక్షలో పాల్గొని మరణించాడని సమాచారం. పాలక మండలి వాదన మరోలా ఉంది. ఆయన నిరహారదీక్ష సమయంలో మృతి చెందలేదని, కాలేజీ వార్షికోత్సవాల్లో నృత్యం చేస్తూ గుండెపోటు వచ్చి చనిపోయాడని పేర్కొంది.

నంజుండేశ్వర హుండీల లెక్కింపు

మైసూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన నంజనగూడులోని నంజుండేశ్వర దేవాయలంలో హుండీ కానుకలను లెక్కించారు. ఒక నెలలో అత్యధికంగా భక్తులు రూ. 1.26 కోట్లను స్వామివారికి సమర్పించారు. దేవస్థానంలోని 33 హుండీల్లోని నగదు, నగలను ఆలయ సిబ్బంది గణించారు. మొత్తం రూ. 1,26,65,782 నగదు, 50 గ్రాముల బంగారం, మూడున్నర కేజీల వెండి, 9 విదేశీ కరెన్సీలు, 163 అమెరికా డాలర్లు, 20 హాంకాంగ్ డాలర్‌లు లభించాయి.

బీచ్‌లో డాల్ఫిన్ కళేబరం



ఒడ్డుకు కొట్టుకొచ్చిన డాల్ఫిన్ చేప కళేబరం

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా మంగళూరు సమీపంలోని తణ్ణీరు బావి బీచ్‌లోకి ఓ డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పెద్ద అలలకు మృత డాల్ఫిన్ ఒడ్డున పడింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు దానిని బయటకు తెచ్చారు. పణంబూరు పోలీసులు, తీర ప్రాంత గార్డ్స్, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దానికి అక్కడే పోస్టుమార్టం చేసి ఇసుకలో లోతైన గుంత తీసి పూడ్చిపెట్టారు.

ఎస్పీగా బాధ్యతల స్వీకారం



బాధ్యతలను స్వీకరిస్తున్న నూతన ఎస్పీ యశోద

గంగావతి రూరల్: కొప్పళ జిల్లా నూతన ఎస్పీగా యశోద వంటగోడి శనివారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. బదిలీపై వెళుతున్న అరుణాంగ్షు గిరి నూతన ఎస్పీ యశోదకు బాధ్యతలు అప్పగించారు. బాగలకోటె జిల్లాకు చెందిన యశోద గతంలో డీఎస్పీగా దక్షిణ కన్నడ జిల్లాలోని కుందాపుర, ఏసీపీగా హుబ్లీ, దావణగెరెలో, ఏఎస్పీగా బెళగావిలో సేవలు అందించారు. ప్రస్తుతం కొప్పళ జిల్లా ఎస్పీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీలు శరణబసప్ప సుబేదార్, శేఖరప్ప నింగప్ప, ఇన్‌స్పెక్టర్లు సంతోష్ హళ్లూర, సురేష్, నింగప్ప, మంజునాథ, అడివేశ, మహంతేశ సజ్జన్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి విశేష కృషి

రాయచూరు రూరల్ : నగరాభివృద్ధికి శాయశక్తులా కృషి చేసినట్లు ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. ఆయన శనివారం జహీరాబాద్ మరిగమ్మ ఆలయం వద్ద తనకు ఏర్పాటు చేసిన అభినందన సభలో మాట్లాడారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎన్.శంకరప్ప, నగరసభ అధ్యక్షురాలు లలిత, ఆర్డీఏ అధ్యక్షుడు తిమ్మప్ప నాడగౌడ, మాజీ అధ్యక్షుడు గోపాలరెడ్డి, నగర బీజేపీ అధ్యక్షుడు గోవిందు, ఉమా, రవీంద్ర తదితరులున్నారు.

కోలారు వార్తలు...

జయంతులను సక్రమంగా నిర్వహించండి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ అమరేష్

కోలారు : మహనీయులైన కాయక శరణ, రేణుకాచార్య, యోగినారాయణ జయంతులను సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ హెచ్.అమరేష్ సూచించారు. ఆయన శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జయంతుల నిర్వహణపై సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అన్ని సముదాయాలు కలిసి మహనీయుల జయంతులను నిర్వహించాలని సలహా ఇచ్చారు. మార్చి 1న కాయక శరణ జయంతి, 7న యోగినారాయణ జయంతి, 16న రేణుకాచార్య జయంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కన్నడ, సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, స్వామీజీలు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరించి మళ్లీ ఓటడుగుతా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు : తాలూకాలో గత నాలుగున్నరేళ్ల అవధిలో తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలిపి ఓట్లు అడుగుతానని ఎమ్మెల్యే కే వై నంజేగౌడ తెలిపారు. పట్టణంలోని మారికాంబ ఆలయంలో బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలను నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సమాజంలోని అన్ని సముదాయాలను కలుపుకుని పోతుందన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలకు సేవలను అందిస్తోందన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా జెడీఎస్ మాజీ అధ్యక్షురాలు రత్నమ్మ నంజేగౌడ, మాజీ సభ్యుడు హనుమంతప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం జీ మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

కారు పల్టీలు కొట్టి బైకిస్టుకు ఢీ

- ఘటనాస్థలంలోనే వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజు

మడకశిర (అగళి): అగళి మండలంలోని హుల్లేకెర వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుమకూరు రాష్ట్రం మధుగిరి తాలూకా కెంపచెన్నసహళ్లికి చెందిన రాజు (30)అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాలు.. అగళి మండలం మధూడి గ్రామానికి చెందిన ఓ పూల వ్యాపారి శిర వైపు నుంచి వస్తున్నప్పుడు కారు ముందు చక్రం పంక్చర్ కావడంతో అదుపు తప్పి పల్టీలు కొట్టింది. అదే సమయంలో అగళి వైపు నుంచి వస్తున్న మోటార్ బైక్‌ను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బైకిస్టు రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు పట్టనాయకనహళ్లి సమీపంలోని తన అక్క ఊరికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. మృతునికి భార్యతో పాటు రెండేళ్ల పాప ఉంది. స్థానిక ఎస్ఐ లావణ్య ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

స్వాహాపరులు వృద్ధిలోకి రాలేరు

మాలూరు : ప్రజా సంక్షేమానికి అందిస్తున్న ప్రభుత్వ నిధులను కాజేసే ప్రజాప్రతినిధులు ఎన్నటికీ అభివృద్ధి చెందరని మాజీ ఎమ్మెల్యే కెఎస్ మంజునాథ్‌గౌడ తెలిపారు. శుక్రవారం రాత్రి తాలూకాలోని చూడగొండనహళ్లిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి ఎవరు వచ్చినా సేవాదృక్పథంతోనే రావాలన్నారు. ప్రజల మద్దతు ఉన్న వారికి మాత్రమే పార్టీ టికెట్ ఇస్తుందని, తనకు మాలూరు ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఎస్ ఎన్ రఘునాథ్, అగ్రి నారాయణప్ప, జెడీఎస్ మాజీ సభ్యుడు చిన్నస్వామి గౌడ, పీఎల్‌డీ బ్యాంకు సభ్యుడు బెళ్లావి సోమణ్ణ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకార లబ్ధి పొందండి

శ్రీనివాసపురం: ప్రభుత్వం పాఠశాలల్లో అందిస్తున్న పలు సౌకర్యాలకు తోడు దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు టీవీ భైరారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని రంగా రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే కేఆర్ రమేష్‌కుమార్ అభిమానులు ఇటీవల మరణించిన ఎమ్మెల్యే భార్య విజయమ్మ స్మరణార్థం ఏర్పాటు చేసిన లేఖన సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థిని ఎస్‌వీ మాలాశ్రీ, ఉపాధ్యాయులు ఆదిలక్ష్మమ్మ, హరీష్ కుమార్, అమర్‌నాథ్, శ్రీనివాస్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్లు తదితరులు

బళ్లారిఅర్బన్: నగరంలోని 21వ వార్డు సంగమేశ్వర దేవస్థానం వద్ద సీసీ రోడ్డు పనులకు ఆ వార్డు కార్పొరేటర్ సురేఖ మల్లనగౌడ శనివారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మోత్కర్ శ్రీనివాస్, పార్టీ ప్రముఖులు సురేంద్ర వేమన, కేదార్‌నాథ్, శివారెడ్డి, సురేష్, డాక్టర్ మహిపాల్, సోమలింగనగౌడ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులకు విముక్తి

రాయచూరు రూరల్ : వ్యవసాయ పనుల కోసం వాహనంలో తరలిస్తున్న 14 మంది బాలకార్మికులను రక్షించడంతో పాటు నలుగురిపై అధికారులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శనివారం జిల్లాలోని సిరవార తాలూకాలో బాలకార్మిక శాఖ అధికారులు దాడులు చేసి వారిని రక్షించారు. బాలకార్మికులను తరలిస్తున్న వారిపై చర్యలు చేపడుతామన్నారు. దాడుల్లో బాల కార్మిక అధికారి హొన్నప్ప, మంజునాథరెడ్డి, వెంకటేశ్వర రావు, రవికుమార్, శివరాజ్‌ల బృందం పాల్గొంది.

విద్యా సంస్థల నిర్వహణ సులభం కాదు

కంప్లి: విద్యాసంస్థలు స్థాపించడం సులభమే అయినా నిర్వహణ అంత సులభం కాదని ఎమ్మెల్యే గణేష్ అభిప్రాయపడ్డారు. ఆయన శుక్రవారం సాయంత్రం కురుగోడు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థ విద్యావసతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఏర్పాటు చేసిన రజత మహోత్సవం, ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవం, పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాల కల్పనతో పాటు ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంలో సంస్థ కార్యదర్శి ఏఎస్ చక్రవర్తి సాధన శ్లాఘనీయం అన్నారు. అనంతరం సంస్థ కార్యదర్శి ఏఎస్ చక్రవర్తి, బీఈఓ వెంకటేష్ రామచంద్రప్ప, విద్యాసంస్థ అధ్యక్షులు చానాళ్ ఆనంద్, బాలాజి విద్యాసంస్థ కార్యదర్శి బీ.శ్రీనివాసులు, విద్యావసతి ప్రిన్సిపల్ టీబీ దేశాయి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా పట్టదా?

రాయచూరు రూరల్: నగరంలో నిరంతర తాగునీటి పథకం నీరు వృథా అవుతోందని జేడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనగౌడ ఆరోపించారు. ఆయన శనివారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు .రూ.117 కోట్లు వెచ్చించి నిరంతరం తాగునీటిని అందించడానికి చేపట్టిన ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ అదృశ్యమయ్యారన్నారు. పనులు కాకుండానే నిధులను దుర్వినియోగం చేసినా ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ నోరు మెదపడం లేదన్నారు. గతంలో వేసిన పైపులు తుక్కు పట్టాయన్నారు. ఐదేళ్లు గడిచినా పథకం పనులు పూర్తి కాలేదన్నారు. తాగునీటి పథకం పేరుతో ప్రజలను మోసం చేసిన వారిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామన్నారు.

చెరువులో ఆక్రమణల తొలగింపు

కేజీఎఫ్ : తాలూకాలోని క్యాసంబళ్లి ఫిర్కా పీలవార గ్రామంలోని సర్వే నెంబర్-229లోని చెరువు భాగంలో ఆక్రమణలకు గురైన ప్రాంతాన్ని సర్వే చేసిన అనంతరం రెవిన్యూ శాఖ అధికారులు తొలగించారు. చెరువులో ఆక్రమణలకు గురైన 10.22 ఎకరాలను సర్వే చేసి స్వాధీనపర్చుకోవాలని రైతు సంఘం పదాధికారులు తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో శనివారం అధికారులు చెరువు ప్రాంగణానికి చేరుకుని పరిశీలించి ఆక్రమణకు గురైన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ పంపిణీ



ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను అందించిన దృశ్యం

శ్రీనివాసపురం : తాలూకాలోని రోణూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శనివారం దాత ఎల్‌వీ గోవిందప్ప ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల అవసరం ఎక్కువగా ఉన్నందున అందించినట్లు తెలిపారు. పేదలకు ఆస్పత్రిలో ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎంసీ విజయ, డాక్టర్ ఉమాభారతి తదితరులు ఉన్నారు.

రాజకాలువ ఆక్రమణలపై సర్వే



ఆక్రమిత స్థలంలో సర్వే చేస్తున్న తహసీల్దార్ దయానంద్

కేజీఎఫ్ : పట్టణంలోని సింధు నగర కాలనీలో రాజకాలువ ఆక్రమణలపై మస్కంకు చెందిన కోదండరాం అనే వ్యక్తి తహసీల్దార్ దయానంద్‌కు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ తమ సిబ్బందితో కలిసి రాజకాలువ వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాజకాలువ ఆక్రమణపై ఫిర్యాదు రావడంతో స్థలానికి వచ్చి పరిశీలించామన్నారు. ఈ ప్రాంతాన్ని నగరాభివృద్ధి ప్రాధికార నుంచి ప్రజల ఉద్యానవనం కోసం రిజర్వ్ చేశారన్నారు. సర్వే అధికారి మౌలాఖాన్, రెవిన్యూ అధికారి రఘురామసింగ్, గ్రామ అధికారి రమేష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి పరిహారం అందజేత

దొడ్డబళ్లాపురం: కనకపుర తాలూకా కాడుశివనదొడ్డిహళ్లి గ్రామంలో అడవిదున్న దాడిలో మృతి చెందిన మేకలకాపరి నాగానాయక్ కుటుంబానికి ఆర్‌ఎఫ్‌ఓ దేవరాజు శనివారం రూ.50వేల చెక్కు అందజేశారు. సంగమ పరిసర అభివృద్ధి కమిటీ తరఫున పరిహారం అందజేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు, ఇతర దాఖలాలు ప్రభుత్వానికి సమర్పిస్తే ప్రభుత్వం మరింత పరిహారం అందజేస్తుందని తెలిపారు.

జంట హత్యల పాపం పోలీసులు, రాజకీయ నాయకులదే

దొడ్డబళ్లాపురం: దొడ్డబెళవంగల పట్టణంలో జంట హత్యల పాపం పోలీసులు, రాజకీయ నాయకులదేనని దళిత విమోచనా సేన రాష్ట్ర అధ్యక్షుడు మా.మునిరాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లలో ఎన్నికల్లో ఎంతో మంది పోటీ చేశారని, ఏనాడూ రాజకీయ కారణాలతో హత్యలు జరగలేదన్నారు. జంట హత్యలు జరగడానికి ముందు పోలీసులు అప్రమత్తంగా ఉండి ఉంటే పరిస్థితి ఇంతవరకూ వచ్చేది కాదన్నారు.

మార్చి 1న మధురె శనీశ్వరస్వామి రథోత్సవం



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

దొడ్డబళ్లాపురం: తాలూకాలోని ప్రసిద్ధిచెందిన మధురె శనీశ్వరస్వామి ఆలయంలో మార్చి1న బ్రహ్మరథోత్సవం జరగనుందని ఆలయ ధర్మాధికారి కేవీ సత్యప్రకాశ్ తెలిపారు. ఈమేరకు శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈనెల 28నుంచి మార్చి 7వరకు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక, నాటక ప్రదర్శనలు జరుగుతాయని ఆయన తెలిపారు. మార్చి1న మధ్యాహ్నం 1-35 నుంచి 2-15 గంటల మధ్య మిథున లగ్నంలో రథోత్సవం జరుపుతామన్నారు. ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మేకలను చంపిన చిరుత

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలో చిరుతల బెడద అధికమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒకచోట చిరుత దాడికి మూగజీవాలు బలవుతున్నాయి. దీంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. శనివారం తెల్లవారుజామున దొడ్డ తాలూకా కోళూరు గ్రామంలోకి ప్రవేశించిన చిరుత.. రైతు నారాయణప్పకు చెందిన నాలుగు మేకలను హతమార్చింది. అటవీశాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండాలని, త్వరగా చిరుతను బంధిస్తామని హామీ ఇచ్చారు.

పే ఎమ్మెల్యే నినాదంతో పోస్టర్లు



తుమకూరు: పే ఎమ్మెల్యే నినాదంతో తుమకూరు నగర బీజేపీ ఎమ్మెల్యే జ్యోతిగణేశ్‌కు వ్యతిరేకంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోస్టర్లు అంటించారు. మీకు పని జరగాలంటే నాకు డబ్బు చెల్లించండి అనే నినాదంతో పోస్టర్లు అంటించారు. తుమకూరు స్మార్ట్ సిటీ పనులతో పాటు వివిధ అభివృద్ధి పనుల్లో అవినీతి, పర్సంటేజీలను ఎమ్మెల్యే తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది.

సిగరెట్ స్మోకర్‌ను బెదిరించి దోపిడీ

కృష్ణరాజపురం: కారులో సిగరెట్ తాగుతున్న వ్యక్తిని దుండగుడు బెదిరించి నగదు, నగలు దోచుకొని ఉడాయించాడు. ఈ ఘటన కేఆర్ పురం-బెన్నిగానహళ్లి అండర్‌పాస్ వద్ద జరిగింది. నాగవారపాళ్యకు చెందిన ధనుంజయ్ తన కారులో తన ఆఫీసుకు వెళుతూ సిగరెట్ తాగుతున్నాడు. కేఆర్ పురం-బెన్నిగానహళ్లి అండర్‌పాస్ వద్దకు చేరుకోగానే స్కూటర్‌లో వచ్చిన వ్యక్తి కారును అడ్డుకున్నాడు. సిగరెట్ తాగితే పోలీసులు అరెస్టు చేస్తారని బెదిరించాడు. డబ్బు ఇవ్వాలని, లేదంటే పోలీసులకు పట్టిస్తానని భయపెట్టాడు. అనంతరం ధనుంజయ నాయర్ క్రెడిట్ కార్డు నుంచి రూ.50 వేలు, డెబిట్ కార్డు నుంచి రూ.45 వేలు, ఇంకా 30 గ్రాముల రెండు బంగారు గొలుసులను నిందితుడు దోచుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రామ్మూర్తి నగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక ఆందోళన

శివమొగ్గ: ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చని పక్షంలో మార్చి 1 నుంచి నిరవధిక ఆందోళన చేపడుతామని సంఘం రాష్ట్రాధ్యక్షుడు సీఎస్ షడాక్షరి వెల్లడించారు. శివమొగ్గలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల ప్రస్తావనే లేదన్నారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేందుకు ఎంతో కష్టపడి పని చేసే ఉద్యోగులను ప్రభుత్వం సరిగా చూడడం లేదన్నారు. ఏడో వేతన సవరణ సిఫారసుల మేరకు భత్యం, వేతనాలు పెంచాలని, 40 శాతం ఫిట్‌మెంట్‌ను జులై 1 నుంచి అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్లను పరిష్కరించకపోతే నిరవధిక ఆందోళన చేపడుతామని ఈనెల 22న నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. సీఎం సానుకూలంగా స్పందించకుంటే ఆందోళన తప్ప వేరే మార్గం లేదన్నారు.

ఒక నేరానికి ఎందరో బలి

- స్నాచింగ్, పోలీస్ హత్య కేసులో ఒకరికి జీవితఖైదు
- గతంలో ఓ నిందితుడు మృతి, మరొకరు ఆత్మహత్య



హోసూరు: దారితప్పి నేరాల బాట పట్టిన యువతకు ఈ సంఘటన ఒక గుణపాఠం వంటిది. అత్యాశకు పోయి నేరాలకు పాల్పడితే వాటి పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని చాటిచెప్పింది. దారిదోపిడీ కేసులో నిందితులను పట్టుకొనేందుకెళ్లిన పోలీసులపై తిరగబడి హత్య చేసేందుకు యత్నించిన కేసులో ఓ నిందితుడికి హోసూరు కోర్టులో జీవిత జైలు శిక్ష విధించింది.

ఏం జరిగిందంటే..

వివరాలు.. హోసూరుకు చెందిన ఉపాధ్యాయిని పార్వతి 2016 జూన్ 15న ఉద్దనపల్లి సమీపంలో నడిచి వెళ్తుండగా దుండగులు చైన్‌స్నాచింగ్ చేసి పరారయ్యారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన హోసూరు పోలీసులు నాగరాజ్, మునిస్వామి, ధనపాల్ నిందితులను పట్టుకొనేందుకు యత్నిస్తుండగా దుండగులు కత్తితో దాడి చేశాడు. మునిస్వామి కత్తిపోటుకు గురై మృతి చెందాడు. నాగరాజ్, ధనపాల్‌కు గాయాలయ్యాయి.

నిందితుల్లో బెంగళూరువాసులు

ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి నిందితులు బెంగళూరు కే.ఆర్.పుర ప్రాంతానికి చెందిన క్రిష్ణమూర్తి, విఘ్నేష్ (22), అమర్ (24), హోసూరుకు చెందిన ముజామిల్ (22)లను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టుకు తరలిస్తుండగా క్రిష్ణమూర్తి గుండెపోటుకు గురై మృతి చెందాడు. కేసు విచారణ సమయంలో విఘ్నేష్ ఆత్మహత్య చేసుకొన్నాడు. శుక్రవారం సాయంత్రం కేసును విచారణ జరిపిన న్యాయమూర్తి రోసిలిన్ దురై నేరాన్ని నిర్ధారించారు. ప్రధాన నిందితుడు ముజామిల్‌కు జీవితఖైదు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. మరో నిందితుడు అమర్‌ను విడుదల చేశారు.

క్యాబేజీ రైతుకు కన్నీరే మిగిలింది

- కేజీ రూ.4కు పడిపోయిన ధర
- అమ్ముడుపోక నష్టాలపాలు

కెలమంగలం: గత కొద్ది రోజులుగా క్యాబేజీ ధరలు పడిపోవడంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నట్లు ఆ పంట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో సాగునీటికి కరువులేకపోయింది. దీంతో హోసూరు, డెంకణీకోట, అంచెట్టి, సూళగిరి తాలూకాల్లో పెద్దఎత్తున రైతులు ఎక్కువ విస్తీర్ణంలో క్యాబేజీ పంటను సాగు చేశారు. గత కొద్ది రోజులుగా క్యాబేజీ ధరలు పడిపోతున్నాయని వాపోయారు.

ఎకరాకు రూ. లక్ష ఖర్చు చేస్తే

ఎకరా క్యాబేజీ పంట సాగుకు రూ.70 వేల నుంచి లక్ష దాకా ఖర్చు చేయవలసి ఉందని రైతులు చెప్పారు. కానీ మార్కెట్‌లో కిలో రూ.2 నుంచి రూ.4 వరకు మాత్రమే ధర ఉందన్నారు. పంటను కొనే వ్యాపారులు కరువయ్యారని, రైతులే స్వయంగా పంటను కోసి మార్కెట్‌కు తరలిస్తే అమ్ముడుపోక నిలువ ఉన్నాయని చెప్పారు. కొంత మంది రైతులు పండించిన క్యాబేజీ అమ్ముడుపోక చెరువుల్లో పడేసి వెళ్తున్నారు. పంటను దాచుకుని ధర వచ్చినప్పుడు అమ్ముకునేలా ప్రభుత్వం ఈ ప్రాంతంలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని కోరారు.



రాయకోట కూరగాయల మార్కెట్‌లో అమ్ముడుపోక నిలువ ఉన్న క్యాబేజీ బస్తాలు

పోలీస్ జీప్, బైక్ ఢీ

- ఒకరి మృతి, ఎస్ఐ, డ్రైవర్‌కు స్వల్పగాయాలు

చింతామణి: పోలీసు జీపు, బైక్ పరస్పరం ఢీకొని బైకిస్టు మృతి చెందాడు. ఈ ఘటన కంచార్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దేపల్లి క్రాస్ దగ్గర శనివారం జరిగింది. కోడగల్ గ్రామపంచాయతీ సభ్యుడు మునియప్ప(40) చింతామణికి బైక్‌లో వస్తుండగా సిద్దేపల్లి క్రాస్ వద్ద పోలీస్ జీపు ఎదురైంది. రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో మునియప్ప తీవ్రంగా గాయపడగా చింతామణి ఆస్పత్రికి తరలించారు. అనంతరం దేవనహళ్లికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జీపు డ్రైవర్ విజయ్, ఎస్ఐ నారాయణస్వామికి స్వల్పగాయాలు కాగా ఆస్పత్రిలో చేరారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఘటనా స్థలంలో గుమికూడిన జనం

ఒకే కుటుంబంలో నలుగురి హత్య

- ఉత్తరకన్నడ జిల్లా హాడువళ్లిలో ఘటన
- ఆస్తి వివాదంతో కర్కశం

యశవంతపుర: ఒకే కుటుంబంలో నలుగురు హత్యకు గురైన ఘటన ఉత్తరకన్నడ జిల్లా హాడువళ్లిలో చోటు చేసుకుంది. హతులను గ్రామానికి చెందిన శంభు భట్(65), భార్య మాదేవి(40), చిన్న కుమారుడు రాజీవ్(40), చిన్న కోడలు కుసుమ(30)గా పోలీసులు గుర్తించారు. ఆస్తి గొడవలతోనే హత్యోదంతం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హతుడు శంభుభట్ పెద్ద కొడుకు శ్రీధర్‌భట్ ఇటీవల కిడ్నీ సమస్యలతో బాధ పడుతూ మృతి చెందాడు. అప్పటినుంచి ఆస్తి వివాదాలు తలెత్తాయి. పెద్ద కోడలు విద్యా భట్.. ఆస్తి విషయంలో గొడవపడేది. ఈ క్రమంలో శుక్రవారం కొంతమంది వ్యక్తులు శంభు భట్ ఇంట్లోకి చొరబడి మారణాయుధాలతో దాడి చేశారు. నలుగురు మృతి చెందగా ఇదే కుటుంబానికి చెందిన పక్కింట్లో నిద్రిస్తున్న ఇద్దరు చిన్నారులు ప్రాణాలతో బయట పడ్డారు. భట్కళ డీఎస్పీ ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అనంతరం పోలీసులు మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. నిందితుల ఆచూకీ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది

మంత్రిని బర్తరఫ్ చేయాలని ధర్నా

మైసూరు: ప్రతిపక్ష నేత సిద్ధరామయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి అశ్వత్థ నారాయణను మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని స్వాభిమాని పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈమేరకు నాయకులు శనివారం మైసూరులో కోటె ఆంజనేయ స్వామి దేవాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయం చేరుకుని ధర్నా చేశారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ధర్నా చేస్తున్న స్వాభిమాని పోరాట సమితి నాయకులు

తీగలు సరిచేస్తుండగా షాక్

- ఆస్పత్రికి తరలించగా కోలుకున్న కార్మికుడు



వైర్లపై అస్వస్థతకు గురైన సమీర్, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దృశ్యం

తుమకూరు: వైర్లు మార్చేందుకు వెళ్లి కరెంటు తీగల మధ్య చిక్కుకున్న కార్మికుడు బెస్కాం సిబ్బంది సమయస్ఫూర్తితో ప్రాణాలతో బయట పడ్డాడు. కేబీ క్రాస్ 220 కేవీ కేంద్రం పరిధిలో నాలుగో త్రైమాసిక నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం తుమకూరు తాలూకాతో పాటు హుళియారు పట్టణంలో పాత వైరు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. కాంట్రాక్టర్ యల్లప్ప ఆధ్వర్యంలో మరమ్మతులు జరుగుతున్నాయి. ఎల్‌సీ తీసుకొని కార్మికులు స్తంభాలపైకి ఎక్కి వైర్లు మార్చుతుండగా హుళియారు డీసీసీ బ్యాంకు ప్రాంతంలో గదగ్‌కు చెందిన కార్మికుడు సమీర్ విద్యుత్‌షాక్‌కు గురై వైర్లపైనే అస్వస్థతకు గురయ్యాడు. అతను చనిపోయినట్లు అందరూ భావించారు. అయితే బెస్కాం సిబ్బంది కిందకు దింపి చూడగా శ్వాస ఆడుతుండటంతో తుమకూరు ఆస్పత్రికి తరలించగా ప్రాణాలతో బయట పడ్డాడు. శనివారం డిశ్చార్జి అయ్యాడు. బ్యాంక్ యూపీఎస్ నుంచి రిటర్న్ సప్లై ఆధారంగా బ్యాక్ ఫీడింగ్ జరిగి ఈ ఘటన జరిగినట్లు బెస్కాం అధికారి ఉమేశ్ నాయక్ తెలిపారు.

హైటెక్ వేశ్యావాటికపై పోలీసుల దాడి

బనశంకరి: నగరంలోని ఒక ప్రాంతంలో నిర్వహిస్తున్న హైటెక్ వేశ్యావాటికపై సీసీబీ పోలీసులు శనివారం దాడి చేశారు. ఐదు జంటలను అరెస్ట్ చేశారు. వేశ్యావాటిక నిర్వాహకులు అందమైన అమ్మాయిల ఫోటోలను వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వీరితో గడపాలంటే గంటకు రూ.40 వేల నుంచి రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుందని సూచిస్తారు. ఇందుకు సమ్మతిస్తే విలాసవంతమైన హోటల్‌లో రూం బుక్ చేస్తారు.వీకెండ్‌లో ఇతర రాష్ట్రాలనుంచి నగరానికి విటులు వస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

నకిలీ నంబర్‌ప్లేట్‌తో కార్ల విక్రయాలకు యత్నం

శివాజీనగర: కార్లకు నకిలీ నంబర్‌ప్లేట్ తగిలించి విక్రయిస్తున్న ఘటన వెలుగు చూసింది. క్వీన్స్ రోడ్డులో కాంగ్రెస్ భవనం పక్కలో ఎమ్మెల్సీ భోజేగౌడ కారు నంబర్ తరహాలో ఓ కారుకు నంబర్ ప్లేట్ ఉండగా ఆయన వ్యక్తిగత కార్యదర్శి మాదేశ్ గమనించారు. అక్కడే ఉన్న షోరూమ్‌లోకి వెళ్లి విచారించగా ఆ కారును విక్రయించానికి ఉంచినట్లు తెలిపారు. అనుమానంతో దాఖలాలు పరిశీలించగా ఆర్‌సీ కూడా భోజేగౌడ పేరుతో ఉన్నట్లు తేలింది. భోజేగౌడకు ఫోన్ చేసి విచారించగా తన కారు తన వద్దే ఉందని చెప్పారు. షోరూమ్ వద్ద మీ కారు నంబర్‌తో కూడిన వాహనం ఉందని చెప్పడంతో హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు షోరూమ్ యజమానిని అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకున్నారు. ఆ కారును తనకు వేరేవారు ఇచ్చారని ఇమ్రాన్ చెప్పినట్లు సమాచారం.





అలరించిన సంగీత కచేరి

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మందిరంలో జరిగిన మహిళా సాధనా శిబిర్ సదస్సు సందర్భంగా శనివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి ప్రేమను కొనియాడుతూ ఢిల్లీ భజన బృందం సంగీత కచేరి, కర్ణాటకకు చెందిన మహిళా వాయిద్యకారుల సంగీత వాయిద్య కచేరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది.



తల్లిదండ్రులకు ఆలయాలు

గౌరిబిదనూరు: తన ఉన్నతికి పాటుపడిన తల్లిదండ్రులు పరమపదించగా వారికి విగ్రహాలు చేయించి ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నాడు విశ్రాంత ఐఏఎస్ గ్రేడ్ అధికారి బాబణ్ణ. తాలూకాలోని కల్లూడి గ్రామానికి చెందిన నరసయ్య, గౌరమ్మ దంపతులకు పది మంది సంతానం. వీరిలో పెద్ద కుమారుడు బాబణ్ణ. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి బాబణ్ణను ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుడిని చేశారు. 2014లో గౌరమ్మ, 2022లో నరసయ్య పరమపదించారు. వారి జ్ఞాపకాలను మరచిపోలేని బాబణ్ణ తన పొలంలో గుడి కట్టించి తల్లిదండ్రుల విగ్రహాలను ప్రతిష్టించి నిత్యపూజలు చేస్తున్నారు.

యశవంతపుర: బెళగావి జిల్లా హుక్కేరి తాలూకా సుల్తానపుర గ్రామానికి చెందిన సురేశ్ తళవార తన తల్లిదండ్రులకు ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నాడు. 20 సంవత్సరాల క్రితం తండ్రి గురప్ప, రెండేళ్ల క్రితం తల్లి పార్వతి మృతి చెందారు. సమాధిపైనే గుడి నిర్మించి తల్లిదండ్రుల విగ్రహాలు ఉంచి పూజలు చేస్తున్నాడు సురేశ్ తళవార. తల్లిదండ్రులను ఎవరూ మరువరాదని ఆయన పేర్కొన్నాడు.



తల్లిదండ్రులు నరసయ్య, గౌరమ్మ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న బాబణ్ణ



సుల్తానపురలో గురప్ప, పార్వతి విగ్రహాలు

8 మంది డ్రగ్ పెడ్లర్ల అరెస్టు

యశవంతపుర: డ్రగ్స్ విక్రయిస్తున్న కేరళ త్రిశూర్, కణ్ణూరుకు చెందిన 8 మంది సభ్యుల ముఠాను బెంగళూరు అమృతహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 50 లక్షల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. హెచ్ఎస్ఆర్ లేఔట్‌లో మబిన్ (32), మన్సూర్ (36), ఎలెక్ట్రానిక్‌సిటీ గార్డెన్ లేఔట్‌కు చెందిన అభిషేక్ (27), అక్షయ్ శివన్ (28), అర్జున్ మోనికిమ్(26), అఖిల్(26), జోయిల్ జోశ్ (21), పృథ్విన్ (23)ను అరెస్ట్ చేశారు.

శివమొగ్గకు మోదీ ఏం చేశారు?

శివాజీనగర: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రంలో బీజేపీ పాలనతో దేశాభివృద్ధి శూన్యమని మాజీ సీఎం హెచ్.డీ.కుమారస్వామి అన్నారు. శనివారం ఆయన చిక్కమగళూరులో విలేకరులతో మాట్లాడారు. శివమొగ్గ విమానాశ్రయానికి రైతులు భూములు ఇచ్చారని, ఇక మోదీ చేసింది ఏమిటని ఆయన ప్రశ్నించారు. బెంగళూరు మైసూరు రోడ్డు నిర్మాణానికి తాను రైతులతో 9 సభలు జరిపి ఎంతో శ్రమించానన్నారు.

ప్రచారంలో నామకరణోత్సవం



శిశువులతో మాజీ మంత్రి

హోసూరు: ఈరోడ్ జిల్లాలో జరుగుతున్న ఉపఎన్నికల్లో ప్రచారానికి వెళ్లిన క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి.. దివంగత సీఎం జయలలిత జయంతిని పురస్కరించుకొని ముగ్గురు శిశువులకు నామకరణం చేశారు. శనివారం ఈరోడ్ జిల్లా కరుంగల్‌పాళ్యం గ్రామంలో జయలలిత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముగ్గురు చిన్నారులకు జయకుమార్, జయలక్ష్మి, జయశ్రీ అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజేంద్రన్, హరీష్‌రెడ్డి, జయపాల్, అశోక్ రెడ్డి, మంజు, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగి దుర్మరణం

హోసూరు: ద్విచక్రవాహనాన్ని వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో విద్యుత్ శాఖ ఉద్యోగి మృతి చెందాడు. తిరువణ్ణామలై జిల్లా సేదుపట్టు ప్రాంతానికి చెందిన తులసీరామన్ (36) హోసూరు సమీపంలోని బేళగొండపల్లిలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనంలో పూనపల్లి- ఆనేకల్ రోడ్డుపై వెళుతుండగా ఎదురుగా వ్యాన్ ఢీకొంది. తీవ్ర గాయాలేర్పడిన తులసీరామన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

మండ్య: రెండు కార్లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన శ్రీరంగపట్టణం తాలూకా బెంగళూరు-మైసూరు రహదారి గౌరిపుర గ్రామం వద్ద జరిగింది. మైసూరు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న కారు నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీ కొట్టి మైసూరు వైపు వస్తున్న స్వర్ణసంద్ర నివాసి శివకుమార్ కారును బలంగా తాకింది. శివకుమార్‌తో పాటు మైసూరు నివాసులు ఇద్దరు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించారు.

ఒకటి కొంటే మరొకటి ఉచితమంటూ వంచన

- రూ.3.98 లక్షలు దోచేసిన కేటుగాళ్లు

బనశంకరి: ఒకటికొంటే మరొకటి ఉచితం అంటూ రూ.3.98లక్షలు దోచేశారు సైబర్ వంచకులు. రాజస్థానీ దాలి ఒకటి కొంటే మరొకటి ఉచితం అంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రకటనను త్యాగరాజనగర నివాసి ఉపేంద్రకుమార్ వీక్షిస్తుండగా గుర్తు తెలియని నెంబరు నుంచి అతని వాట్సాప్‌కు ఫోన్‌కాల్ వచ్చింది, దాలి ఆఫర్‌కు రెండు అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకుని ఒక రూపాయి వేయాలని సూచించారు. దీంతో ఉపేంద్రకుమార్ అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోగా క్షణాల్లో అతని బ్యాంక్ ఖాతా నుంచి రూ.3.98 లక్షలు బదిలీ అయినట్లు సమాచారం వచ్చింది. ఇది సైబర్ వంచకుల పన్నాగమని భావించి బెంగళూరు దక్షిణ సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

- ఒకరి మృతి, మరో ముగ్గురికి గాయాలు

బనశంకరి: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారును అడ్డదిడ్డంగా నడపడటంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరికొందరు గాయపడ్డారు. ఈఘటన అత్తిబెలె పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అత్తిబెలె నరశూరు రహదారి పక్కన సర్వీస్‌రోడ్డులో వాయువేగంతో వచ్చిన కారు తొలుత బైక్‌ను ఢీకొని తర్వాత రోడ్డుపక్కన నిద్రిస్తున్న వ్యక్తిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో బైకిస్టు తీవ్ర గాయాలతో మృతి చెందగా రోడ్డుపక్కన పడుకున్న వ్యక్తి, కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చిన్నారిని బలితీసుకున్న లిఫ్ట్ గుంత

బనశంకరి: లిఫ్ట్ ఏర్పాటుకు తీసిన గుంతలో పడి చిన్నారి మృతి చెందగా బాలుడు గాయపడ్డాడు. ఈ విషాద ఘటన కేఆర్.మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. సుల్తాన్ పేటలో ఐదు అంతస్తుల కట్టడం నిర్మిస్తున్నారు. కొప్పళకు చెందిన దంపతులు కూలీలుగా పనిచేస్తూ కట్టడం వద్దనే గుడిసెలో ఉంటున్నారు. వీరికి మహేశ్వరి(6), రెండేళ్ల వయసున్న బాలుడు వినోద్ ఉన్నారు.శుక్రవారం రాత్రి ఇద్దరూ ఆడుకుంటూ వెళ్లి లిఫ్ట్ కోసం తవ్విన గుంతలో పడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించగా చిన్నారి మృతి చెందింది. కట్టడ యజమాని రమేశ్‌పై ఐపీసీ సెక్షన్ 304 కింద కే ఆర్.మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు వార్తలు..

పొలాలపై ఏనుగుల దాడులు

- అన్నదాతలకు నష్టం

కెలమంగలం: డెంకణీకోట సమీపంలోని బేవనత్తం అటవీ ప్రాంతంలో పది ఏనుగులు మకాం వేసి రైతుల పంటపొలాలను పాడు చేస్తున్నాయి. గత కొద్దిరోజుల క్రితం కర్ణాటక ప్రాంతం నుంచి తమిళనాడుకు వలస వచ్చిన ఏనుగుల మంద విడిపోయి జవుళగిరి, మరగట్ట, బేవనత్తం, ఉడేదుర్గం, శ్యానమావు అటవీ ప్రాంతాల్లో సంచరిస్తూ రైతు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగులను మళ్లీ కర్ణాటక వైపు మళ్లించేందుకు అటవీ శాఖ సిబ్బంది చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి పది ఏనుగులు బేవనత్తం అటవీ ప్రాంతానికి చేరుకొని తిమ్మసంద్రం, మేకలగౌండనూరు తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ రైతులు పండిస్తున్న టమాట, బీన్స్, క్యాబేజీ, అరటి పంటలను తిని, తొక్కివేయడంతో భారీ నష్టం జరిగింది. అటవీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని టపాకాయలు పేల్చి దట్టమైన అటవీ ప్రాంతానికి మళ్లించారు. ప్రతి సంవత్సరం ఏనుగుల దాడుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని, ఏనుగుల దాడి నుంచి శాశ్వత పరిష్కారం కల్పించాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.



బేవనత్తం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల మంద

మహిళ ఆత్మహత్యపై ఆందోళన



హైవేపై బైఠాయించిన బంధువులు

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానం ఉందని బాధితురాలి బంధువులు హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. సూళగిరి సమీపంలో గంట పాటు ఉద్రిక్తత నెలకొంది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని కానలట్టి గ్రామానికి చెందిన శివరాజ్ భార్య శిల్ప (31). వీరికి గత 15 ఏళ్ల క్రితం పెళ్లి జరిగి ఇద్దరు పిల్లలున్నారు. శివరాజ్‌కు తాగుడు అలవాటుండడంతో తరచూ గొడవలేర్పడుతుండేవి. గత రెండు రోజుల క్రితం ఏర్పడిన గొడవల్లో విరక్తి చెందిన శిల్ప పురుగుల మందు తాగింది, విషమ స్థితిలో ఉన్న శిల్పను బంధువులు సేలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. ఆవేశానికి గురైన బాధితురాలి బంధువులు హోసూరు-క్రిష్ణగిరి జాతీయ రహదారి అద్దగురికి వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఆమెను చంపి, ఆత్మహత్య నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. హోసూరు డీఎస్పీ బాబు ప్రసాద్, సూళగిరి తహసీల్దార్ అనిత ఘటనా స్థలానికి చేరుకొని శివరాజ్‌పై చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకొన్నారు.

త్వరలో పెళ్లి.. యువకుడు ఆత్మహత్య

హోసూరు: మరికొద్ది రోజుల్లో ఇంట్లో పెళ్లి వాయిద్యాలు మోగాల్సి ఉంది, కానీ విధి వక్రించి శోకం మిన్నంటింది. పెళ్లి ఇష్టం లేక యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. వివరాల మేరకు.. రాయకోట సమీపంలోని ముగళూరు గ్రామానికి చెందిన మునియప్ప కొడుకు మునిరత్నం (27) ఏ పనీ చేయకుండా ఇంట్లోనే ఉండేవాడు. పెళ్లి చేస్తే దారికి వస్తాడని అనుకుని తల్లిదండ్రులు సంబంధం చూసి పెళ్లి ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఘటనపై తండ్రి, కొడుకుల మధ్య గొడవలు జరిగాయి. ఆవేశం చెందిన మునిరత్నం శుక్రవారం పురుగుల మందు తాగాడు. తండ్రి, బంధువులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందాడు. ఈ ఘటనపై రాయకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమ ఫలించలేదని మరో యువకుడు..

యువతి తన ప్రేమను అంగీకరించలేదని యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మత్తిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు.. హోసూరు సమీపంలోని కొత్తగొండపల్లి గ్రామానికి చెందిన కిరణ్ (23) అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తూ వచ్చాడు. ప్రేమిస్తున్న అమ్మాయి ప్రేమను అంగీకరించకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన కిరణ్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

క్రిష్ణగిరి: సూళగిరి సమితి కొమ్మేపల్లి గ్రామపంచాయతీలో రూ. 23 లక్షల ఖర్చుతో అభివృద్ధి పనులకు యూనియన్ చైర్‌పర్సన్ లావణ్య మధు శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కొమ్మేపల్లి పంచాయతీలోని అగరం గ్రామంలో సీసీ రోడ్లు, మురికి నీటి కాల్వలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కొద్ది రోజుల క్రితం లావణ్యమధు దృష్టికి తీసుకెళ్లారు. వీటి ఏర్పాటుకు రూ.23 లక్షల నిధులను మంజూరు చేయించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, వేగవంతంగా పూర్తి చేసి ప్రజల వినియోగానికి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీడీవో గోపాలక్రిష్ణన్, పంచాయతీ అధ్యక్షులు దేవరాజ్, మునిరత్న, అళగేషన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దృశ్యం

తెలంగాణ

సెప్టెంబర్‌లో ఆప్తా నేషనల్‌ కాన్ఫరెన్స్‌



ఆప్తా నూతన కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్‌: అమెరికన్‌ ప్రోగ్రెసివ్‌ తెలుగు అసోషియేషన్‌ (ఆప్తా) ఏర్పాటుచేసి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నేషనల్‌ కాన్ఫరెన్స్‌ ఘనంగా నిర్వహించాలి అని అసోసియేషన్‌ నిర్ణయించింది. శనివారం ఆప్తా నూతన కార్యవర్గం అట్లాంటాలో సమావేశమై 2023–24 రోడ్‌ మ్యాప్‌పై చర్చించింది. అలాగే సమావేశ నిర్వహణకు అట్లాంటాలో పలు వేదికలను పరిశీలించారు. సెప్టెంబర్‌లో నిర్వహించే ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల నుంచి సినీనటుడు చిరంజీవితోపాటు ప్రముఖ రాజకీయ నాయకులు, సినీ, సాహిత్య కళాకారులను ఆహ్వానించనున్నారు. ఈ సమావేశంలో ఆప్తా అధ్యక్షుడు ఉదయ భాస్కర్‌ కొట్టే, బోర్డు చైర్మన్‌ సుబ్బు కోట, ఆప్తా వ్యవస్థాపకులు శ్రీనివాస్‌ చందు, శ్రీనివాస్‌ చిమట, ఆప్తా పూర్వాధ్యక్షుడు గోపాల గుడపాటి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికం బలీయం

వినూత్న ఆవిష్కరణల్లో భారత్‌ బలహీనం



- ప్రపంచ టాప్‌ 5 ఆర్థిక వ్యవస్థల్లో మన దేశానికి చోటు
- జీడీపీలో నంబర్‌ 1 అమెరికా.. వినూత్న సూచీలో నంబర్‌ 2

(ఎం. విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

బలీయమైన ఆర్థిక శక్తిగా టాప్‌–5 దేశాల జాబితాలో చేరి భారత్‌ సంచలనం సృష్టించింది. 2022లో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల వస్తు, సేవల ఉత్పత్తి విలువ కోటి కోట్ల డాలర్లు దాటింది. ఇందులో 3.5 లక్షల కోట్ల డాలర్ల వాటాతో భారత్‌ ఐదో స్థానాన్ని దక్కించుకుని బ్రిటన్‌ను ఆరో స్థానానికి పరిమితం చేసింది. భారత సంతతికి చెందిన రిషి సునాక్‌ బ్రిటన్‌ ప్రధాని కావడం యాదృచ్ఛికం. బలీయమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నా వినూత్న ఆవిష్కరణల సూచీలో మాత్రం భారత్‌ వెనుకంజలో ఉంది. బలం పుంజుకున్న ఆర్థిక వ్యవస్థకు వినూత్న ఆవిష్కరణలు తోడైతే భారత్‌ అద్భుతాలు సాధిస్తుందని మేధావులు పేర్కొంటున్నారు. ఈ దిశగా అడుగులు వేసి పరిశోధన, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

జీడీపీలో సగం వాటా 5 దేశాలదే

2022లో ప్రపంచ జనాభా 800 కోట్లకు చేరింది. ప్రపంచ దేశాల మొత్తం స్థూల ఉత్పత్తి కోటి కోట్ల డాలర్ల (100 ట్రిలియన్‌ డాలర్స్‌) మార్క్‌ దాటింది. ఇందులో 51 శాతం జీడీపీ అమెరికా, చైనా, జపాన్‌, జర్మనీ, భారత్‌ నుంచే ఉంది. ఇక టాప్‌ 10 దేశాల్లో 66 శాతం జీడీపీ ఉంది. 84 శాతం టాప్‌ 25 దేశాల్లో ఉంది. మిగతా 167 దేశాల్లో కలిపి 16 శాతం మాత్రమే జీడీపీ ఉంది.

అగ్రస్థానంలో స్విట్జర్లాండ్‌

జీడీపీలో 22వ స్థానంలో ఉన్న స్విట్జర్లాండ్‌ ప్రపంచ వినూత్న ఆవిష్కరణల సూచీలో పుష్కరకాలంగా తొలి స్థానంలో నిలుస్తోంది. ఇన్నోవేటివ్‌ ఇండెక్స్‌లో 64.6 స్కోరుతో 2022లో తొలిస్థానంలో నిలిచింది. 61.8 స్కోరుతో రెండో స్థానంలో ఉన్న అమెరికా పరిశోధన–అభివృద్ధిపై ఏటా 70 వేల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పరిశోధన, అభివృద్ధిపై భారీగా వ్యయం చేస్తున్న నాలుగు కంపెనీలు అమెజాన్‌, ఆల్ఫాబెట్‌, మైక్రోసాఫ్ట్‌, యాపిల్‌ అమెరికాలోనే ఉండటం గమనార్హం. ఐరాస రూపొందించిన వినూత్న ఆవిష్కరణల సూచీలో మన దేశానికి 40వ స్థానం దక్కింది. 36.6 పాయింట్ల స్కోరుతో భారత్‌ 40వ స్థానంలో ఉంది. జీడీపీలో రెండోస్థానంలో ఉన్న చైనా 55.3 పాయింట్ల స్కోరుతో వినూత్న సూచీలో 11వ స్థానంలో నిలిచింది.

2022లో టాప్‌ 25 దేశాల జీడీపీ..

దేశం	జీడీపీ (బిలియన్‌ డాలర్లలో)
1. అమెరికా	25,035
2. చైనా	18,321
3. జపాన్‌	4,300
4. జర్మనీ	4,031
5. భారత్‌	3,428
6. యూకే	3,198
7. ఫ్రాన్స్‌	2,778
8. కెనడా	2,200
9. రష్యా	2,133
10. ఇటలీ	1997
11. ఇరాన్‌	1973
12. బ్రెజిల్‌	1894
13. దక్షిణ కొరియా	1734
14. ఆస్ట్రేలియా	1724
15. మెక్సికో	1424
16. స్పెయిన్‌	1389
17. ఇండోనేషియా	1289
18. సౌదీ అరేబియా	1010
19. నెదర్లాండ్స్‌	990
20. టర్కీ	853
21. తైవాన్‌	828
22. స్విట్జర్లాండ్‌	807
23. పోలండ్‌	716
24. అర్జంటీనా	630
25. స్వీడన్‌	603

అమరావతి భూ కుంభకోణంలో కీలక ఆధారాలు లభ్యం!

- నారాయణ కుమార్తెల నివాసంలో ముగిసిన సీఐడీ సోదాలు
- సేకరించిన ఆధారాలు ఫోరెన్సిక్‌ పరీక్షలకు పంపాలని నిర్ణయం
- ఆ రిపోర్టు వచ్చిన తర్వాత కేసు దర్యాప్తు మరింత వేగవంతం

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిలో భూ కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న సీఐడీ కీలక ఆధారాలను సేకరించింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా టీడీపీ ప్రభుత్వంలో మున్సిపల్‌ శాఖ మంత్రిగా వ్యవహరించిన పి.నారాయణ కుమార్తెలకు చెందిన హైదరాబాద్‌లోని నివాసాల్లో సీఐడీ రెండురోజులపాటు చేసిన సోదాలు శనివారం ముగిశాయి. అమరావతి మాస్టర్‌ ప్లాన్‌, సీడ్‌ క్యాపిటల్‌, ఇన్నర్‌ రింగ్‌ రోడ్‌ తదితర ప్రణాళికల్లో చంద్రబాబు, నారాయణ తమ బినామీల పేరిట భారీగా భూములు కొల్లగొట్టారని సీఐడీ అధికారులు గుర్తించారు. నారాయణ విద్యాసంస్థల ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ఖాతాలోకి నిధులు మళ్లించి... ఆ సంస్థ ఉద్యోగులను బినామీలుగా పెట్టుకుని భూములు తమ గుప్పెట్లో పెట్టుకున్నారని గుర్తించారు. ఈ మేరకు బ్యాంక్‌ లావాదేవీ పత్రాలు, భూ రికార్డులతోపాటు ఇతర కీలక ఆధారాలను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కీలక ఆధారాలను ఫోరెన్సిక్‌ పరీక్షల నిమిత్తం పంపించాలని నిర్ణయించారు. ఫోరెన్సిక్‌ నివేదిక వచ్చిన తర్వాత ఈ కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేయనున్నారు.

జిమ్‌కు వెళ్లొస్తూ కుప్పకూలాడు

- గుండెపోటుతో 25 ఏళ్ల యువకుడి మృతి
- మే 3న వివాహానికి ఏర్పాట్లు
- ఇంతలోనే దారుణం

ఆదోని అర్బన్‌: ఆదోని పట్టణ శివారులోని ఆర్ట్స్‌ కళాశాల రోడ్డులో గల జిమ్‌లో వ్యాయామం చేసి బయటకు వచ్చిన ఓ యువకుడు గుండెపోటుతో కుప్పకూలి మరణించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టణంలోని తిరుమలనగర్‌కు చెందిన సాయిప్రభు (25) ప్రతిరోజూ ఉదయాన్నే 6 గంటలకు జిమ్‌కు వెళ్లి వ్యాయామాలు చేస్తుంటాడు. శనివారం ఉదయాన్నే వాకింగ్‌కు పూర్తి చేసుకున్న సాయిప్రభు జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేశాడు. ఆ తర్వాత బయటకు వచ్చి స్పృహ తప్పి పడిపోగా.. స్నేహితులు గమనించి వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

మే 3న వివాహం

తిరుమలనగర్‌కు చెందిన మల్లికార్జున ఆచారి, పుష్పవతి దంపతులకు ముగ్గురు సంతానం. ఆచారి కార్పెంటర్‌ కాగా.. పెద్ద కుమారుడికి, రెండో కుమార్తెకు వివాహాలు చేశాడు. మూడో కుమారుడు సాయిప్రభు బెంగళూరులోని ఓ ప్రైవేట్‌ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం అతడు వర్క్‌ ఫ్రమ్‌ హోమ్‌ కింద ఇంటినుంచే పని చేస్తున్నాడు. అతనికి బెంగళూరుకు చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. మే 3వ తేదీన ముహూర్తం నిర్ణయించగా.. కుటుంబ సభ్యులు ఆ ఏర్పాట్లలో ఉండగా.. ఈ దారుణం చోటుచేసుకుంది. సాయిప్రభు మరణించిన విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు.

పోలవరం డయాఫ్రమ్‌వాల్‌పై 28లోగా నివేదిక

- జలవనరుల శాఖ, పీపీఏలకు ఇవ్వనున్న ఎన్‌హెచ్‌పీసీ
- దాని ఆధారంగా 4న డీడీఆర్పీ క్షేత్ర స్థాయి పరిశీలన
- 5న సీడబ్ల్యూసీ అధికారులు, ఐఐటీ ప్రొఫెసర్లతో మేధోమథనం

సాక్షి, అమరావతి: టీడీపీ సర్కార్‌ పాపాల వల్ల.. గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న పోలవరం ప్రధాన డ్యామ్‌ డయాఫ్రమ్‌వాల్‌ (పునాది) భవితవ్యాన్ని తేల్చే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. డయాఫ్రమ్‌వాల్‌ సామర్థ్యాన్ని తేల్చేందుకు గతనెల 26 నుంచి ఈనెల 10వ తేదీ వరకూ ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్‌ హైడ్రో పవర్‌ కార్పొరేషన్‌) నిపుణుల బృందం హైరిజల్యూషన్‌ జియోఫిజికల్‌ రెసిస్టివిటీ ఇమేజింగ్‌, సీస్మిక్‌ టోమోగ్రఫీ విధానాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ఫలితాలను విశ్లేషించి.. ఈనెల 28లోగా రాష్ట్ర జలవనరుల శాఖ, పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ)లకు ఆ బృందం నివేదిక ఇవ్వనుంది. ఈ నివేదిక ఆధారంగా సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) రిటైర్డ్‌ చైర్మన్‌ ఏబీ పాండ్య నేతృత్వంలోని డ్యామ్‌ డిజైన్‌ రివ్యూ ప్యానల్‌(డీడీఆర్పీ) బృందం పోలవరం ప్రధాన డ్యామ్‌ డయాఫ్రమ్‌వాల్‌ను మార్చి 4న క్షేత్ర స్థాయిలో పరిశీలించనుంది. డయాఫ్రమ్‌వాల్‌ సామర్థ్యం బాగున్నట్లు ఎన్‌హెచ్‌పీసీ నివేదిక ఇస్తే.. ప్రధాన డ్యామ్‌ పనులకు డీడీఆర్పీ గ్రీన్‌ సిగ్నల్‌ ఇస్తుంది. ఒకవేళ డయాఫ్రమ్‌ వాల్‌ దెబ్బతిందని ఎన్‌హెచ్‌పీసీ తేల్చితే.. దాన్ని సరిదిద్దాలా? లేదంటే పాతదానికి సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్‌వాల్‌ నిర్మించాలా? అనే అంశాలపై సీడబ్ల్యూసీ, ఐఐటీ(ఢిల్లీ, తిరుపతి, హైదరాబాద్‌) ప్రొఫెసర్లతో మార్చి 5న డీడీఆర్పీ బృందం మేధోమథనం జరుపుతుంది. ఇందులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా డయాఫ్రమ్‌వాల్‌ భవితవ్యాన్ని తేల్చుతుంది.

తెలంగాణ

స్నేహితుడిని కత్తితో పొడిచి.. తల, గుండె వేరు చేసి..

- తాను ప్రేమించిన యువతికి దగ్గరవుతున్నాడన్న కక్షతో దుర్మార్గం
- పథకం ప్రకారం పిలిపించి.. హత్యచేసిన ఇంజనీరింగ్‌ విద్యార్థి
- యువకుడి శరీర భాగాలను దూర దూరంగా విసిరేసిన వైనం
- తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో దారుణం

అబ్దుల్లాపూర్‌మెట్‌: తాను ప్రేమించిన యువతికి దగ్గరయ్యాడన్న కక్షతో తన స్నేహితుడిని దారుణంగా హత్య చేశాడు ఓ ఇంజనీరింగ్‌ విద్యార్థి. తర్వాత గుండె, తల, మొండెం, కాళ్లు చేతులను వేరుచేసి.. దూరదూరంగా పడేశాడు. వాటి ఫొటోలను వాట్సాప్‌ ద్వారా ప్రియురాలికి, స్నేహితులకు పంపి పైశాచికానందం పొందాడు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో శనివారం వెలుగు చూసిన దారుణ ఘటన ఇది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాగర్‌ కర్నూల్‌ జిల్లా వంకరాయితండాకు చెందిన నేనావత్‌ శంకర్‌ కుమారుడు నవీన్‌ (20), వరంగల్‌కు చెందిన పేరాల ప్రభాకర్‌ కుమారుడు హరిహరకృష్ణ (21) ఇంటర్మీడియట్‌ నుంచి స్నేహితులు. హరిహరకృష్ణ పీర్జాదిగూడలోని అరోరా కళాశాలలో, నవీన్‌ నార్కట్‌పల్లిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌ చదువుతున్నారు. ఇంటర్‌లో హరిహరకృష్ణ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. నవీన్‌ కూడా అదే యువతిని ఇష్టపడ్డాడు. ఆ యువతి కొంత కాలం నుంచి తనను దూరం పెడుతూ నవీన్‌తో చనువుగా ఉండటాన్ని హరిహరకృష్ణ జీర్ణించుకోలేకపోయాడు. నవీన్‌ను అడ్డు తొలగించుకోవాలని ప్లాన్‌ చేశాడు. ఈ నెల 17న ఇంటర్‌ ఫ్రెండ్స్‌ గెట్‌ టు గెదర్‌ ఉందని నవీన్‌ను హైదరాబాద్‌కు రప్పించాడు. సాయంత్రం ఇద్దరూ బైక్‌పై అబ్దుల్లాపూర్‌ మెట్‌ వద్ద నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మద్యం తాగారు. ఈ సమయంలో ప్రేమించిన యువతి విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. అప్పటికే పదునైన కత్తి తెచ్చుకున్న హరిహరకృష్ణ దానితో నవీన్‌పై దాడి చేశాడు. నవీన్‌ తలను, కాళ్లు, చేతులు, ఇతర శరీర భాగాలను కోశాడు. ఛాతీ చీల్చి గుండెను బయటికి తీశాడు. శరీర భాగాలను దూరదూరంగా పడేశాడు.

అక్కడి నుంచి హసన్‌ అనే మరో స్నేహితుడి ఇంటికి వెళ్లి, స్నానం చేశాడు. తర్వాత హత్య గురించి హసన్‌కు చెప్పాడు. వెంటనే పోలీసులకు లొంగిపోవాలని హసన్‌ సూచించాడు. తెల్లారాక వెళ్తానని చెప్పి, అక్కడే నిద్రపోయాడు. మరునాడు మూసారంబాగ్‌లోని తన సోదరి ఇంటికి వెళ్లాడు. నాలుగైదు రోజులు హైదరాబాద్‌లోనే ఉన్నాడు. తర్వాత విశాఖపట్నం, ఇతర ప్రాంతాల్లో తిరిగాడు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చి ప్రియురాలిని పిలిపించుకుని మాట్లాడాడు. నవీన్‌ను హత్య గురించి చెప్పాడు. పోలీసులకు లొంగిపోవాలని ఆమె కూడా చెప్పింది. ఈ నెల 16న నుంచీ నవీన్‌ ఆచూకీ తెలియకపోవడంతో.. అతడి కుటుంబ సభ్యులు గాలించడం మొదలుపెట్టారు. ఏం జరిగిందని హరిహరకృష్ణను నిలదీశారు. తమ మధ్య గొడవ వాస్తవమేనని, నవీన్‌ నార్కట్‌పల్లి వెళ్తానంటే విజయవాడ జాతీయ రహదారిపై దింపేశానని చెప్పాడు. ఆ తర్వాత హరిహరకృష్ణ ఫోన్‌ కూడా స్విచాఫ్‌ రావడంతో మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని వైపులా ఒత్తిడి రావడంతో హరిహరకృష్ణ శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీసులకు లొంగిపోయాడు. నవీన్‌ను హత్య చేసిన హరిహరకృష్ణ ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహంపై డ్రెస్‌ను తొలగించి దూరంగా పడేశాడని, శరీర భాగాలను కోసిన సమయంలో చేతులకు గ్లౌజులు వేసుకున్నాడని వివరించారు. అతని రెండు ఫోన్లలోని డేటా మొత్తాన్ని తొలగించినట్టు సమాచారం.



విజయకేతనం

ఫలితం పదిలం

టెన్త్‌ విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ

- 40 రోజులపాటు అమలు
- ఒత్తిడిని జయించేలా తర్ఫీదు
- నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
ఏలూరు	261	24,284
పశ్చిమగోదావరి	226	12,782
మొత్తం	487	37,066

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కరోనా విపత్తు అనంతరం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మరింత క్షీణించి ఫలితాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వెనుకబడింది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి జిల్లా విద్యాశాఖ తీవ్ర కసరత్తు చేసింది. ఈ దిశగా సబ్జెక్టు నిపుణులు, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ప్రతినిధులు విజయకేతనం పేరుతో ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. 40 రోజులపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు అకుంఠిత దీక్షతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు కనీసం 50 శాతం మార్కులు సాధించేలా కార్యాచరణ రూపొందించారు. ఏప్రిల్‌లో పబ్లిక్‌ పరీక్షలు ప్రారంభం కానున్న దృష్ట్యా విజయకేతనం కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయడానికి డీవైఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సంసిద్ధులయ్యారు. ఈనెల 20వ తేదీ నుంచి వచ్చేనెల 31 వరకు అమలు చేసేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు విద్యార్థులను ఆశావహ దృక్పథంతో పరీక్షలకు సమాయత్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 487 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 37,066 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అలాగే సుమారు 270 ప్రైవేట్‌, అన్‌ ఎయిడెడ్‌ పాఠశాలల్లో 14,800 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్‌ పాఠశాలల్లోనూ విజయకేతనం కార్యాచరణ అమలు చేయాలని అధికారులు సూచించారు.

విజయకేతనంలో ప్రధాన అంశాలు

- 30 నుంచి 40 శాతం మంది విద్యార్థులు ఒక సబ్జెక్టులో 50 నుంచి 100 ప్రశ్నలు మాత్రమే చదవగలుగుతున్నారు. వారికి తక్కువ పనిభారాన్ని ఇవ్వడం ద్వారా ఒత్తిడి నుంచి బయటపడేలా చేయడం.
- వీరితో రోజుకు రెండు ప్రశ్నలు, 10 బిట్లు చదివిస్తారు.
- ఏ రోజు ఏ ప్రశ్న చదవాలి అన్నది తేదీ వారీగా కార్యాచరణ రూపొందించారు. ఏ రోజు అభ్యసన ఆదే రోజు పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే.
- విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించి పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలి.
- ఉపాధ్యాయులు సెలవులో ఉన్నా స్వచ్ఛందంగా పాఠశాలకు వచ్చి టైమ్‌ టేబుల్‌ అమలు చేసేలా హెచ్‌ఎంలు చూడాలి.
- ఉపాధ్యాయుల్లో ఒత్తిడి భావం కలగకుండా ప్రేరణ కలిగించాలి.
- ప్రశ్నలను అప్పజెప్పించుకోవడంతో పాటు విద్యార్థులతో చూడకుండా రాయించాలి.
- ప్రత్యేకంతో ప్రతి సబ్జెక్టులో విజయకేతనం పేరుతో పుస్తకాలు పెట్టించాలి.
- తరగతి గదిలో విద్యార్థులు ఎక్కువ మంది ఉంటే బాగా చదివే విద్యార్థులను లీడర్స్‌గా నియమించుకుని వెనుకబడిన విద్యార్థుల బాధ్యతలను (అప్పజెప్పించుకోవడం, రాయించడం) అప్పగించాలి.
- వచ్చేనెలలో ఎఫ్‌ఏ 4 పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఆ సిలబస్‌ను కార్యాచరణ ప్రణాళికలో ముందుగా ఇచ్చారు.
- అలాగే ఎఫ్‌ఏ 4 పరీక్షలతో పాటు ప్రీ పబ్లిక్‌ పరీక్షల తేదీల్లో వీలును బట్టి కార్యాచరణను మార్చుకున్నా వచ్చేనెల 31 నాటికి 40 రోజుల కార్యాచరణను విధిగా పూర్తిచేయాలి.
- సమగ్ర శిక్ష సెక్టోరల్‌ అధికారులు ఇద్దరు ఒక్కో డివిజన్‌ను దత్తత తీసుకొని కార్యాచరణ అమలు తీరును పరిశీలించాలి.

హాస్టల్‌ విద్యార్థులకు శుభవార్త

డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలు పెంచుతూ జీఓ

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం



భీమవరం బీసీ హాస్టల్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, భీమవరం: రాష్ట్రంలో విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అండగా నిలుస్తోంది. తాజాగా హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఇచ్చే డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలను పెంపుదల చేస్తూ జీఓలను విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్‌ 1 నుంచి పెంచిన చార్జీలు అమలులోకి వస్తాయి. ఇందుకోసం అదనంగా డైట్‌ చార్జీలకు రూ.132 కోట్లు, కాస్మోటిక్‌ చార్జీలకు రూ.48 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, తదితర సంక్షేమ హాస్టల్‌ విద్యార్థులకు ప్రభుత్వం 2012లో మెస్‌ చార్జీలను పెంచింది. గత ఎన్నికలకు ముందు (2018) టీడీపీ ప్రభుత్వం హడావుడిగా నామమాత్రంగా డైట్‌ చార్జీలను పెంచినా అవి అమల్లోకి రాలేదు. నాటి నుంచి ఇప్పటివరకూ హాస్టల్‌ విద్యార్థులకు పాత చార్జీలనే అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

67 హాస్టళ్లు.. 2,500 మంది విద్యార్థులు

జిల్లాలో 38 ఎస్సీ, 29 బీసీ హాస్టళ్లలో సుమారు 2,500 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఎస్సీ హాస్టళ్లలో 1,251 మంది, బీసీ హాస్టళ్లలో 1,321 మంది ఉన్నారు. వీరందరికీ చార్జీల పెంపు వల్ల ప్రయోజనం కలుగుతుంది. అలాగే హాస్టళ్లలో చేరేందుకు పేద విద్యార్థులు మరింత ఆసక్తి చూపుతారని అధికారులు అంటున్నారు. పేదల చదువులకు అన్నివిధాలా అండగా ఉంటున్న సీఎం జగన్‌కు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

డైట్‌ చార్జీలు ఇలా..

తరగతులు	ప్రస్తుతం	పెంపు
3,4 తరగతులు	రూ.1,000	రూ.1150
5 నుంచి 10 తరగతులు	రూ.1,250	రూ.1,400
ఇంటర్‌ ఆపై..	రూ.1,400	రూ.1,600

కాస్మోటిక్‌ చార్జీలు

3 నుంచి 6 తరగతులు		
బాలురు	రూ.100	రూ.125
బాలికలు	రూ.110	రూ.130
7 నుంచి 10 తరగతులు		
బాలురు	రూ.125	రూ.150
బాలికలు	రూ.160	రూ.200
ఇంటర్‌ ఆపై..		
బాలురు	రూ.125	రూ.200
బాలికలు	రూ.160	రూ.250

విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది

హాస్టళ్లలో విద్యార్థుల డైట్‌, కాస్మోటిక్‌ చార్జీలను ప్రభుత్వం పెంచడం ద్వారా రానున్న విద్యాసంవత్సరం నుంచి వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం పెంచిన చార్జీలు వచ్చే జూన్‌ నుంచి అమలులోకి రానున్నాయి.

–జీవీఆర్‌కేఎస్‌ఎస్‌ గణపతిరావు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి, భీమవరం

గండికోటకు ప్రపంచ స్థాయి పర్యాటక శోభ!

- స్వదేశీ దర్శన్‌ కిందమౌళిక వసతులు
- విల్లాస్‌ నిర్మాణానికి పరిశీలించిన ఒబెరాయ్‌ సంస్థ

సాక్షి ప్రతినిధి, కడప: చరిత్రాత్మక నిర్మాణమైన గండికోట, స్వదేశీ దర్శన్‌– 2.0 కింద ఎంపిక కావడంతో ప్రపంచస్థాయి పర్యాటక శోభ దక్కనుంది. వారసత్వ సంపదకు సజీవ సాక్ష్యంగా పర్యాటకులను ఆకట్టుకుంటున్న గండికోటను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. అబ్బురపరిచే నిర్మాణాలు, కోట, ప్రాకారాలు, ఆలయాలు, గుర్రపుశాలలు, జైలు, ధాన్యాగారాలు, కోనేరు ఇలా ఎన్నో నిర్మాణాలను చేపట్టనున్నారు. వైఎస్సార్‌ జిల్లా జమ్మలమడుగు సమీపంలో ఉన్న గండికోటను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రపంచంలో అత్యంత పేరు ప్రఖ్యాతులు గాంచిన ఒబెరాయ్‌ సంస్థ ప్రతినిధులు గండికోటలో 7 స్టార్‌ హోటల్‌ నిర్మించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఆ మేరకు స్థల పరిశీలన చేపట్టారు. 3 ప్రాంతాల్లో పర్యటించి తుదకు కోట సమీపంలో నిర్మించేందుకు ప్రతినిధి బృందం అంగీకారం తెలిపింది. మరోవైపు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటక సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గండికోట వద్ద 1110 ఎకరాలు భూమిని టూరిజం అభివృద్ధి కోసం కేటాయించింది.

రూ.150 కోట్లతో వసతుల కల్పన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో స్వదేశీ దర్శన్‌ ద్వారా రూ.150 కోట్లతో గండికోటలో పర్యాటక మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇటీవల స్వదేశీ దర్శన్‌–2.0 పథకం క్రింద 36 పర్యాటక ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. రాష్ట్రంలో ప్రధానంగా అరకు, లంబసింగి సర్క్యూట్‌, గండికోట, హార్సిలీహిల్స్‌, తిరుపతి తదితర ప్రాంతాలకు చోటు కల్పించింది. ఆయా ప్రాంతాలల్లో అభివృద్ధి చేపట్టేందుకు కేంద్ర పర్యాటకశాఖ ప్రాజెక్టు డెవలప్‌మెంట్‌ కన్సల్టెంట్లను ఆహ్వానించింది. రాష్ట్ర పర్యాటకశాఖ ప్రాజెక్టు అమలు బాధ్యతలను అప్పగించి పూర్తి చేసేందుకు మార్గదర్శకాలను రూపొందించింది. సాంస్కృతిక, పౌర సమాజ స్థితిగతులు మెరుగుపర్చేలా ప్రణాళికలను సిద్ధం చేసింది.

120 విల్లాల నిర్మాణానికి సన్నాహాలు

ఒబెరాయ్‌ సంస్థ గండికోటలో రూ.250 కోట్లతో 120 విల్లాలు నిర్మించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తోన్నట్లు యంత్రాంగం వివరిస్తోంది. మరోవైపు స్వదేశీ దర్శన్‌ ద్వారా పర్యాటల కోసం వాచ్‌టవర్లు, రిసార్ట్స్‌, వసతి గదులు, కన్వెన్షన్‌ సెంటర్లు, అడ్వెంచర్‌ క్రీడలు, గోల్ఫ్‌ కోర్టులు, యాంఫీ థియేటర్లు, సాంస్కృతిక భవనాలు, సౌండ్‌లైట్‌ షోలు, అందుబాటులోకి రానున్నాయి. కళాకారులు, చేతివృత్తి కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేలా వారి కోసం ప్రత్యేక దుకాణ సముదాయాలను నిర్మించనున్నారు.

మండల స్థాయిలోనూ 'స్పందన'

రేపటి నుంచి క్రమం తప్పకుండా నిర్వహణ

సాక్షి, అమలాపురం: కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత స్పందన కార్యక్రమం అనగానే అర్జీదారులు కలెక్టరేట్‌ వద్దనే బారులు తీరుతున్నారు. చిన్నచిన్న సమస్యలకు సైతం వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి వస్తున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లోని సచివాలయాల్లో రోజూ క్రమం తప్పకుండా స్పందన నిర్వహించాలని గతంలోనే నిర్ణయించింది. అయినప్పటికీ ఇంకా చాలా మంది కలెక్టరేట్‌కు వస్తున్నారు. దీంతో మండల స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం నిర్వహించాలని, దీనిని ఈ సోమవారం నుంచి పక్కాగా అమలు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

ఎంపీడీఓ కార్యాలయాల్లో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రీవెన్స్‌ సెల్‌ పేరుతో గతంలో మండల, డివిజన్‌ స్థాయిల్లో అర్జీలు స్వీకరించేవారు. కొత్త జిల్లా ఏర్పడిన తరువాత స్పందన నిర్వహణ మండల స్థాయిలో నిలిచిపోయింది. కలెక్టరేట్‌ దగ్గర కావడంతో అర్జీదారులు జిల్లా కేంద్రానికే పెద్ద సంఖ్యలో వస్తున్నారు. అమలాపురం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి స్పందనకు తొలి రోజుల్లో 225 నుంచి 250 వరకూ అర్జీలు వచ్చేవి. శివారు ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని, ఇళ్ల ముందు డ్రెయిన్లలో పూడిక తీయడం లేదని, రహదారులు నిర్మించాలనే చిన్నచిన్న సమస్యలు సైతం కలెక్టరేట్‌కు వస్తున్నాయి. వీటి కోసం ఆయా అర్జీదారులు రామచంద్రపురం, మండపేట, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల నుంచి ఇక్కడకు వస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామ/వార్డు సచివాలయాల్లో క్రమం తప్పకుండా ప్రతి రోజూ ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోంది. దీంతో కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి స్పందనకు 150 నుంచి 175 మంది వరకూ వస్తున్నారు. ఇలా వస్తున్న అర్జీల్లో కూడా మండల స్థాయిలో తహసీల్దార్‌, ఎంపీడీఓ, పోలీసు, ఇతర శాఖలు పరిష్కరించే సమస్యలే అధికంగా ఉంటున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇక నుంచి మండల స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సోమవారం నుంచి జిల్లాలోని 22 ఎంపీడీఓ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం ప్రారంభం కానుంది. రెవెన్యూ, న్యాయపరమైన వివాదాలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, రోడ్లు, ఇతర చిన్నచిన్న సమస్యలకు వివిధ శాఖల అధికారులు స్థానికంగానే అందుబాటులో ఉండనున్నారు. దీంతో అర్జీదారులకు సైతం కలెక్టరేట్‌కు వచ్చే వ్యయప్రయాసలు తగ్గనున్నాయి.

సాక్షి
ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 26-2-2023



నలుగురితో కలిసి ఉన్నప్పుడు మనలోని బలం పెరిగినట్టు అనిపిస్తుంది. అదే, ఒంటరిగా ఉన్నప్పుడు లేదా ఏదైనా సమస్యను ఎదుర్కొనే సమయంలో మానసికంగా మనం ఎంతటి శక్తివంతులమో మనకే అర్థమవుతుంది. ఈ సమయంలో భావోద్వేగాలలో మార్పులు తీవ్రంగా ఉంటే జీవన విధానంపై అవి చెడు ప్రభావం చూపుతాయి. 'ఒంటరిగా ఉన్నా, నలుగురిలో కలివిడిగా ఉన్నా భావోద్వేగాలను అదుపులో పెట్టుకుంటూ మనల్ని మనం శక్తిమంతులుగా ఎలా సిద్ధం చేసుకోవాలో తెలుసుకుంటే వచ్చే సమస్యల అలలను సులువుగా ఎదుర్కోవచ్చు' అంటున్నారు మనస్తత్వ నిపుణులు.

ప్రతీకాత్మక చిత్రం

మీలోని శక్తి ఎంత?!

'సైకలాజికల్ ఫ్లెక్సిబిలిటీ అనేది సందర్భాన్ని బట్టి, వ్యక్తిని బట్టి మారుతూ ఉంటుంది. అయితే, ఇటీవల చాలా మందిలో గమనిస్తున్న విషయమేంటంటే చిన్న విషయానికి కూడా ఓవర్‌గా రియాక్ట్ అవుతుంటారు. నేను చెప్పిందే వినాలి' అనే ధోరణి పెరగడం కూడా బంధాలను విచ్ఛిన్నం చేస్తుంది' అంటున్నారు లైఫ్‌స్కిల్ ట్రెయినర్ జ్యోతిరాజ.

ఎరుక అవసరం

కొందరు తమచుట్టూ ఎవరికీ కనపడని ఒక వలయాన్ని సృష్టించుకుంటారు. పరిమితులను నిర్దేశించుకుని వాటిని దాటి బయటకు రారు. ఏదైనా చిన్న సమస్య ఎదురైనా సృష్టించుకున్న వలయం ఎక్కడ ఛిన్నాభిన్నం అవుతుందో అని తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతారు. ఫలితంగా భావోద్వేగాల అదుపు కోల్పోయి ఇతరులను నిందించడం, తమను తామే శిక్షించుకోవడం లేదా గాసిప్స్‌ని ఆశ్రయిస్తారు. 'భావోద్వేగాల అదుపు కోల్పోతే ఏ బంధంలోనైనా బీటలు వస్తాయి. అందుకని వలయాలతో కాకుండా ఎరుకతో మెలిగితే మనలోని అంతర్గత శక్తి స్థాయిలు స్పష్టమవుతాయి' అనేది నిపుణుల మాట.

మౌనంగా ఉండటం మేలు

అతిగా మాట్లాడటం, చేతల్లో మన పనిని చూపించకపోతే ఎదుటివారి ముందు మన శక్తి తగ్గిపోతుంది. ఫలితంగా భావోద్వేగాల్లోనూ మార్పు వస్తుంది. ఇది బంధుమిత్రుల మధ్య పెద్దగా గుర్తించకపోవచ్చు. కానీ, పని ప్రదేశాలలో ఈ 'శక్తి'ని బాగా గుర్తించవచ్చు. ఇబ్బందిని కలిగించే సంభాషణల్లో పాల్గొనడం కన్నా, తక్కువ మాట్లాడం వల్ల శక్తిని, భావోద్వేగాల సమతుల్యతను కాపాడుకోవచ్చు. ఆ శక్తిని ఇతర సృజనాత్మక పనులకు బదిలీచేయవచ్చు.

అవగాహనతో సరైన శక్తి

అంతర్గత దిక్సూచిని భావోద్వేగ మేధస్సు అని కూడా అంటారు. ఇది సున్నితం–తీవ్రం రెండింటినీ సమాన స్థాయిలో ఉంచుతుంది. అంటే, నలుగురిలో ఉన్నప్పుడు ఏ వ్యక్తి ఎలా దూకుడుగా ప్రవర్తించబోతున్నాడో ముందే పసిగట్టి, నివారించే శక్తి వీరికుంటుంది. సరైన సమయంలో ఎలా స్పందించాలో తెలిస్తే భావోద్వేగాలను అదుపులో పెట్టుకోగల అంతర్గత శక్తి పెరుగుతుంది.

పట్టు విడుపులు తెలుసుండాలి...

ఏ అంశం వదిలేయాలి. దేనిని మన ఆధీనంలో ఉంచుకోవాలనే దానిపై స్పష్టత ఉండాలి. అనవసరం అనిపించే సమస్య ఏదైనా వదిలేయడం కూడా తెలియాలి. పిల్లలైతే వారు చదువుల్లో ఆటపాటల్లో బిజీగా ఉంటారు. కాలేజీ స్థాయి యువతలో బిజీగా ఉంటారు. గృహిణుల్లో మాత్రం పిల్లలు పెద్దయ్యాక వారికి కొంత తీరిక సమయం ఉంటుంది. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ముందునుంచే తమను తాము మలుచుకుంటూ ఉండాలి. తమలో ఉండే ఇష్టాయిష్టాలు, కలల కోసం ప్రయత్నిస్తూ ఉన్నప్పుడు దాని ద్వారా కలిగే సంతృప్తి వల్ల భావోద్వేగాల అదుపు, అంతర్గత శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఈ ప్రాక్టీస్ ఇంట్లో పిల్లల చేత కూడా చేయిస్తే, వారిలోనూ కొత్త సమర్థతలు బయటకు వస్తాయి. భావోద్వేగాల అదుపుకు అంతర్గతశక్తిని మేల్కొల్పడమే సరైన ఆయుధం.



– ఆచార్య జ్యోతిరాజ,
లైఫ్ స్కిల్ ట్రెయినర్

తట్టుకునే శక్తిని పెంచుకోవాలి..

సాధారణంగా మనకు ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే కంగారు పడిపోతాం. భయం ఆవరించేస్తుంది. ఈ ఒత్తిడి మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిని. బ్యాక్‌పెయిన్, నెక్ పెయిన్, స్ట్రెస్.. వంటివి సాధారణంగా ఉంటాయి. ఈ సమస్యలకు విరుగుడుగా ఆరోగ్యం, మానసిక స్థిరత్వానికి యోగ సాధన చేయడం ఒక భాగం చేసుకున్నాను. దీనితో పాటు ధ్యానం చేయడం వల్ల ప్రశాంతతను ఇస్తుంది. ఆందోళన లేకుండా సమస్యలను తట్టుకుని, ముందడుగు వేసే శక్తినిచ్చే ఆయుధాలుగా వీటిని మలుచుకున్నాను.



– కవిత ఎన్.
సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

బ్యూటిప్స్



గుప్పెడు వేపాకులు ఎండబెట్టి పొడి చేసుకోవాలి. అందులో చిటికెడు పసుపు, తగినన్ని రోజ్‌వాటర్ కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. దానిని ముఖానికి పట్టించి ఇరవై నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. అప్పుడప్పుడు ఇలా చేస్తుంటే ముఖచర్మం అందంగా, ఆరోగ్యంగా తయారవుతుంది.



టీ స్పూన్ పెరుగు, అర టీ స్పూన్ ఆరెంజ్ జ్యూస్ కలిపి ముఖానికి రాయాలి. వేళ్లతో కొద్దిగా మసాజ్ చేసి, ఐదు నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల మలినాలు తొలగి, చర్మం కాంతివంతం అవుతుంది.



అదర్ సైడ్

రాజస్థాన్‌లోని ఒక గ్రామంలో డీన





'గ్లోబల్ సమ్మిట్ ఆఫ్ ఉమెన్'లో డీన వాపో

లండన్ నుంచి పేదోళ్ల ఇంటి వరకు...

బ్రిటీష్–ఇండియన్ మోడల్‌గా ప్రసిద్ధురాలైన డీన వాపో లండన్–ఇండియాల మధ్య సంచరిస్తూ ఉంటుంది. 'మల్టీ టాలెంటెడ్'గా పేరు తెచ్చుకున్న డీన మన దేశ పేదల కోసం పనిచేస్తోంది. అబుదాబిలో జరిగిన 'గ్లోబల్ సమ్మిట్ ఆఫ్ ఉమెన్'లో స్త్రీసాధికారతకు సంబంధించి కీలక ఉపన్యాసం చేసింది...

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని అబుదాబిలో జరిగిన 'గ్లోబల్ సమ్మిట్ ఆఫ్ ఉమెన్'లో వందదేశాల నుంచి వివిధరంగాల మహిళలు పాల్గొన్నారు. ప్రధాన వక్తల్లో డీన వాపో (మిస్ ఇండియా, యూకే విన్నర్ 2012) ఒకరు.

'భిన్నరంగాలకు చెందిన నిష్ణాతులు, మేధావులతో కలిసి ఈ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది. లింగ సమానత్వం, మహిళా సాధికారత, మహిళల నాయకత్వం...మొదలైన అంశాలపై విస్తృతమైన చర్చ జరిగింది. ఎన్నో రకాల విషయాలు తెలుసుకునే అవకాశం వచ్చింది' అంటుంది డీన.

భారతీయ మూలాలు ఉన్న డీన వాపో బహుముఖ ప్రజ్ఞాశాలి.

'కొత్త విద్య నేర్చుకున్నప్పుడల్లా నీకు నువ్వు కొత్తగా కనిపిస్తావు. కొత్త శక్తి నీలోకి వచ్చి చేరుతుంది' అంటున్న డీన చిన్న వయసులోనే పాటలు పాడడంలో ప్రావీణ్యం సంపాదించింది. నటన, నృత్యాలలో భేష్ అనిపించుకుంది. కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. మోడల్ రంగంలోకి అడుగు పెట్టి సక్సెస్ అయింది.

2012లో 'మిస్ ఇండియా యూకే' కిరీటంతో ప్రపంచదృష్టిని ఆకర్షించింది.

మన బాలీవుడ్‌తో సహా ఎన్నో సినిమాల్లో నటించిన డీన 'డీకెయూ వరల్డ్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది....ఇదంతా ఒక కోణం అయితే 'డీకేయూ కైండ్‌నెస్' ట్రస్ట్ అనేది మరో కోణం. సామాజిక కోణం.

అట్టడుగు వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, లైఫ్ స్కిల్స్...మొదలైన వాటికి ఉపకరించే ట్రస్ట్ ఇది. ఈ ట్రస్ట్ తరఫున రెండు సంవత్సరాల క్రితం రాజస్థాన్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లి స్కూల్లో చదివే బాలికలతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడింది. ట్రస్ట్ తరఫున ఎడ్యుకేషనల్ కిట్స్ పంచింది.

'మీకు సహాయం చేయడానికి డీకేయూ ట్రస్ట్ ఉందనే విషయం ఎప్పుడూ మరవద్దు. ఇది మా ట్రస్ట్ కాదు. మనందరి ట్రస్ట్' అని చెప్పి పిల్లలు, తల్లిదండ్రులలో ధైర్యాన్ని నింపింది డీన.

గత సంవత్సరం దీపావళి పండగను రాజస్థాన్‌లోని జహోర అనే గ్రామంలో జరుపుకుంది. స్వీట్లు, ఎడ్యుకేషనల్ టూల్స్ పంచడమే కాదు తమ ట్రస్ట్ గురించి వారికి వివరించింది.

'క్షేత్రస్థాయిలోకి వెళ్లడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. మన ప్రపంచం విస్తృతం అవుతుంది. చేయాలనుకున్న మంచి పనుల జాబితాలో మరి కొన్ని పనులు వచ్చి చేరుతాయి' అంటుంది డీన.

ఇంగ్లాండ్‌లోని బ్రాగటి నగరంలో పుట్టింది డీన. తన పన్నెండవ యేట తండ్రి క్యాన్సర్‌తో చనిపోయాడు. ఆతరువాత తల్లితో కలిసి మిడ్‌లాండ్స్(సెంట్రల్ ఇంగ్లాండ్)కు వెళ్లింది.

ఒక విషాదానికి సంబంధించిన జ్ఞాపకాలకు దూరంగా, గాలి మార్పు కోసం తల్లి తనను కొత్త ప్రదేశానికి తీసుకు వెళ్లింది. అయితే డీనకు కొత్త ప్రదేశాలే కాదు కొత్త విద్యలు నేర్చుకోవడం అంటే కూడా ఎంతో ఇష్టం. ఆ ఇష్టమే తనను పదిమందిలో ప్రత్యేకంగా కనిపించేలా చేసింది.

'ఇండియాస్ ఫర్‌గాటెన్ పీపుల్' (నెట్‌ఫిక్స్)లో నటిగా మంచి మార్కులు తెచ్చుకుంది డీన.

అయితే విస్మరణ వర్గాల గురించి ఆమె తపన కాల్పనిక చలన చిత్రానికే పరిమితం కావడం లేదు. ట్రస్ట్ కార్యకలాపాల ద్వారా తన ఆదర్శాలు, ఆలోచనలు వాస్తవ రూపం దాల్చుతున్నాయి.

హెల్త్

ఎప్పుడూ 'యూత్‌ఫుల్'గానే ఉండాలంటే!



అప్పట్లో ఓ కోలా యాడ్‌లో ఓ ఇంగ్లిష్ జింగిల్ వస్తుండేది. "ఎనీ వేర్ ఇన్ ద వరల్డ్... ఇట్స్ గ్రేటు బి యంగ్" అని. పూర్తి శరీరాన్నంతటినీ, ఆమాటకొస్తే లోపలి అవయవాలనూ, వాటి కండరాలను కూడా కప్పి ఉంచే చర్మాన్ని యూత్‌ఫుల్‌గా ఉంచేది 'కొలాజెన్' అనే ప్రొటీన్. అదెలా పొందవచ్చో, తద్వారా చాలాకాలం పాటు మధ్యవయసు లుక్‌నూ, వృద్ధాప్య లక్షణాలనూ దూరంగా ఉంచడం ఎలాగో, వయసు పెరుగుతున్నా (ఏజింగ్ జరుగుతున్నా) యూత్‌ఫుల్‌గా నిత్యయౌవనులుగా కనిపించడం ఎలాగో తెలిపే కథనం ఇది.

వయసు పెరుగుతుంటే కొందరిలో చుబుకం కింద, కొందరిలో కళ్ల కిందున్న చర్మం కాస్త కాస్తగా జారుతుంటుంది. స్కిన్ జారిపోవడానికి కారణంగా 'కొలాజెన్' అనే ప్రొటీన్ లోపించడమే. కొలాజెన్ స్వాభావికంగానే వృద్ధి చెందడానికి ఏయే ఆహారాలు తీసుకోవాలో, అప్పటికీ ప్రయోజనం లేకపోతే ఎలాంటి ప్రక్రియలు అవలంబించవచ్చో తెలుసుకుందాం.

కొలాజెన్ అంటే...

నిజానికి ఇదో ప్రొటీన్. చర్మంలో ఎక్కువగా ఉంటుంది. కేవలం చర్మంలోనే కాకుండా దేహంలోని అనేక అవయవాల్లో... అంటే కండరాల్లో, ఎముకల్లో, టెండన్స్, కణజాలాల్లో, రక్తనాళాల్లో, జీర్ణవ్యవస్థలోని అన్ని భాగాల్లో... ఆ మాటకొస్తే మనకు ఎక్కడైనా గాయం తగిలినప్పుడు, గాయం మానే సమయాల్లో ఇలా అన్ని ప్రదేశాల్లోనూ ఉంటుంది.

ఆహారంతోనే కొలాజెన్ పొందడమెలా?

మాంసాహారాల్లో... చికెన్ ● చేపలు (అందునా ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే ట్యూనా, మాకరెల్స్‌తో పాటు షెల్‌ఫిష్ వంటివి) ● గుడ్డులోని తెల్లసొన భాగం

శాకాహారాల్లో... ● అన్ని రకాల నిమ్మజాతి పండ్లు (అంటే నిమ్మ, నారింజ, బత్తాయి, కమలాల వంటివి) ● బెర్రీ పండ్లు (అంటే... రాస్ప్‌బెర్రీ, బ్లూబెర్రీ, బ్లాక్ బెర్రీ వంటివి) ● ట్రాపికల్ ఫ్రూట్స్‌లో (అంటే... మామిడి, జామ, పైనాపిల్, ద్రాక్ష, కివీ... వీటిల్లో ఉండే జింక్ కూడా యాంటీ ఏజింగ్‌కు అదనంగా ఉపయోగపడే పోషకం)

వంటలో వాడే పదార్థాల్లో : ● వెల్లుల్లి (ఇందులో కొలాజెన్‌ను సమకూర్చే పోషకాలు చాలా ఎక్కువ) ● ముదురు ఆకుపచ్చరంగులో ఉండే పాలకూర లాంటి అన్ని ఆకుకూరల్లో ● చిక్కుళ్లు ● టొమాటో ● బెల్‌పెప్పర్‌లతో పాటు ● జీడిపప్పు, బాదంపప్పు లాంటి నట్స్‌లో. ● ఇవేగాక ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే అన్ని ఆహారాలూ కొలాజెన్ ఉత్పత్తికి బాగా తోడ్పడతాయి).

కొలాజెన్‌కు ప్రతికూలంగా పనిచేసే ఆహారాలు ఇవీ:

చక్కెర ఎక్కువగా ఉండే స్వీట్లు, బాగా రిఫైన్స్ చేసిన కార్బోహైడ్రేట్లు కొలాజెన్‌కు కొంత ప్రతికూలంగా పనిచేస్తాయి.

కొలాజెన్ ఉత్పత్తికి తోడ్పడే కొన్ని బ్యూటీ ప్రక్రియలు:

● **అలోవేరా జెల్ :** అలోవేరా జెల్‌ను చర్మంపై పూయడం, నోటి ద్వారా 'ఆలో స్టెరాల్స్' తీసుకోవడం. ఈ ప్రక్రియలు కనీసం ఎనిమిది వారాలు కొనసాగాలి.

● **జిన్‌సెంగ్ :** హెర్బల్ ఉత్పాదన అయిన జిన్‌సెంగ్‌ను తీసుకోవడం. దీన్ని టీ, టింక్చర్స్ లేదా సప్లిమెంట్స్‌గా తీసుకోవచ్చు.

● **రెటినాల్స్ అండ్ కెరొటినాయిడ్ సప్లిమెంట్స్:** బీటా కెరోటిన్ ఎక్కువగా దొరికే... మాంసాహారాల్లో కాలేయం, శాకాహారాల్లో చిలగడదుంప, గుమ్మడి, క్యారెట్స్ తీసుకోవడం.

వైద్యచికిత్సా ప్రక్రియల సహాయంతో...

● **థ్రెడ్స్ ట్రీట్‌మెంట్:** వీటిల్లో ఫ్లోటింగ్, ఫ్రీ, కాగ్ థ్రెడ్స్ అని రకరకాల చికిత్సలు ఉంటాయి. పేషెంట్ అవసరాన్ని బట్టి డాక్టర్ వీటిల్లో ఏదో ఒకదాన్ని ఎంపిక చేస్తారు. ప్రభావం నెల తర్వాత తెలుస్తుంది. ఈ చికిత్స ప్రభావం ఏడాది వరకే ఉంటుంది. కాబట్టి మళ్లీ మళ్లీ చేస్తుండాలి.

● **పీఆర్‌పీ థెరపీ ఫర్ ఫేస్:** ఈ చికిత్సలో పేషెంట్స్ నుంచి రక్తాన్ని సేకరించి, అందులోని ప్లేట్‌లెట్ సేకరించి ముఖానికి ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. ఇందులోనే పీఆర్‌ఎఫ్ (ఫైబ్రిన్), గ్రోత్‌ఫ్యాక్టర్ కాన్సంట్రేట్ పీఆర్‌పీ అనే కొత్త కొత్త చికిత్సలూ అందుబాటులోకి వచ్చాయి. దీన్ని నెలకొకసారి చొప్పున కనీసం 4 – 5 సార్లు చేయాలి.

● **మైక్రో నీడ్లింగ్ ఆర్‌ఎఫ్ :** రేడియో ఫ్రీక్వెన్సీ తరంగాలను ఉపయోగించి ముఖంపై ముడుతలను తగ్గించడానికి ఉపయోగిస్తారు.

● **ఫ్రాక్షనల్ సీఓటూ లేజర్ :** లేజర్‌ను ఉపయోగించి, ముఖాన్ని తేటగా చేయడానికి ఈ ప్రక్రియను ఉపయోగిస్తారు.

● **హైఫూ :** హై ఇంటెన్సిటీ ఫోకస్ అల్ట్రాసౌండ్ అనే మాటకు హైఫూ సంక్షిప్త రూపం. దీన్ని వివిధ తీవ్రతలతో వాడుతూ, సాగిన చర్మాన్ని బిగుతుగా చేయడానికి, డబుల్‌చిన్ తొలగించడానికి ఉపయోగిస్తుంటారు.

● **హైలూరానిక్ యాసిడ్ ట్రీట్‌మెంట్ :** శరీరంపైన పూసే క్రీములు, ఆయింట్‌మెంట్ల రూపంలోనూ, ఇంజెక్షన్ల రూపంలోనూ, అలాగే స్కిన్ బూస్టర్ ఇంజెక్షన్స్ ఇస్తారు. దీని వల్ల చర్మానికి మంచి హైడ్రేషన్ సమకూరి, ఏజింగ్ ఆలస్యం అవుతుంది.

● **రెడ్ లైట్ థెరపీ :** చర్మాన్ని ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలతో కూడిన ఎరుపురంగులో ఉండే కాంతి కిరణాలకు ఎక్స్‌పోజ్ చేయడం వల్ల చర్మంలో, దేహంలో కొలాజెన్ కొంత ఎక్కువగా ఉత్పత్తి జరుగుతుందని కొన్ని అధ్యయనాల్లో తేలింది. అయితే ఇదే ప్రధాన థెరపీలాగా కాకుండా... మిగతా చికిత్సలతో పాటు దీని ఓ అదనపు చికిత్సగానే పరిగణించాలి.

● **ఓరల్ కొలాజెన్ పౌడర్స్ ఎన్‌రిచ్‌డ్ విత్ విటమిన్ సి అండ్ యాంటీఆక్సిడెంట్స్ :** ఇవి నోటి ద్వారా తీసుకునే పౌడర్లు. ఇవే గాక ఇలాంటి ఇంజెక్షన్లూ లభ్యమవుతాయి.

చేయకూడనివి...

లేత ఎండకు ఎక్స్‌పోజ్ కావడం పరవాలేదు. అది చర్మానికి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ తీవ్రమైన ఎర్రటి ఎండ, దేహం కమిలిపోతున్నంత ఎండ వేడిమికి ఎక్స్‌పోజ్ కాకుండా కాపాడుకోవాలి.

గమనిక : ఎప్పుడైనా, ఎక్కడైనా స్వాభావికాలే మేలు. వైద్య ప్రక్రియలను ఆచరించాలనుకుంటే స్వాభావికమైన ఆహారాలనే తీసుకుంటూ, ఈ ప్రక్రియల్నీ తీసుకుంటేనే ఉపయోగం ఉంటుంది. అంతేతప్ప పూర్తిగా వైద్యపరమైన చికిత్సలే కొలాజెన్ పెరుగుదలకు ప్రామాణికాలు కావు. ఒకవేళ కొలాజెన్ వృద్ధి కోసం వైద్యపరమైన ప్రక్రియలను తీసుకోవాల్సి వస్తే పూర్తిగా క్వాలిఫైడ్ దర్మటాలజిస్టుల నేతృత్వంలోనే తీసుకోవాలి.




డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

మెడి టిప్

సీ, డీ, ఈ, ఎఫ్... అక్షరాలతో ఆస్టియోపోరోసిస్ నివారణ తేలిక!


అందరిలోనూ 20 ఏళ్లు వచ్చే వరకు ఎముకలు వేగంగా పెరుగుతుంటాయి. మనలో దాదాపు 40 ఏళ్లు వచ్చేవరకు ఎముకలు కాస్త బలంగా గట్టిగా ఉంటాయి. ఆ తర్వాత క్రమంగా పలచబడుతూ, పెళుసుగా మారుతూ ఉంటాయి. ఇలా ఎముకలు పలచబారుతూ తేలిగ్గా విరిగేలా పెళుసుబారడాన్ని 'ఆస్టియోపోరోసిస్' అంటారు. ఈ ముప్పు మహిళల్లో మరీ ఎక్కువ. మహిళలైనా, పురుషులైనా ఆస్టియోపోరోసిస్ నివారణ కోసం ఈ కింది అక్షరాల సహాయంతో అవలంబించాల్సిన జాగ్రత్తలను గుర్తుపెట్టుకోవచ్చు. అవి... ● 'సి' ఫర్ క్యాల్షియమ్– ఎక్కువగా తీసుకోవాలి. అంటే క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే పాలు, ఆకుకూరల వంటివి. ● 'డి' ఫర్ విటమిన్ డి – శరీరానికి తగినంత అందేలా చూసుకోవాలి. ఇందుకోసం లేత ఎండలో నడక, వ్యాయామం మేలు. ● 'ఈ' ఫర్ ఎక్సర్‌సైజ్ – శరీరాన్ని తగినంత వ్యాయామాన్ని అందించాలి. ● 'ఎఫ్' ఫర్ 'ఫాల్స్' – ఫాల్ అంటే ఇంగ్లిష్‌లో పడిపోవడం. వయసు పెరిగినవారికి బాత్‌రూమ్‌ల వంటి చోట్ల, ఎక్కడానికి అంత అనువుగా లేని మెట్లు ఉండే చోట్ల పడిపోవడం సాధారణంగా జరుగుతుంటుంది. ఇలా పడిపోయే అవకాశాల్ని తగ్గించుకోవాలి. అంటే ఆయా ప్రదేశాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి.



లివర్ క్యాన్సర్ - రకాలు - లక్షణాలు

హెపాటో లేదా హెపాటిక్ అని పిలిచే ఈ గ్రీకు పదానికి కాలేయం అని అర్థం. జీవక్రియల్లో కీలకపాత్ర పోషించే మన కాలేయం దాదాపు 500 రకాలకు పైగా క్రియలను నిర్వర్తిస్తుంది. కాస్త తొలగించినా... తిరిగి పెరిగేలా... పూర్తిగా పునరుత్పత్తి సామర్థ్యం కలిగిన ఏకైక అవయవం. మన శరీరం లోపలి అవయవాల్లో అతి పెద్దదైన కాలేయాన్ని అతి పెద్ద గ్రంథిగా పేర్కొనవచ్చు. నాలుగు భాగాలుగా విభజితమై ఉండే కాలేయం దాదాపు కిలోన్నర వరకు బరువుంటుంది. దానికి వచ్చే క్యాన్సర్ గురించి తెలుసుకుందాం.

విష పదార్థాలు, కలుషిత ఆహారం, నీరు, మద్యం, ధూమపానం వల్ల కాలేయం మీద ప్రభావం పడి వాపునకు గురవుతుంది. దాన్ని 'హెపటైటిస్' అంటారు. హెపటైటిస్‌కు గురిచేసే వైరస్‌లు... ఏ, బి, సి, డి, ఇ అని ఐదు రకాలుగా ఉంటాయి. వీటిల్లో బీ, సీ వైరస్‌లు ప్రమాదకరమైనవి. రక్తమార్పిడి, అరక్షిత శృంగారం వల్ల, అలాగే తల్లి నుంచి బిడ్డకు...ఇవి సోకే ప్రమాదం ఎక్కువ. హెపటైటిస్–బి వైరస్ సోకకుండా వ్యాక్సిన్ ఉంది. కానీ... హెపటైటిస్–సి కు వ్యాక్సిన్ లేదు. అప్పటికే హెపటైటిస్–బి ఉన్నవారు వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ఈ వ్యాక్సిన్ వేయించుకునే ముందర పరీక్ష చేయించుకుని నెగెటివ్ ఉంటే ఏ వయసువారైనా వేయించుకోవచ్చు. ఆకలి తగ్గడం, వికారం, కామెర్లు, జ్వరం, కీళ్లనొప్పులు వంటి సమస్యలు ఉన్నప్పుడు చెట్ల వైద్యం, నాటు వైద్యం వంటి సొంతవైద్యాలు చేసుకోకుండా... కారణం తెలుసుకుని అవసరమైన చికిత్స తీసుకోవడం ఉత్తమం. లివర్ ఇన్ఫెక్షన్స్, ఫ్యాటీ లివర్, లివర్ యాబ్సెస్, విల్సన్ డిసీజ్, గిల్‌బర్ట్ సిండ్రోమ్ వంటి కాలేయ వ్యాధులున్నప్పుడు... హెపటైటిస్ బి, సి వైరల్ ఇన్ఫెక్షన్స్ సోకితే... వాటి ప్రభావంతో కొన్నేళ్ల తర్వాత కాలేయం గాయపడినట్లుగా లేదా గట్టిగా మారడం (సిర్రోసిస్), అటు తర్వాత కాలేయ క్యాన్సర్‌కు దారితీయడం ఎక్కువమందిలో జరుగుతుంది.



కాలేయంలోనే మొదలయ్యే హెపాటో సెల్యులార్ కార్సినోమా అనే క్యాన్సర్... దేహంలో ఇతర ప్రాంతాల్లో క్యాన్సర్ వచ్చి అది కాలేయానికి పాకే మెటాస్టాటిక్ లివర్ క్యాన్సర్ అనే రెండు రకాలు ఉంటాయి. జీర్ణవ్యవస్థలోని క్యాన్సర్స్, బ్రెస్ట్‌క్యాన్సర్, లంగ్ క్యాన్సర్... ఇలాంటి ఏ క్యాన్సర్ అయినా కాలేయానికి పాకే ప్రమాదం ఎక్కువ. ఆలస్యంగా బయటపడే లివర్ క్యాన్సర్ చాలా ప్రమాదకరమైనదిగా పేర్కొనవచ్చు.

కాలేయ క్యాన్సర్ తొలిదశలో లక్షణాలు అంత తీవ్రంగా కనిపించకపోవడం వల్ల ఇతర సమస్యలుగా పొరబడే అవకాశం ఎక్కువ. కడుపునొప్పి, బరువు తగ్గడం, కామెర్లు, పొట్టలో నీరు చేరడం, వాంతులు, వికారం, ఆకలి లేకపోవడం వంటి సమస్యలు లివర్ క్యాన్సర్ ముదిరిన దశలో తీవ్రంగా ఉంటాయి. ఈ లక్షణాలు కనిపించినా... హెపటైటిస్ బి, సి వైరస్‌లు పాజిటివ్ ఉన్నా, మద్యం వంటి అలవాట్లు ఉన్నా... రక్తంలో ఎర్రరక్తకణాల సంఖ్యను, షుగర్, క్యాల్షియం, కొలెస్ట్రాల్, ఆల్ఫా ఫీటో ప్రొటీన్ (ఏఎఫ్‌పీ)ను రక్తపరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్, డాక్టర్ సలహా మేరకు ట్రిపుల్ ఫేజ్ సీటీ, ఎమ్మారై, పీఈటీ స్కాన్‌లు చేయించాలి. లివర్ బయాప్సీ చేయించడం వల్ల క్యాన్సర్, దాని స్టేజ్ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

ఈ క్యాన్సర్ పెరిగే గుణం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కొందరిలో నెలలోపే గడ్డ (కణితి) సైజు రెట్టింపు అయితే... మరికొందరిలో ఏడాది పైగా తీసుకోవచ్చు. కణితిని చిన్న సైజులో ఉన్నప్పుడే గుర్తించినా... లివర్ సిర్రోసిస్‌కు గురికావడం వల్ల చాలామందిలో సర్జరీ కుదరకపోవచ్చు. ఇమ్యూనోథెరపీ, కీమోథెరపీ, ట్రాన్స్ ఆర్టీరియల్ కీమో ఎంబోలైజేషన్ (టీఏసీఈ), రేడియో అబ్లేషన్, ప్రోటాన్ బీమ్ థెరపీ, క్రయో అబ్లేషన్, స్టీరియోటాక్టిక్ రేడియో సర్జరీ వంటి అనేక పద్ధతుల్లో కణితిని తొలగించే లేదా తగ్గించే ప్రయత్నాలు చేస్తారు. గడ్డ చిన్నగా ఉండి, మిగతా కాలేయం బాగానే ఉండి ఫెయిల్యూర్‌కు గురికాకుండా ఉంటే సర్జరీయే సరైన మార్గం. కణితి పరిమాణం పెద్దగా ఉన్నా, అనేక కణుతులు ఉన్నా, లివర్ ఫెయిల్యూర్‌కు గురవుతూ ఉంటే... కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించడంతో పాటు, గతంలో ఎప్పుడైనా ఇతర క్యాన్సర్స్‌కు గురయి, చికిత్స తీసకున్నా ఎప్పటికప్పుడు కాలేయానికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటూ ఉండటం చాలా మంచిది.

చాలామందిలో హెపటైటిస్–బి పాజిటివ్ ఉన్నా, ఏళ్లతరబడి ఎలాంటి లక్షణాలూ కనిపించకుండా ఆరోగ్యకరంగానే ఉండవచ్చు. కానీ వారి నుంచి ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుంది. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే ముందే పరీక్షలు చేయించుకోవడం, ఒకవేళ ప్రెగ్నెన్సీలో ఈ వైరస్ ఉన్నట్లు గుర్తించినట్లయితే పుట్టిన బిడ్డకు వెంటనే 12 గంటలలోపు హెపటైటిస్ ఇమ్యూనోగ్లోబ్యులిన్ (హెచ్‌బీఐజీ) ఇప్పించడం మంచిది. ఒకవేళ ఈ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తితో కలిసి ఉన్నట్లు అనుమానం ఉన్నా, వాళ్ల రక్తం... శరీరంలో ప్రవేశించినట్లు అనుమానం ఉన్నా ముందుజాగ్రత్త చర్యగా ఆ సంఘటన జరిగిన 14 గంటలలోపే హెచ్‌బీఐజీ ఇంజెక్షన్ తీసుకుంటే హెపటైటిస్–బి పాజిటివ్ కాకుండా కాపాడుకోవచ్చు.



Dr. Ch. Mohana Vamsy
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,



యూపీ వారియర్స్ వైస్ కెప్టెన్‌గా దీప్తి శర్మ

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే యూపీ వారియర్స్ జట్టు వైస్ కెప్టెన్‌గా భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మను నియమించారు. ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ అలీసా హీలీని ఇప్పటికే కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఉత్తరప్రదేశ్‌కే చెందిన దీప్తి శర్మ ఇప్పటి వరకు భారత జట్టు తరఫున 92 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడి 941 పరుగులు చేయడంతోపాటు 102 వికెట్లు పడగొట్టింది. 25 ఏళ్ల దీప్తి ప్రస్తుతం ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో బౌలింగ్, ఆల్‌రౌండర్ విభాగాల్లో నాలుగో స్థానంలో ఉంది.

ఐటీఎఫ్ టోర్నీలో రన్నరప్‌గా రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. గుర్‌గ్రామ్‌లో శనివారం జరిగిన డబుల్స్ ఫైనల్లో మూడో సీడ్ రష్మిక-వైదేహి చౌదరీ (భారత్) జోడీ 2-6, 2-6తో రెండో సీడ్ జీల్ దేశాయ్ (భారత్)-పునిన్ కొవాపిటుక్‌టెడ్ (థాయ్‌లాండ్) ద్వయం చేతిలో ఓడిపోయింది. సింగిల్స్ విభాగంలో రష్మిక పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది.

చాంప్స్ ఎన్ఆర్ఐ, సర్ సీఆర్ రెడ్డి కాలేజీలు

ముగిసిన ఆంధ్రప్రదేశ్ సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ



ఎస్‌పీఎల్ జూనియర్ విభాగంలో చాంపియన్‌గా నిలిచిన ఎన్ఆర్ఐ కాలేజ జట్టు

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ కాలేజి (విజయవాడ), సీనియర్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజి (ఏలూరు) జట్లు చాంపియన్స్‌గా నిలిచాయి. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం ఎస్‌పీఎల్ టోర్నీ ఘనంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జల వనరుల శాఖ అంబటి రాంబాబు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథులుగా హాజరై విన్నర్స్, రన్నరప్ జట్లకు నగదు పురస్కారాలు, ట్రోఫీలను అందజేశారు. చాంపియన్ జట్లకు రూ. 25 వేలు... రన్నరప్ జట్లకు రూ. 15 వేలు చొప్పున నగదు పురస్కారం లభించింది.

జూనియర్ విభాగం ఫైనల్లో ఎన్ఆర్ఐ కాలేజి 35 పరుగులతో సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజి (విశాఖపట్నం)పై నెగ్గింది. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఎన్ఆర్ఐ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 151 పరుగులు సాధించింది. రూపేష్ (60 బంతుల్లో 73 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ రేవంత్ (45 బంతుల్లో 62; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో మెరిశారు. అనంతరం సాయి గణపతి కాలేజి 16.3 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఎన్ఆర్ఐ జట్టు బౌలర్లలో తరుణ్ 4 వికెట్లు, రేవంత్ 2 వికెట్లు పడగొట్టారు. రేవంత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించింది.

సీనియర్ విభాగం ఫైనల్లో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజి తొమ్మిది వికెట్ల తేడాతో శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ (సీకామ్) డిగ్రీ కాలేజి (తిరుపతి) జట్టును ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. మొదట సీకామ్ కాలేజి 19.3 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. శివ కార్తీక్ (51 బంతుల్లో 42 పరుగులు; 3 ఫోర్లు) రాణించాడు. సీఆర్ రెడ్డి కాలేజి బౌలర్ మనోజ్ నాలుగు, వికెట్లు పడగొట్టాడు. అనంతరం సర్ సీఆర్ రెడ్డి కాలేజి 15.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 117 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' గగన్ కుమార్ (47 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), సంజయ్ (27 బంతుల్లో 23; 3 ఫోర్లు) రాణించారు. జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ కాలేజి ఆటగాడు రేవంత్... సీనియర్ విభాగంలో సీఆర్ రెడ్డి కాలేజి ఆటగాడు మనోజ్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కించుకున్నారు.



ఎస్‌పీఎల్ సీనియర్ విభాగంలో టైటిల్ సాధించిన సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ జట్టు

సఫారీల కల నెరవేరేనా?

దక్షిణాఫ్రికా దేశం మొత్తం ఆదివారం మునివేళ్లపైకి రానుంది. పునరాగమనం తర్వాత అటు పురుషుల క్రికెట్‌లో గానీ, ఇటు మహిళల క్రికెట్‌లో గానీ ఏ ఫార్మాట్‌లోనైనా సాధ్యంకాని రీతిలో ఈసారి టీమ్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. స్వదేశంలో సత్తా చాటి తుది పోరుకు వచ్చిన టీమ్ ఈ అవకాశాన్ని పోగొట్టుకోరాదని భావిస్తోంది. అయితే అటువైపు ఉన్నది సాధారణ జట్టు కాదు. ఐదుసార్లు చాంపియన్ కావడంతో పాటు ప్రొఫెషనలిజంతో ప్రత్యర్థులకు పాఠాలు చెప్పగల ఆస్ట్రేలియా. ఇలాంటి నేపథ్యంలో తమ అభిమానుల ముందు సఫారీ మహిళల కల నెరవేరగలదా?

- నేడు మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్
- ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా 'ఢీ'
- సాయంత్రం గం. 6:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



టి20 ప్రపంచకప్‌తో దక్షిణాఫ్రికా కెప్టెన్ సునె లుస్, ఆస్ట్రేలియా కెప్టెన్ మెగ్ లానింగ్

కేప్‌టౌన్: మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగే ఈ పోరులో తొలిసారి ఫైనలిస్ట్ దక్షిణాఫ్రికా తలపడనుంది. టోర్నీలో ప్రదర్శన, గత రికార్డు చూస్తే ఆసీస్‌దే పైచేయిగా కనిపిస్తున్నా... సెమీస్‌లో ఇంగ్లండ్‌పై చూపిన స్ఫూర్తిదాయక ప్రదర్శన చూస్తే సఫారీ టీమ్‌లో కూడా ఆత్మవిశ్వాసం రెట్టింపు అయినట్లుగా ఉంది. ఈ స్థితిలో పోరు ఏకపక్షమా, హోరాహోరీగా సాగుతుందా చూడాలి. ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు తుది పోరుకు చేరడంతో ఫైనల్ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడుపోయాయి.

సమష్టితత్వంతో...

టోర్నీలో ఆసీస్ ఆటతీరు చూస్తే ఆ జట్టు ఏ ఒక్కరిపైనో ఆధారపడలేదు. ప్రతీ ఒక్కరు పరిస్థితులకు తగినట్లుగా ఆడారు. బ్యాటింగ్‌లో అలీసా హీలీ, బెత్ మూనీ చెరో రెండు అర్ధ సెంచరీలతో ముందు వరుసలో ఉండగా... తాలియా మెక్‌గ్రాత్, కెప్టెన్ మెగ్ లానింగ్ కీలక సమయాల్లో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్‌లతో జట్టును నిలబెట్టారు. బౌలింగ్‌లో మెగాన్ షుట్ (9 వికెట్లు), డార్సీ బ్రౌన్, వేర్‌హమ్ (చెరో 6 వికెట్లు) ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ఇద్దరు ఆల్‌రౌండర్లు గార్డ్‌నర్, ఎలీస్ పెర్రీ ఆసీస్ విజయాల్లో ప్రధాన పాత్ర పోషించారు.

వారిద్దరే కీలకం...

టోర్నీ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా అనూహ్యంగా శ్రీలంక చేతిలో ఓటమిపాలైంది. అమ్మాయిలంతా తీవ్ర విషాదంలో మునిగిపోగా, సొంత అభిమాలు కూడా ఆశలు వదిలేసుకున్నారు. అయితే ఆ తర్వాత జట్టు ఆట ఒక్కసారిగా మెరుగైంది. ముఖ్యంగా తజ్మీన్ బ్రిట్స్ (176 పరుగులు), లౌరా వాల్‌వార్ట్ (169) బ్యాటింగ్ భారాన్ని మోశారు. అయితే మిగతా బ్యాటర్లు విఫలం కావడం జట్టు బలహీనతను చూపిస్తోంది. దీనిని ఫైనల్లో ఎలా అధిగమిస్తారనేది చూడాలి. బౌలింగ్‌లో ఖాకా, మరిజాన్ కాప్, షబ్నిమ్ ప్రదర్శన కూడా దక్షిణాఫ్రికా విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

6 ఇరు జట్ల మధ్య 6 టి20లు మ్యాచ్‌లు జరగ్గా, అన్నీ ఆస్ట్రేలియానే గెలిచింది.

19 గత 20 అంతర్జాతీయ టి20ల్లో ఆస్ట్రేలియా 19 గెలిచింది.

జావెలిన్ నుంచి క్రికెట్‌కు...





ఇంగ్లండ్‌తో సెమీస్‌లో అర్ధ సెంచరీతో పాటు నాలుగు క్యాచ్‌లు పట్టి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన దక్షిణాఫ్రికా ఓపెనర్ తజ్మీన్ బ్రిట్స్ క్రికెట్ ప్రస్థానం అసాధారణం. అడ్డంకులను అధిగమించి ఇక్కడి వరకు రావడం స్ఫూర్తిదాయకం. 2007 వరల్డ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జావెలిన్ త్రోలో బ్రిట్స్ స్వర్ణం సాధించింది. ఆపై ఇదే ఆటలో మరింత ముందుకు వెళ్లేందుకు పట్టుదలగా సాధన చేసింది. 2012 లండన్ ఒలింపిక్స్ లక్ష్యంగా ఆమె సన్నాహాలు సాగాయి. ఈ మెగా ఈవెంట్ కోసం ఆమె అప్పటికే అర్హత సాధించింది కూడా. అయితే దురదృష్టం బ్రిట్స్‌ను పలకరించింది. 2011లో జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. మూడు నెలల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. శరీరంలో వేర్వేరు భాగాలన్నీ దెబ్బ తినగా, మళ్లీ మళ్లీ శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చింది. ఎలాంటి మార్గనిర్దేశనం లేని ఆ సమయంలో ఆత్మహత్యకు కూడా ప్రయత్నించింది. అయితే చివరకు కోలుకున్న తర్వాత క్రికెట్ వైపు మళ్లింది. నడవలేని స్థితి నుంచి మళ్లీ మైదానంలోకి దిగింది. పట్టుదలతో సాధన చేసి దేశవాళీలో మంచి ప్రదర్శనతో సీనియర్ స్థాయి వరకు ఎదిగింది. 2018 టి20 వరల్డ్‌కప్‌లోనే చాన్స్ లభిస్తుందని అనుకున్నా, త్రుటిలో చేజారింది. ఇప్పుడు ఈసారి తానే ముందుండి జట్టును ఫైనల్ వరకు నడిపించింది. సెమీస్‌లో ఒక క్యాచ్ కోసం డైవ్ చేసినప్పుడు ఒక్కసారిగా ఆమెను పాత జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. అయితే ఎలాంటి గాయాలు కాలేదని తెలుసుకొని ఊరట పొందింది. సొంత గడ్డపై వరల్డ్‌కప్ ఫైనల్ ఆడబోవడం కలగా ఉందని, మరొక్క మంచి ప్రదర్శనతో ట్రోఫీ అందుకునే క్షణం కోసం ఎదురు చూస్తున్నట్లుగా తజ్మీన్ బ్రిట్స్ భావోద్వేగంతో చెప్పింది.

నన్ను 'విఫల కెప్టెన్'గా పరిగణించారు: కోహ్లి



న్యూఢిల్లీ: కెప్టెన్‌గా భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించినా... ఐసీసీ ఈవెంట్లకు వచ్చేసరికి మాత్రం విరాట్ కోహ్లికి ఏదీ కలిసి రాలేదు. నాలుగు ఐసీసీ ఈవెంట్లలో నాకౌట్ (2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్, 2019 వన్డే వరల్డ్ కప్ సెమీస్, 2021 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2021 టి20 వరల్డ్ కప్ లీగ్‌దశ) మ్యాచ్‌లలో టీమిండియా ఓటమి పాలైంది. దాంతో ఒక్క ఐసీసీ టోర్నీ విజయం కూడా లేకుండానే కోహ్లి నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఐసీసీ టోర్నీల్లో సెమీస్, ఫైనల్ చేరినా సరే తనపై విఫల కెప్టెన్ ముద్ర పడిందని కోహ్లి వ్యాఖ్యానించాడు. 'టోర్నమెంట్‌లు గెలవడం కోసమే మనం ఆడతాం. అయితే నాలుగు ఐసీసీ టోర్నీలలో ప్రదర్శనను బట్టి నన్ను విఫల కెప్టెన్‌గా పరిగణించారు. నేను విజయాలు మాత్రమే అనే కోణంలో ఆలోచించలేదు. కొన్నిసార్లు ఫలితాలకంటే జట్టును తీర్చిదిద్దడం ముఖ్యం. ఆటగాడిగా నేను వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టు సభ్యుడిగా ఉన్నా. ఐదుసార్లు టెస్టు గద అందుకున్న టీమ్‌లోనూ భాగంగా ఉన్నా. అసలు ఏనాడూ ప్రపంచకప్ గెలవని వారూ ఉన్నారనే విషయం మరచిపోవద్దు. నేను గెలిచిన వాటి గురించి సంతోషిస్తున్నా తప్ప ఓడినవి గుర్తు చేసుకొని బాధపడే రకం కాదు. అన్ని ట్రోఫీలు ఇంట్లో ఉండాలనే అత్యాశ లేదు ' అని కోహ్లి చెప్పాడు. తాను ఫామ్ కోల్పోయి కఠిన పరిస్థితులను ఎదుర్కొంటునప్పుడు మాజీ కెప్టెన్ ఎమ్మెస్ ధోని మాత్రమే తనకు అండగా నిలిచాడని కోహ్లి గుర్తు చేసుకున్నాడు. 'రెండుసార్లు ధోని మెసేజ్ చేసి అలాంటి సమయంలో ఎలా దృఢంగా ఉండాలో చెప్పాడు' అని కోహ్లి అన్నాడు.

ఇంగ్లండ్‌దే ఆధిపత్యం

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ జట్టుతో జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజూ ఇంగ్లండ్ జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 315/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 8 వికెట్లకు 435 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. హ్యారీ బ్రూక్ (186; 24 ఫోర్లు, 5 సిక్స్‌లు) తన ఓవర్‌నైట్ వ్యక్తిగత స్కోరు మరో రెండు పరుగులు జోడించి అవుటవ్వగా... జో రూట్ (153 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) తన జోరు కొనసాగించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ 42 ఓవర్లలో 138 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఇంగ్లండ్ బౌలర్లలో అండర్సన్ (3/37), జాక్ లీచ్ (3/45) రాణించారు.

సినిమా

ఎండల్లో హాయ్ హాయ్..


● ఏప్రిల్‌లో సినిమాల జోరు

వేసవి వస్తోందంటే సినిమాల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు స్నేహితులతోనో, కుటుంబ సభ్యులతోనో సినిమాకి వెళుతుంటారు. మండే ఎండల్లో కూల్ కూల్‌గా ఏసీ థియేటర్లో కూర్చుని సినిమాని ఆస్వాదిస్తుంటారు. అందుకే సమ్మర్ టార్గెట్‌గా ఎక్కువ సినిమాలు సిల్వర్ స్క్రీన్‌కి వస్తుంటాయి. ఈ ఏప్రిల్‌లో తొమ్మిది సినిమాలకుపైగా ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. అయితే 'మే'కి మాత్రం ఇప్పటికి విడుదల తేదీ ఖరారైన సినిమా ఒకే ఒక్కటి ఉంది. నాగచైతన్య 'కస్టడీ' మే 12న విడుదల కానుంది. మరి.. ఏప్రిల్‌లో విడుదల కానున్న చిత్రాలపై ఓ లుక్కేద్దాం...





★ 'ధమాకా' చిత్రంతో వంద కోట్ల క్లబ్‌లో చేరారు హీరో రవితేజ. దీంతో ఆయన నటిస్తున్న తర్వాతి సినిమా 'రావణాసుర'పై ఇండస్ట్రీ వర్గాల్లో భారీ అంచనాలున్నాయి. సుధీర్ వర్మ దర్శకత్వంలో రవితేజ, అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో రవితేజ లాయర్ పాత్రలో కనిపిస్తారు. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ కథానాయికలుగా నటిస్తున్నారు.




★ వైవిధ్యమైన కథలు, విలక్షణమైన నటనతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు 'అల్లరి' నరేశ్. వినోదాత్మక చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన ఆయన 'నాంది', 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' వంటి చిత్రాల్లో సీరియస్ రోల్స్‌లో నటించారు. ప్రస్తుతం నరేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఉగ్రం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఎమోషనల్ యాక్షన్ మూవీగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మిర్నా మీనన్ హీరోయిన్. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ మూవీని ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించారు మేకర్స్.



★ నటుడు, కొరియోగ్రాఫర్, డైరెక్టర్ రాఘవ లారెన్స్ హీరోగా నటించిన చిత్రం 'రుద్రుడు'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్. కదిరేశన్ స్వీయ దర్శకత్వంలో ఫైవ్‌స్టార్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై రూపొందిన ఈ తమిళ చిత్రం తెలుగు, కన్నడ, మలయాళంలోనూ విడుదల కానుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాని గత ఏడాది డిసెంబర్ 23న విడుదల చేస్తామని చిత్రయూనిట్ ప్రకటించినా వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం కావడంతో రిలీజ్ కాలేదు. ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు కొత్త డేట్ ప్రకటించింది యూనిట్.

★ సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న 15వ చిత్రం 'విరూపాక్ష'. బైక్ ప్రమాదం నుంచి కోలుకున్న ఆయన ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర-సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 21న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. 1990 నేపథ్యంలో ఫారెస్ట్ బేస్డ్ విలేజ్‌లో జరిగే కథాంశంతో ఈ మూవీ రూపొందుతోందని సమాచారం.



చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. మెహర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 14న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేదు. మరి ముందుగా ప్రకటించినట్లు ఏప్రిల్ 14న 'భోళా శంకర్' రిలీజ్ అవుతుందా? మరో కొత్త డేట్‌ని అనౌన్స్ చేస్తారా? అనేది తెలియాలంటే వేచి చూడాలి.



★ అఖిల్ అక్కినేని హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ఏజెంట్'. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సాక్షీ వైద్య కథానాయికగా చేస్తున్నారు. రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏప్రిల్ 28న రిలీజ్ కానుంది. స్పై థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ఈ మూవీ కోసం సిక్స్‌ప్యాక్ దేహం, పొడవాటి హెయిర్ స్టైల్‌తో స్టైలిష్‌గా మేకోవర్ అయ్యారు అఖిల్. ఫారిన్‌లో చిత్రీకరించే ఓ ఫైట్‌తో ఈ సినిమా షూటింగ్ పూర్తవుతుందని తెలిసింది.



★ ప్రముఖ దర్శకుడు మణిరత్నం తెరకెక్కించిన హిస్టారికల్ మూవీ 'పొన్నియిన్ సెల్వన్ (పీఎస్-1)'. కల్కి కృష్ణమూర్తి రాసిన 'పొన్నియిన్ సెల్వన్' నవల ఆధారంగా ఈ సినిమాను తీశారు మణిరత్నం. తొమ్మిదో శతాబ్దం నాటి చోళ సామ్రాజ్యం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. విక్రమ్, కార్తీ, 'జయం' రవి, ఐశ్వర్యా రాయ్, త్రిష ప్రధాన పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, మద్రాస్ టాకీస్ నిర్మించిన ఈ చిత్రం తొలి భాగం 'పీఎస్ 1' గత ఏడాది సెప్టెంబర్ 30న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైంది. తెలుగులో నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేశారు. మలి భాగాన్ని ఏప్రిల్ 28న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటిస్తూ చిత్రయూనిట్ ఓ వీడియోను విడుదల చేసింది.



సమంత లీడ్ రోల్‌లో నటించిన పాన్ ఇండియా చిత్రం 'శాకుంతలం'. ప్రముఖ కవి కాళిదాసు రచించిన సంస్కృత నాటకం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు డైరెక్టర్ గుణశేఖర్. శకుంతల, దుష్యంత మహారాజు అజరామరమైన ప్రేమకథను ఈ మూవీలో చూపిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమా విడుదల ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడి ఫైనల్‌గా ఏప్రిల్ 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.



★ తెలుగు చిత్ర పరిశ్రమకి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు పంజా వైష్ణవ్ తేజ్. 'కొండపొలం', 'రంగరంగ వైభవంగా' తర్వాత తన నాలుగో చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో చేస్తున్నారు వైష్ణవ్ తేజ్. శ్రీకాంత్ రెడ్డి దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం గత ఏడాది జూన్‌లో ప్రారంభమైంది. తన కెరీర్‌లో తొలిసారి మాస్, యాక్షన్ మూవీ చేస్తున్నారు వైష్ణవ్ తేజ్. ఈ సినిమా ఏప్రిల్ 29న బాక్సాఫీస్ బరిలో నిలుస్తోంది.



● కార్తికేయ, ఎమ్ఎమ్ కీరవాణి, ఎస్ఎస్ రాజమౌళి, సెంథిల్ కుమార్, రామ్‌చరణ్

హెచ్‌సీపీ అవార్డ్స్‌లో సత్తా చాటిన ఆర్ఆర్ఆర్

అంతర్జాతీయ వేదికపై 'ఆర్ఆర్ఆర్' సినిమా మరోసారి సత్తా చాటింది. 'హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్' (హెచ్‌సీపీ) ఆరవ ఎడిషన్ అవార్డుల ప్రదానోత్సవం కాలిఫోర్నియాలో జరిగింది. ఇందులో 'ఆర్ఆర్ఆర్' చిత్రం ఐదు అవార్డులు (బెస్ట్ యాక్షన్ ఫిల్మ్, బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్, బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ స్టంట్స్, స్పాట్ లైట్ అవార్డు విభాగాల్లో..) సొంతం చేసుకుంది. కాగా గత ఏడాది డిసెంబరులో ప్రకటించిన స్పాట్‌లైట్ అవార్డును ఈ వేదికపై అందుకున్నారు 'ఆర్ఆర్ఆర్' టీమ్. కాగా ఈ అవార్డుల ప్రదానోత్సవంలో 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్' చిత్రం అత్యధికంగా ఏడు అవార్డులు సాధించడం విశేషం.

'హెచ్‌సీపీ' అవార్డుల ప్రదానోత్సవంలో రాజమౌళి మాట్లాడుతూ – ''ఈ గుర్తింపు నాకు, మా చిత్రానికే కాదు.. భారతీయ చిత్రపరిశ్రమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇండియాలో ఉన్న ఫిల్మ్‌మేకర్స్ అందరూ కూడా అంతర్జాతీయ స్థాయి సినిమాలను తీయగలరనే నమ్మకాన్ని ఈ అవార్డు (బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్) కలిగిస్తోంది. 'ఆర్ఆర్ఆర్' కోసం స్టంట్ కొరియోగ్రాఫర్ సాల్మన్ ఎంతగానో కష్టపడ్డారు. స్టంట్ కొరియోగ్రాఫర్స్‌కి కూడా ఓ విభాగాన్ని ఏర్పాటు చేసి అవార్డులు అందిస్తే బాగుంటుంది''అన్నారు. హీరో రామ్‌చరణ్ మాట్లాడుతూ– ''ఈ అవార్డుతో మా బాధ్యత పెరిగింది. మిమ్మల్ని అలరించే మరిన్ని మంచి చిత్రాలు చేస్తాం'' అన్నారు. 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' అవార్డును స్వీకరించిన కీరవాణి మాట్లాడుతూ–''నాటు నాటు..' పాటకు అవార్డు అందించిన హెచ్‌సీపీకు థ్యాంక్స్'' అన్నారు.

సారీ చెప్పిన హాలీవుడ్ నటి

హెచ్‌సీపీ అవార్డుల ప్రదానోత్సవానికి నటి, రచయిత, స్టాండప్ కమెడియన్ టిగ్ నొటారో వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అవార్డు ప్రెజెంటర్‌గా రామ్‌చరణ్‌ను వేదికపైకి పిలిచే సమయంలో పేరు పిలవడంలో ఇబ్బంది పడినందుకు ఆయనకు క్షమాపణలు చెప్పారు టిగ్ నొటారో.

కొత్త ఇంటికి!



హీరో మహేశ్‌బాబు కొత్త ఇంటికి వెళ్లనున్నారట. అయితే ఇది ఆయన నటిస్తున్న తాజా చిత్రం కోసమే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 27 నుంచి హైదరాబాద్‌లో షురూ కానుందని తెలిసింది. ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాష్ వేసిన ఓ ఇంటి సెట్‌లో ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారని సమాచారం.

● మహేశ్‌బాబు

మామ.. అల్లుడు వస్తున్నారు



● మీనా, రాజేంద్ర ప్రసాద్

సోహెల్, మృణాళిని జంటగా రాజేంద్ర ప్రసాద్, మీనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు'. ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వం వహించారు. కె.అచ్చిరెడ్డి సమర్పణలో కోనేరు కల్పన నిర్మించిన ఈ సినిమాని మార్చి 3న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''ఫ్యామిలీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అని చిత్రబృందం పేర్కొంది.

రాజకీయ నేపథ్యంలో...



● జీవీ నాయుడు, శ్యాం ప్రసాద్ రెడ్డి, సురేశ్ బాబు, మాధవ్

ప్రముఖ హిందీ నటుడు మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి 'నేనెక్కడున్నా' సినిమాతో టాలీవుడ్‌కి హీరోగా పరిచయమవుతున్నారు. మాధవ్ కోదాడ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సశా ఛెత్రి హీరోయిన్. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టైటిల్, పోస్టర్, టీజర్‌ని నిర్మాత దగ్గుబాటి సురేశ్ బాబు విడుదల చేశారు. ''జర్నలిజం, రాజకీయం నేపథ్యంలో వస్తున్న థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు మాధవ్ కోదాడ. ''త్వరలో సినిమాని రిలీజ్ చేస్తాం'' అన్నారు మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి.

క్రైమ్ థ్రిల్లర్



● రితికా సింగ్, హర్ష వర్ధన్

రితికా సింగ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఇన్ కార్'. హర్ష వర్ధన్ దర్శకత్వంలో అంజుమ్ ఖురేషి, సాజిద్ ఖురేషి నిర్మించిన ఈ సినిమా మార్చి 3న విడుదల కానుంది. రితికా సింగ్ మాట్లాడుతూ–''ఈ మూవీలోని నా పాత్ర కోసం షూటింగ్ పూర్తయ్యే వరకు నేను తల స్నానం చేయలేదు'' అన్నారు. ''సర్వైవల్ క్రైమ్ థ్రిల్లర్ డ్రామా 'ఇన్ కార్' అన్నారు హర్ష వర్ధన్. ఈ చిత్రానికి కెమెరా: మిథున్ గంగోపాధ్యాయ.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ఈఎన్‌సీలో ముగిసిన వార్షిక రీఫిట్ సదస్సు



ఏఆర్‌సీ సదస్సులో మాట్లాడుతున్న వైస్ అడ్మిరల్ సందీప్ నైతానీ

సాక్షి, విశాఖపట్నం: స్థానిక తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం (ఈఎన్‌సీ)లో రెండు రోజులపాటు నిర్వహించిన వార్షిక రీఫిట్ సదస్సుతోపాటు వార్షిక మౌలిక సదుపాయాలు, స్వదేశీ పరిజ్ఞాన సదస్సు శనివారం ముగిసింది. విశాఖలోని ఈఎన్‌సీ నౌకాదళ కమాండ్ ప్రధాన కార్యాలయంలో రక్షణ మంత్రిత్వ శాఖ ఇంటిగ్రేటెడ్ హెడ్‌క్వార్టర్స్ చీఫ్ ఆఫ్ మెటీరియల్ వైస్ అడ్మిరల్ సందీప్ నైతాని ఆధ్వర్యాన జరిగిన ఈ సదస్సులో నౌకాదళ ప్రధాన కేంద్రం, మూడు నావికాదళాల కమాండ్‌లు, అండమాన్ నికోబార్ కమాండ్ త్రివిధ దళాలు, నేవల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ జనరల్, నేవల్ డాక్‌యార్డులు, రిపేర్ యార్డుల ప్రతినిధులు హాజరయ్యారు. స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు, సబ్‌మెరైన్ల తయారీలో ముందడుగు వేయడంపై సందీప్ నైతాని ప్రశంసించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చెయిన్, క్వాంటం కంప్యూటేషన్, ఐవోటీ, 5జీ, రోబోటిక్ తదితర టెక్నాలజీల సహాయంతో నౌకాదళ మౌలిక సదుపాయాలు, రీఫిట్ అంశాల్లో మరింత పురోగతి సాధించాలని సూచించారు. రాబోయే 15 ఏళ్లలో నౌకాదళంలో చేరనున్న నౌకలకు అనుగుణంగా అదనపు బెర్తింగ్‌ల ఏర్పాటుపై భవిష్యత్ కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు.

డిస్కంలకు సీఈఆర్సీ షాక్!

- రూ.50కి అమ్ముకునేలా సీలింగ్‌లో మార్పులు చేసిన సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్
- పవర్ ఎక్స్ఛేంజ్‌లో ప్రస్తుతం యూనిట్ విద్యుత్ ధర రూ.12కే అమ్మకం
- 2021లో బొగ్గు సంక్షోభం కారణంగా యూనిట్ రూ.20కి కొని సరఫరా
- సీఈఆర్సీ తాజా నిర్ణయంతో డిస్కంలపై ఆర్థికంగా పెను భారంపడే ఛాన్స్

సాక్షి, అమరావతి : విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు నిజంగా ఇది పిడుగులాంటి వార్తే. ఖర్చుకు వెనుకాడకుండా అవసరమైనప్పుడు బహిరంగ మార్కెట్ (పవర్ ఎక్స్ఛేంజ్)లో అధిక ధర వెచ్చించైనా సరే విద్యుత్‌ను కొనుగోలు చేసి వినియోగదారులకు అందించే డిస్కంలపై ఆర్థిక భారం పెంచేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. పవర్ ఎక్స్ఛేంజ్‌లో ప్రస్తుతం యూనిట్ విద్యుత్ గరిష్ట ధర రూ.12గా ఉన్న సీలింగ్‌లో మార్పులు చేస్తూ కొన్ని విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు ప్రయోజనం చేకూరేలా యూనిట్ ధరను రూ.50గా నిర్ణయిస్తూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సీఈఆర్సీ) తాజాగా ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతానికి దిగుమతి చేసుకునే బొగ్గు, గ్యాస్ ఆధారిత ప్లాంట్లతో పాటు బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టమ్‌లకు మాత్రమే ఈ రేటు వర్తిస్తుందని చెబుతున్నప్పటికీ, రానున్న రోజుల్లో బొగ్గు కొరత,



విద్యుత్ డిమాండ్‌వల్ల అన్ని జెన్‌కోలు ఇదే ధరకు విద్యుత్ అమ్ముతామని పట్టుబట్టే అవకాశాలున్నాయని ఇంధనరంగ నిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు అనేది డిస్కంలకు పెనుభారంగా మారుతుంది. ట్రూ అప్ ఛార్జీలుగా అంతిమంగా ఈ భారం ప్రజలపైనే పడుతుంది.

అప్పుడే భారమనుకుంటే..

2021 అక్టోబర్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడ్డ బొగ్గు కొరతతో భారత్‌లోనూ తీవ్ర విద్యుత్ సంక్షోభం వచ్చింది. ఆ సమయంలో బొగ్గు నిల్వలు కూడా నిండుకోవడంతో రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తిస్థాయి లో నడపలేక బహిరంగ మార్కెట్‌లో యూనిట్ విద్యుత్‌ను గరిష్టంగా రూ.20 పెట్టి కొని వినియోగదారులకు అందించారు. గతేడాది వేసవిలోనూ ఇదే పరిస్థితి రావడంతో యూని ట్ ధర రూ.20 దాటింది. దీంతో దేశ వ్యాప్తంగా డిస్కంలు ఆందోళన వ్యక్తంచేయడంతో సీఈఆర్సీ రంగంలోకి దిగి విద్యుత్ అమ్మకం గరిష్ట ధర రూ.12 మించకూడదని ఆదేశాలు (సీలింగ్) జారీచేసింది. తాజాగా.. ఆ ఆదేశాలను సవరించి యూనిట్ రూ.50 రూపాయల వరకు విక్రయించుకోవడానికి అనుమతిచ్చింది. రాష్ట్రంలో రోజుకు 220 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంటే ఇందులో దాదాపు 30 మిలియన్ యూనిట్లు బయటి నుంచే కొంటున్నారు. ఇందుకోసం రోజూ రూ.18 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ ఖర్చుచేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ అమ్మకం ధర యూనిట్ రూ.9 వరకూ ఉంది. ఈ నెలలో డిమాండ్ 240 మిలియన్ యూనిట్లు, వచ్చే నెలలో 250 మిలియన్ యూనిట్లకు చేరుతుందని ఇంధన శాఖ ఇప్పటికే అంచనాకు వచ్చింది. ఈ లెక్కన బహిరంగ మార్కెట్‌లో విద్యుత్‌ను అధిక ధరకు అదనంగా కొనుగోలు చేయాల్సి వస్తుంది.

ఇలా అయితే కష్టమే..

కొన్నేళ్లుగా రాష్ట్ర విద్యుత్ సంస్థలు ఆధునిక సాంకేతికత(ఎనర్జీ ఫోర్‌కాస్ట్)ను ఉపయోగించుకుని బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు విద్యుత్ లభించే సమయాన్ని ముందుగానే అంచనా వేసి విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. ఈ విధంగా 2021లో రూ.4,925 కోట్లు ఆదా చేశాయి. ఈ మొత్తాన్ని వినియోగదారులకు బదిలీ చేసేందుకు వీలుగా 2021-22లో రూ.3,373 కోట్లను ట్రూ డౌన్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి నిర్ణయం తీసుకుంది. కానీ, బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ధరల కారణంగా రాష్ట్రంలోని తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత వి ద్యుత్ పంపిణీ సంస్థలు 2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో అనుకున్న దానికి మించి మూడు డిస్కంలు కలిపి రూ.9,029 కోట్లను విద్యుత్ కొనుగోలుకు ఖర్చుచేశాయి. నిజానికి అప్పుడు కొన్న విద్యుత్ యూనిట్ ధర సరాసరిన రూ.5.22-రూ.5.35 మాత్రమే. దానికే రూ.1,048 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. అలాంటిది రూ.20ని దాటి రూ.50కు కొనాల్సి వస్తే డిస్కంలు ఆర్థికంగా కుదేలవుతాయి.

మార్చి 26 నుంచి విజయవాడ-షిర్డీ విమాన సర్వీసులు

విమానాశ్రయం (గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి షిర్డీకి మార్చి 26 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ సర్వీసులను నడిపేందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ముందుకురావడంతోపాటు ప్రయాణ షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. 72 మంది ప్రయాణికుల సామర్థ్యం గల ఏటీఆర్ 72-600 విమానం రోజూ మధ్యాహ్నం 12.25 గంటలకు గన్నవరంలో బయలుదేరి మూడు గంటలకు షిర్డీ చేరుకుంటుంది. అలాగే షిర్డీ నుంచి మరో విమానం మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.35 గంటలకు గన్నవరం చేరుతుందని ఇండిగో ఎయిర్‌లైన్స్ వర్గాలు తెలిపాయి. విజయవాడ నుంచి షిర్డీకి ప్రారంభ టిక్కెట్ ధర రూ.4,246గా, షిర్డీ నుంచి ఇక్కడికి రూ.4,639గా నిర్ణయించారు. ఇప్పటివరకు షిర్డీ వెళ్లేందుకు రైలు, రోడ్డు మార్గాల ద్వారా గంటల తరబడి ప్రయాణించే వారికి ఈ సర్వీస్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. విజయవాడ నుంచి షిర్డీకి సుమారు 2.50 గంటల్లోనే చేరుకోవచ్చని విమానాశ్రయ అధికారులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో తాగునీటి వనరులకు పునరుజ్జీవం

- ఏపీలో ఏడు జిల్లాల్లో 'ఉపాధి' కూలీల ద్వారా పనులు
- మంచినీటి చెరువుల పునరుద్ధరణకు 8 రకాల కార్యక్రమాలు
- మరోవైపు మార్చి 4 నుంచి దేశ వ్యాప్తంగా 'క్యాచ్ ద రెయిన్'
- రాష్ట్రపతి చేతుల మీదగా ప్రారంభం



సాక్షి, అమరావతి: గ్రామాల్లోని సంప్రదాయ తాగునీటి వనరుల పునరుజ్జీవానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, పల్నాడు, వైఎస్సార్, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఈ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఆయా ప్రాంతాల్లో వర్షపు నీరు వీలైనంత ఎక్కువ నిల్వ చేసేలా.. నీటి కొలనులు, మంచినీటి చెరువుల వంటి సంప్రదాయ తాగునీటి వనరుల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పూడికతీత పనులు చేపట్టబోతోంది. ఉపాధి హామీ పథకం ద్వారా మొత్తం 8 రకాల పనులు చేపట్టనున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వెల్లడించారు. అలాగే గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల భాగస్వామ్యంతో ఆ ప్రాంతాల్లో భూమిలోని తేమ శాతం పెంచేందుకు విస్తృతంగా మొక్కల పెంపకం చేపట్టనున్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కేటగిరిలో గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో రూ.240 కోట్లతో ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాల వద్ద రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణం తదితరాలు చేపట్టేందుకు ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

మార్చి 4 నుంచి దేశవ్యాప్తంగా..

ఏపీలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పనుల తరహాలోనే దేశవ్యాప్తంగా మార్చి 4 నుంచి నవంబర్ 30 వరకు 'జలశక్తి అభియాన్-క్యాచ్ ద రెయిన్ 2023' పేరుతో కేంద్ర జలశక్తి శాఖ పలు కార్యక్రమాలు నిర్వహించబోతోంది. దేశం మొత్తం మీద నీటి ఇబ్బందులుండే జిల్లాలను గుర్తించి.. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణతో కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మార్చి 4న దీన్ని లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఇప్పటికే లేఖలు రాశారు. మరోవైపు.. కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ కార్యక్రమ లక్ష్యాలు, ప్రాధాన్యతల గురించి అన్ని రాష్ట్రాల అధికారులకు వివరించారు. కాగా, పట్టణ ప్రాంతాల్లో సైతం నీటి ఎద్దడికి అవకాశమున్న ప్రాంతాల్లో.. వార్డు స్థాయిలో వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


VISWASANTHI
SENIOR SECONDARY RESIDENTIAL SCHOOL
CBSE SCHOOL
IIT & Medical Foundation from VI to X Classes
Madala Subrahmaneyswara Rao
Founder & Managing Director
Madala Prameela Rani
Founder
Dr. M. SURYASEKHAR
Chief Executive Director
M. SUSHMA
Executive Director
Dr. M. RAJASEKHAR
Director
Dr. M. NEELIMA
Director
Separate Sections & Hostel for...BOYS & GIRLS
A.C. CAMPUS
LKG to X & XI, XII (PCM & PCB)
ESTD : 1975
Affiliated to CBSE, Delhi.
VUYYURU (Near Vijayawada), Krishna Dt., ANDHRA PRADESH.
Cell : 994 898 4444, 913 331 8502, 924 745 6148, 991 277 5666, 833 300 0899.
Web Site : www.sriviswasanthischools.in
E-mail Id : director.sriviswasanthi@gmail.com
ADMISSIONS ARE IN PROGRESS
NCC "A" & "B" Certificates
మా విశ్వశాంతి స్కూల్ విద్యార్థులే... మా విశ్వశాంతి జూనియర్ కాలేజి విద్యార్థులు... సాధించిన గొప్ప విజయాలు.
అతి తక్కువ మంది విద్యార్థులతోనే... అత్యధిక ర్యాంకులు
Congratulations to All
...2022 Batch Outstanding Achievements in...
IIT, IIST, NIT & IIIT
...2022 Batch Outstanding Achievement in...
NEET
A Golden Feather in our Cap
SECURED ALL INDIA 2nd RANK IN... IIT
ALL INDIA 2 RANK
L S BHARATH REDDY
Sophisticated Laboratory Equipment For Practicals
for More Details...
https://www.facebook.com/sriviswasanthischools.in
https://www.instagram.com/sri_viswasanthi_institutions
Google Review - https://g.page/r/CQ8veksZ_hkZEBM/review
https://twitter.com/sri_viswasanthi
Google Business - https://g.page/r/CQ8veksZ_hkZEBA
Website - https://www.sriviswasanthischools.in
2022 CBSE - Xth TOPPERS VICTORIOUS VISWASANTHIANS
Out Of 500 Marks Above 460
ALL INDIA RANK 9th
491 MARKS
MUTTATH ASHISH SIMON
ALL INDIA RANK 10th
490 MARKS
MADALA SUHASINI
486 484 479 479 478
477 477 476 476 475
475 472 471 471 470
470 470 469 467 467
465 465 465 465 465
464 464 462 462 461
460 460 460
2022 CBSE XII - PCB TOPPERS VICTORIOUS VISWASANTHIANS
Out Of 500 Marks Above 450
478 INAPAKURTHI BHUMIKA
474 CH DHANUSH PRASAD
469
468 461 455 454 450
2022 CBSE XII - PCM TOPPERS VICTORIOUS VISWASANTHIANS
Out Of 500 Marks Above 450
477 D V SAI LOKESH REDDY
477 M VENKATA CHARAN RAJ
475 473 471 468 467
466 465 465 464 462
459 458 452 451
Congratulations to All